ఆంధ్రపత్రిక

సచిత్రవారపత్రిక

స్వాతంత్ర్యసంచిక



★ వార్తాచిత్రాలు ★



మైసూరుమహాసభ ముగించుకొని తిరుగుప్రయాణంలో మద్రాసుకువచ్చిన అంతర్జాతీయ విద్యార్థి సేవాసమాజ ప్రతినిధులు.
వీరిని మద్రాసు మేయరు విందుచేసి గౌరవించారు.



బెల్జియం రాజు లియోపాల్డుకు వ్యతిరేక ప్రదర్శనలు చేసిన ప్రజలు



నూతన ఆంధ్ర ఆస్థానకవి శ్రీ శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రిగారు

ఆంధ్రపత్రిక

సంవత్సరచందా
రు 12-0-0
విడిప్రతిక
4 అణాలు

ప్రతిబుధవారము ప్రకటింపబడును.

ఒరులేయవి యొనరించిన నరవర, యప్రియము తనమనంబున కగు దా
నొరులకు నవి సేయకునికి పరాయణము పరమధర్మపథముల కెల్లన్
(మహాభారతము)

Founder . K NAGESWARA RAO

సంపుటము 42
సంచిక 50

వికృతి సంవత్సర శ్రావణ శుద్ధ తదియ బుధవారము



రాష్ట్రపతి సందేశము

"సత్యమార్గమును విడువక, నీతినియమముల గణుతించి అనుష్ఠించుటవలన మాత్రమే మన జాతి పురోభివృద్ధి పొందగలదను విషయమును నేడు ప్రత్యేకముగా నొక్కి వక్కాణింపవలసియున్నది నీచమైన స్వార్థపరత్వము నేడు మన సంఘమును పీడించుచున్న అనేకానర్థములకు మూలకందమైయున్నది అదియే నేడు బహుముఖములుగా పరిస్ఫుటమగుచున్నది అట్టి నీచవర్తనమును ప్రతిఘటించవలెను దానిని తొలగించి సభ్యమైన జీవనవిధానములను, సంప్రదాయములను నెలకొల్పి వానిని అనుసరింపవలెను కుటిలవర్తన మనునది, సులభముగా గ్రహింప వీలులేకుండ విస్తరించి ప్రజాపీడనముగా వ్యాపింపవచ్చును లేదా, దొంగవ్యాపారమనెడి ప్రత్యేకాపచారముగా వర్తించుచుండవచ్చును ఎంత కొద్దిపరిమాణములోనైనప్పటికిని, లంచగొండితనము, లేదా ఇతర అవినీతిధోరణిలో అది వర్తించవచ్చును లేదా కులవిభేద, మతసంఘవిభేదపక్షపాతచర్యలలో గాని, అంతర్రాష్ట్రీయ సంఘర్షణరూపములోగాని, అది వర్తించవచ్చును అటువంటి ప్రవర్తన మంతయును, హేయమైన స్వార్థపరత్వముగా గ్రహించి దానిని తుదముట్టించవలెను మహోన్నతమైన పురాతనవిజ్ఞానసంస్కారము గల ఘనభారతజాతి, విశేష ఆధ్యాత్మికశక్తిని మనోనిగ్రహబలమును గడించి గడితేరిన మన భారతజాతి ఈ అంతశ్శత్రువులను జయించగలదనియు, మన మందరమును గర్వించియుప్పొంగదగిన భవిష్యద్భారతప్రాభవమును సృజించగలదనియు విశ్వసించుచున్నాను"

—రాష్ట్రపతి రాజేంద్రప్రసాద్



ఆంధ్రపత్రిక

1950 వ సం॥ ఆగస్టునెల 16-వ తేది బుధవారము

స్వాతంత్ర్యము

" త్యమార్గమును విడువక, నీతినియమములను గుర్తించి అనుష్ఠించుటవలన మాత్రమే మన జాతి పురోవృద్ధి పొందగలదను విషయమును నేడు ప్రత్యేకముగా నొక్కి వక్కాణింపవలసియున్నది" అని రిపబ్లిక్ అధ్యక్షులు శ్రీరాజేంద్రప్రసాద్ గారు స్వాతంత్ర్యదిన తృతీయ వార్షికోత్సవముసందర్భమున భారతీయులకు సందేశమున జెప్పిరి. ఈ యుత్సవసందర్భమున సమాజమునందలి యవినీతిని ప్రత్యేకించి పేర్కొని, అది నివారింపవలసియున్నదని దెలుపుట ఈనాడెంతయు నావశ్యకమై యున్నది.

స్వాతంత్ర్యమువలన పొందదగు ఫలము ప్రజలకు లభించలేదన్న, ఈనాడు సమాజమునందు ప్రవర్తిల్లుచున్న యవినీతియే హేతువని చెప్పకతప్పదు. రాష్ట్రపతి తమ సందేశమున వివరించినట్లు, ఈ యవినీతి యనేకరూపముల వ్యక్తమగుచున్నది. ఈ యవినీతి కంతకునూ మూలకందమైనది హేయమగు స్వార్థపరత్వమని గూడ వారు జెప్పియుండిరి. వ్యక్తుల స్వార్థాశయమే ప్రధానమై, సంఘశ్రేయము విస్మరింపబడిన సంఘమందు సంఘర్షణ ప్రజాజీవితమును విషాక్తమొనరించును. అట్టి సంఘము రాజకీయస్వాతంత్ర్యము లభించినప్పటికిని, సంపద్వర్షము కురిసినప్పటికిని పురోవృద్ధి నొందజాలదు. కావుననే స్వాతంత్ర్యదినోత్సవమున, జాతిపురోవృద్ధికి గల ప్రధానమైన ఆటంకమును రాష్ట్రపతి మనకు జ్ఞప్తికి దెచ్చుట యెంతయు సముచితము

కమ్యూనిస్టుప్రభుత్వములు గల దేశములందనేక విషయములు మనకు రుచించవు. కాని భారతజాతిజనకులు గాంధీమహాత్ముడు చెప్పినట్లు, అన్యులలో గల మంచిని గ్రహించి పాఠములు నేర్చుకొనవలెను. కమ్యూనిస్టుప్రభుత్వము స్థాపితములు కాగానే, సంఘముపరముగ ప్రభుత్వముపరముగ పౌరుల కర్తవ్యభారమును గుర్తెరుగునట్లు ఉద్యమములను ప్రారంభించుచున్నారు. చీనాలో నూతనచీనాప్రజాస్వామ్యస్థాపనోద్యమమును ప్రారంభించినారు. ఈ యుద్యమమునందు ప్రధానాంశము సమాజశ్రేయసాధన. వ్యక్తులు చేయు ప్రతికార్యమునను, ప్రతి భావనయందును సంఘశ్రేయమే ప్రాతిపదికగా నున్నది. ఆహారనివాసాదిస్వవిషయములందు ఎన్నికష్టములు వచ్చినను, సమాజశ్రేయమునకే పాటుపడుచున్నారను విషయమును గ్రహించి, సంఘశ్రేయమే కడకు తమ శ్రేయముగా పరిణమించగలదను విశ్వాసముతో ప్రజలు కృషిచేసినచో, కృషి యెంత భారతరమైనను సుకరము కాగలదు. ప్రజల కిట్టి విశ్వాసము కలుగవలెనన్న పరిపాలకులు, ధనాఢ్యులు, పారిశ్రామికయజమానులు, వ్యాపారులు, ఉద్యోగులు, కార్మికులు, కర్షకులు మొదలుగాగల సర్వవర్గములవారును దీక్షతో కృషిచేయవలసియున్నది. అట్టి విశ్వాసము ప్రజలలో ధృఢపడిననాడుగాని ఏ ప్రభుత్వమెంత శ్రమపడినను, జాతి పురోవృద్ధి నొందజాలదు.

ఈనాడు మన దేశమున వ్యాపారదుర్నీతి, ఉద్యోగుల యవినీతి, పాలకాదివర్గములలో కులమతప్రాంతీయాభిమానద్వేషములు పెల్లున చెలరేగి సమాజజీవనమును విషపూరిత మొనర్చుచున్నవి. ప్రజలజీవనము నానాటికి కష్టభూయిష్టమగుచున్నది. జాతీయనాయకులు ప్రతిష్ఠ నొడ్డి అహోరాత్రములు కష్టించినను ఫలితము లేకున్నది. ప్రభుత్వ మెన్ని కార్యక్రమములను, ప్రణాళికలను ప్రవేశపెట్టినను, ఎంత ధనమును వెచ్చించినను వ్యర్థమగుచున్నది. పరి

పాలనా కార్యముల నెంతగా క్రమబద్ధముగ నిర్వహించ యత్నించినను నాయకుల యాశలు భగ్నమగు చున్నవి. దేశసమస్యలు పరిష్కారము గాకున్నవి.

స్వాతంత్ర్యమనగా నిదేనా యని ప్రజలు నిస్పృహ చెందుచున్నారు. ఎవరైన నీతివర్తను లున్నచో వారు నవ్వులపాలగుచున్నారు. ఆర్థిక రాజకీయరంగములందు సర్వవర్గములునూ సంఘముపట్ల తమ కర్తవ్యమును గ్రహించినగాని స్వాతంత్ర్యముగాని, జాతీయసంపద్వృద్ధి కార్యక్రమములుగాని ఫలోన్ముఖము కాజాలవు. పరిస్థితు లిట్లుండగా స్వాతంత్ర్యమును దెచ్చిపెట్టిన కాంగ్రెస్ నాయకులను నేటి దుస్థితికి నిందించరాదు. సంఘశ్రేయ మును గమనించక తద్విరుద్ధముగ ప్రవర్తించువారిని కమ్యూనిస్టు దేశములలోవలె, అంత అమానుషముగ దండించనవసరము లేకున్నను, సంఘవిద్రోహులను వెలిపెట్టి పశ్చాత్తప్తులను చేయవలసిన యవసర మున్నది.

ధనాఢ్యులు, దేశీయార్థికస్థితికి ప్రాపైనవారు దేశముపట్ల తమ కర్తవ్యమును గ్రహించనిచో, ప్రజల సహనము హద్దు మీరి అశాంతిక, విప్లవమునకు దారి తీయగలదని గ్రహింపవలెను.

సంఘమందు నీతివర్తనము, గాంధీమహాత్ము డుద్బోధించిన న్యాయసత్యాహింసలు ప్రవర్తిల్లిన గాని జాతిపురోవృద్ధి యసంభవము. గాంధీమహాత్ముని నాయకత్వమున కాంగ్రెస్‌సంస్థకు ప్రజల బలమును చేకూర్చి, చివరకు భారతదేశమునకు స్వాతంత్ర్య మును దెచ్చిపెట్టిన న్యాయసత్యాహింసలే, జాత్యభ్యు దయమునకు గూడ శరణ్యము లని రాష్ట్రపతి సందే శము ధృవపర చుచున్నది.

ధరల పెరుగుదల:

ద్వితీయప్రపంచసంగ్రామకాలమున ప్రజా వసరవస్తువుల ధరల పెరుగుదలను అరికట్టి, అదుపులో నుంచుటకు ఏర్పరచిన ధరల పాలనాశాఖను తిరిగి ఉద్ధరించు సంకల్పము తమకు లేదని అమెరికాఅధ్య క్షుడు విస్పష్టము చేసినరోజునే భారతప్రధానమంత్రి పార్లమెంట్‌లో ఇదే విషయముపై ఒక ముఖ్యప్రకటన చేసిరి. ప్రజల నిత్యావసరవస్తువుల ధరలను అదుపునం దుంచుటకు ప్రభుత్వమునకు ఇప్పుడే అధికారము గలదు. ఆహారధాన్యము లన్నింటికి ప్రభుత్వమే ధర లను నిర్ణయించుచున్నది. వస్త్రములకును అదేవిధ ముగ, వర్తకుల లాభములతోసహా, ధరలు నిర్ణయిం చెను. అయితే ఈ రెండును ప్రభుత్వము నిర్ణయించిన ధరలకు లభించుట లేదు. కొరియాయుద్ధము ప్రారం భము కానున్నదను సూచనకూడ లేనప్పుడే దేశమున చక్కెరధర విపరీతముగ పెరిగి, సామాన్యప్రజలకు లభింపకుండపోయెను ఈనాటికిని గ్రామములందు నిర్ణీతధరకు మూడురెట్లు ధర చెల్లించినగాని చక్కెర అందుట లేదు

ఆహారధాన్యమువిషయమున పరిస్థితులు ఇందుకు భిన్నముగ లేవు. నేడు ప్రజావసరవస్తువుల ధర లన్నియు యుద్ధకాలములోకంటె ఎక్కువగ నున్నవి. బ్రిటన్, అమెరికా దేశము లందలి ధరల పెరుగుదలతో పోల్చిన భారతదేశమునందలి పెరుగుదల అంత ఎక్కువ గాదని ఆర్థికమంత్రి చింతామణి దేశ ముఖ్ గారు ప్రకటించిరి. కాని అసలు 1939 కి పూర్వ మున్న ధరల ప్రమాణమును పోల్చిన అప్పటికే భారతదేశమునందు వస్తువుల ధరలు బ్రిటన్, అమెరి కాలందలి ధరలకంటె ఎక్కువగ నున్నవని, సగటు వ్యక్తిగతాదాయము ఇతరదేశములలోకంటె భారత దేశమునందు తక్కువని ఆర్థికమంత్రియైనను అంగీ కరింపక తప్పదు.


కనుక ధరల పెరుగుదలను అరికట్టవలసిన అవ సరము బ్రిటన్, అమెరికాలలోకంటే భారతదేశము నందే ఎక్కువగా గలదు. ప్రభుత్వము వస్తువులకు కనిష్ఠ, గరిష్ఠ ధరలను నిర్ణయించుటతో తృప్తిచెందిన, ఎంత కఠినశాసనము చేసినను ప్రయోజనము ఉండదు. ఆ ధరలకు సంఘమునందలి అన్ని వర్గ ముల ప్రజలకు వస్తువులు లభించునట్లు చూడవలెను. ప్రభాబాహుళ్యమునందు నేడు ప్రబలముగ నున్న అసం తృప్తికి ప్రధానకారణము ప్రభుత్వము నిర్ణయించిన ధరలకు, ఉత్పత్తిదారులు ప్రకటించు ధరలకు వస్తువు దొరకకపోవుటే ఆ కారణముగనే కంట్రోల్సుతోలగ వలెనను ఆందోళన తిరిగి ప్రారంభమైనది.

ధరలను అదుపులో నుంచుట ఎంత ప్రధానము


ప్రభుత్వము గుర్తింపకపోలేదు. కాని కొరియాయుద్ధము ప్రారంభమగుటతో పరిస్థితులు మరీ విషమించినవి. వస్తువుల కొరత ఏర్పడలేదు; ప్రజావసరములు అప్పటికప్పుడు అధికము కాలేదు, అయినప్పటికిని ప్రధాన వాణిజ్యనగరములందు వాడుకవస్తువుల ధరలు కొరియాయుద్ధవార్త ప్రకటన మైన ఉత్తరక్షణమున విపరీతముగ పెరిగిపోయెను. ప్రజల జీవనవ్యయప్రమాణమును వృద్ధిచేయుటకు ప్రభుత్వ మిప్పటికి నాలుగు సంవత్సరములుగ కృషిచేయుచున్నది. ఇంతవరకు ఎట్టి ఫలితములును లేవు, ఇకముందైనను ఈ కృషి ఫలింపగల దను ఆశకు ఆధారములును కన్పించుట లేదు.

కావున భారతప్రభుత్వము ప్రతిపాదించు శాసనము సమగ్రమైనదిగ నుండవలెను. ధరలను అదుపునం దుంచుటకు జరుగు శాసనముగాక, ఆ శాసనమును అమలుచేయు పద్ధతులు అత్యంతప్రధానము. పండిట్ నెహ్రూ సూచించిన శాసనము అమలు జరిగిన అనంతరముకూడ పరిస్థితులు ఇట్లే యున్న ఈ శాసనము వలన ప్రయోజనముకంటె ప్రమాదములే అధికముగ నుండును.

విషయానుక్రమణిక
16 ఆగస్టు 1950



రిపబ్లిక్ ప్రథమాధ్యక్షులు   డా॥ రాజేంద్రప్రసాద్



ధర్మచక్రాంకిత పతాక


★

శ్రీమతి 'ఉషాదేవి'

తొలిఉషస్సులలోన
చిలుకనవ్వులతోడ
ఆకాశవీధిలో
అందాలు చిందుతూ—
ఎగురవే జెండా !

నవ్యభారతవీధి
దివ్యభావుకులతో
కలకలలాడంగ
కిలకిలా నవ్వుతూ—
ఎగురవే జెండా !

అంబుదపంక్తిని
చుంబనజేయుచు
మందానిలమున
అందా లొలయగ
గగనాంగణమున
నిగనిగ వెలుగుచు
ధరణీతలమున
ధగధగ మెఱయుచు
ఎగురవే జెండా ! !



నవభారతం

★

శ్రీ రెంటాల గోపాలకృష్ణ

నవభారతం శుభదాయకం!
జననాయకం సుఖదాయకం !
జననాయకం జయసాధకం !
నవభారతం ధృవతారకం !

* * *

సస్యశోభిత సంపదుజ్జ్వల
సర్వశిక్షితరక్షితం !
విశ్వమానవశాంతిస్థాపితం
విజయశంఖోద్ఘోషితం !
నవభారతం శుభదాయకం !

* * *

సంఘభేదం సంస్కరించిన
సత్యదీక్షాకంకణం !
పీడితప్రజబంధముక్తికి
తోడునీడగు భారతం !
నవభారతం శుభదాయకం !

* * *

దాస్యశృంఖలు దగ్ధపరిచిన
ధర్మరాజ్యస్థాపితం !
సర్వశిల్పుల కళాకృతుల
సాహితీసంశోభితం !
నవభారతం శుభదాయకం !

అహింసావ్రతము

"ఆదర్శములు" నెరవేరని "కోరికలు!" అనినాడొక ఆంగ్ల తత్వవేత్త. అహింసకూడ నొక ఆదర్శము. అహింసావాదమును బుద్ధుడు సృజించినటుల కొందరు భావింతురు. ఇంకను పామరులు అహింసావాదము మన గాంధిమహాత్మునిసృష్టి యని భావించుటయు గలదు. ఈ అహింసా ధర్మము వేదవ్యాసవిరచితభారతమునందు పెక్కుసారులు నొక్కి వక్కాణింపబడి యున్నది. భారతమున కానరాని విషయము లేదు.

ఇటీవల నొక గ్రంథకర్త 'శ్రీరాముని కాలమున పెట్రోలు విమానాశ్రయము లున్నటుల చారిత్రకాధారములు లభించనందున శ్రీరాముడు లంకనుండి పుష్పకవిమానముపై అయోధ్యకు ప్రయాణించెననుట హుళక్కియే' అని వ్రాసెను. గరుత్మంతుడు స్వర్గమునుండి అమృతభాండమును తీసికొని వచ్చుటకు వెళ్ళినపు డతనికి దారిలో విమానములు కన్పించినటుల భారతమునం దున్నది. భాషాశాస్త్రము ననుసరించి చూచినను పుష్పక ముండియుండునని తోచకమానదు. విమానము లేనిచో ఆనాడు విమానశబ్ద మెటు లుత్పన్నమైనది?

అహింసావ్రతమును క్రైస్తు, మహమ్మదు, బుద్ధుడు ప్రచారము చేసినారు. కాని వారు విజయవంతులు కాలే దనుటలో నెట్టి సందియము లేదు. అందువలననే ఆదర్శము నెరవేరని కోరిక!

అహింసావ్రతములో నే ప్రాణికిని హింస చేయరాదు. ప్రపంచములో నెక్కువమంది మాంసభుక్కులుగా నున్నారు. ఇంగ్లండు వంటి పాశ్చాత్యదేశములలో మనుష్యులు మాంసభోజనము లేక జీవించని పరిస్థితి యేర్పడి చాల శతాబ్దము లైనది.

ప్రతినియమమునకు కొన్ని మార్గాంతరము లున్నటుల అహింసావ్రతము భోజన పదార్థముల విషయమున సడలింపబడినది. క్రీస్తు దేవుని కుమారు డను క్రైస్తవులు, మహమ్మదు దైవాంశసంభూతు డను మహమ్మదీయులు. బుద్ధుడు సాక్షాత్తు దైవావతారమను హిందువులు ఇంక నితరమతస్థులు శతాబ్దాలనుండి పరస్పరవైషమ్యములతో యుద్ధములతో సతమత మగుచుండుట చరిత్రప్రసిద్ధము. 'అహింసా పరమో ధర్మః', అను వాక్యము ఆదర్శమై నిలిచిపోయినది. గాని ఆచరణయోగ్యము కాలేదు.

ఆంగ్లేయులు ఇతరవిదేశీయులు గోమాంసము భుజించెదరు. వారికి గోహత్య పాతకము కాదు. రాజ్యపాలకులకు నరహత్యయే పాతకముగా గాన్పించదు. భారతదేశమత సాంప్రదాయాల ననుసరించి గోహత్య మహాపాపము. హిందువులు గోమాంసమును భుజించరుగాని, గొర్రెలు, మేకలు, కోళ్లు, పందులు, ఎలుకలు నైన అభ్యంతరము లేదు. ఒక్కొక్కదేశపు సాంప్రదాయము లొక్కొకరీతి నుండును. మహమ్మదీయులకు గోమాంస మత్యంత ప్రీతికరమగు వస్తువు.

అల్లసాని పెద్దనగారు తన మనుచరిత్రములో చంద్రదూషణమున—

శ్రీ పెనుమర్తి కామేశ్వరరావు

'గోవధము సేయు తురకల
దైవం బివు' అని చంద్రుడిని దూషించినాడు.

పెద్దనగారు శ్రీకృష్ణదేవరాయలుగారి ఆస్థానకవి. కృష్ణదేవరాయలు హిందూ ప్రభువు. మహమ్మదీయదండయాత్రలను త్రిప్పికొట్టిన రాజు. అందువలన పెద్దనగారు తన మనుచరిత్రలో మహమ్మదీయ దూషణమును చంద్రదూషణమున జోడించినారు.

బౌద్ధమతము అశోకచక్రవర్తికాలమున అన్యదేశములయందు కూడ విస్తరించినది. బర్మా, జావా, చైనా, జపాను, టిబెట్టు మొదలైన దేశములయం దీనాటికి బౌద్ధమతావలంబు లున్నారు. బౌద్ధదేవాలయము లున్నవి. అశోకుడు యోద్ధములలో నెందరినో చంపక చక్రవర్తి కాలేదు.

ఇటీవల భారతప్రధాని పండితనెహ్రూగారు జావాపర్యటనములో నాదేశములో నున్న ఒక పెద్ద బౌద్ధవిగ్రహమును సందర్శించినటుల మన దేశమున దినపత్రికలయందొక చిత్రపటము ప్రకటింపబడినది. జావా నేటికీ యుద్ధరంగముగా విలసిల్లుచున్నది.

పాపభూయిష్ఠ మగు ప్రపంచమున ప్రజలకు మనశ్శాంతిని కలిగించునవి ఆదర్శములు. అవసరము కలిగినపుడు నాయకు లాయాదర్శముల నుదహరించి ప్రజలకు వెలుగుదారుల జూపించుచుందురు.

భారతమునగూడ అహింసావ్రతము పాండవులకు చివరభాగమున బోధింపబడినది. భారతయుద్ధమున మహావీరులు మరణించినపిమ్మట వికలమనస్కుడైన ధర్మరాజున కాత్మశాంతి కలిగించుటకు బోధింపబడినది. ఒక వ్యక్తి మరణించినపుడు ఆతని బంధువులు మనశ్శాంతికొఱకు గరుడపురాణము వినెడి యాచారము నేటికి గలదు. భాగవతమున మనశ్శాంతి గూర్చుటకు పుత్రశోకాకులుడైన రాజునకు 'ఈ చచ్చినవాని కేడ్చెదరు చావక మానెడివారి భంగి' యని బోధించినారు ఋషులు. 'పుట్టినవారు గిట్టక మానరు' అను విషయ మందఱెరిగినదే గాని ఆత్మబంధువులు మరణించిన శోకించుట మానలేరు. ఒక్కొకరి యాచార మొక్కొకవిధముగా నుండును. పార్సీలు మరణించిన వ్యక్తికి దహనసంస్కారము లొనరింపరు! శవమును ఒక బహిరంగప్రదేశమున పారవేసెదరు. దానిని రాబందులు పీకి తినును. పశుపక్ష్యాదుల మాంసములను మానవుడు భుజించగా, మానవుని పిశితమును పక్షు లారగించుటలో దోష మేమున్నది? శ్మశానములలో భూస్థాపితము చేయబడిన శవములను పెల్లగించి నక్కలు తినుచుండును.

పార్సీలకు దేవు డగ్నిహోత్రుడు. అందువలన వారు శవదహన మొనరింపరు. అగ్ని మైలపడుటను వా రంగీకరింపరు. వా రగ్నిని నీటితో నార్పరు. ఇతరు లగ్నిని నీటితో నార్పుట చూచి సహించరు.

అహింసావ్రతానుష్ఠానములో జైనులు బౌద్ధులకంటె నెక్కువ శ్రద్ధ గలవారట. వారు ప్రొద్దుగూకక

(33-వ పేజీ చూడుడు)

అప్పుడు లేనిదీ; ఇప్పుడున్నదీ!

★

మనుషులలో మంచిదనం, సౌఖ్యం భాగ్యాలవలెనే స్వాతంత్ర్యం కూడా ఉందనుకుంటే ఉన్నట్లు లేదనుకుంటే లేనట్లు కనిపిస్తుంది. ఉన్నదో లేదో వెతికి పట్టుకోడానికి ప్రయత్నించే వారికి, ఆయాపరిస్థితుల్ని బట్టి, ఆమనుషుల తరహాని బట్టి, "ఉయ్యాలలో బిడ్డను పెట్టుకుని ఊరంతా వెదికినట్లై"నా అవుతుంది లేదా ఎండమావుల్ని వేటాడినట్లవుతుంది.

ఎందువల్లనంటే సౌఖ్యం భాగ్యాలవలెనే స్వాతంత్ర్యం అనేదికూడా కాలమానపరిస్థితుల్ని బట్టి అర్థం, అనుభవం మారుతూ ఉంటాయి. ఆమాటకి స్థిరమైన శాశ్వతమైన స్పష్టమైన నిర్వచనం అసాధ్యం. ప్రజల స్వాతంత్ర్యానికి ప్రాతిపదికాంశాలు మూడని ఫ్రెంచివిప్లవవీరులంటే ప్రెసిడెంట్ విల్సన్ పద్నాలుగన్నాడు. రూజ్వెల్ట్ నాలుగన్నాడు. అందరికీ తిండీ బట్టా కొంప ఇస్తే చాలు; మనుష్యుల్ని పట్టుకు తిన్నానసరే వాళ్లు స్వాతంత్ర్యం అనుభవిస్తున్నట్లే చాలన్నారు నియంతలు. అందరికీ తిండీ బట్టా కొంపా ఇచ్చి వ్యక్తిస్వత్వాలూ ఇస్తేనే స్వాతంత్ర్యం అన్నారు కొందరు.

1947 ఆగస్టు 15వ తేదీని మనకి లభించిన స్వాతంత్ర్యం ఎన్నిగజాలు మందం ఎన్నిగజాలు పొడుగు వెడల్పులు అని కొలవడానికి పూనుకోవాలంటే అసలెవరి మూరతో కొలవాలి? ఎవరిమూర వారిది. ఒకరిమూర కింకొకరిమూర తక్కువ; మరొకరిమూర ఎక్కువ. కాబట్టి సిద్ధాంతాల్ని బట్టి కొలవడానికి వీలు కాదు.

పోనీ 1947 ఆగస్టు 15వ తేది అర్ధరాత్రికి ముందులేని దేవి! ఇప్పుడెక్కువున్నదేమిటి, అని కొలుద్దామంటే పెద్ద చిక్కులున్నాయి. అప్పుడు లేనివీ ఇప్పుడున్నవీ, అప్పుడున్నవీ ఇప్పుడు లేనివీ జమాలెక్కలు కట్టడం మొదలెడితే తేలేవి అతుయం. నికరం లాభమో నష్టమో తేల్చడం అసాధ్యం.

ఇంక నీ నారకంమనుషుల బ్రతుకుల్లో వెలుగునీడలు, కష్టసుఖాలూ ఏమైనా మార్పు చెందాయా అని చూస్తే ఈలెక్క పెడదోవలు పట్టిస్తుంది. ఎందువల్లనంటే ప్రపంచయుద్ధాలనేవి రావడంతో రాజకీయస్వాతంత్ర్యం కలదేశాలూ, లేని దేశాలూ ఒకే స్థితిలోకి వచ్చేశాయి. నెత్తురోడి పాలిపోయినవి కొన్నీ, మాడి నల్లబడిపోయినవి కొన్నీ. కాబట్టి తిండికీ గుడ్డకీ కొంపకీ కరువు రావడానికీ స్వాతంత్ర్యానికీ బాదరాయణసంబంధమే కాని మరోటి లేదని రూఢి అవుతోంది. ఈలేమి, ఈ కరువులు మూడేళ్లుగా స్వాతంత్ర్యం అనుభవిస్తున్న మనకేలాగున్నాయో వందలాదిసంవత్సరాలుగా స్వాతంత్ర్యం అనుభవిస్తున్న దేశాలకీ అలాగే ఉన్నాయి. ఒక దేశంలో ఆహారం ఎక్కువై పండులుకూడా తినకుండా పారేస్తూవుంటే నిరుద్యోగంతో కడుపునిండా తిండయినా లేక బాధపడుతున్న ప్రజలూ ఉన్నారు. ఒక దేశంలో నిరుద్యోగమనేది లేకపోయినా ఏ మనిషికీ కడుపునిండా తిండీ సుఖంగా నివసించడానికి చాలిన కొంపా లేక జనం బాధపడుతున్నారు. మరొక దేశంలో ఆహారం అందరికీ చాలినా చాలకపోయినా అందర్నీ చావగొట్టి పనిచేయించి "అందరికీ తిండి ఉంది మొర్రో" అనిపిస్తున్నారు. అన్ని దేశాల పరిపాలనాభావాన్నీ మథించి రాజ్యాంగాన్ని సృష్టించుకున్న మన దేశంలో పైరకాలన్నీ ఇంద్రధనస్సులో రంగుల్లాగ కానవస్తున్నాయంటే విశేషమేముంది?

ఆగస్టు 15 గిర్రుని తిరిగి మూడేళ్లకి నాలుగోసారి వచ్చేసింది. ఈ మూడేళ్లలో జరిగినవి పునశ్చరణ చేసుకుంటే 1947 ఆగస్టు 15 కి ముందులేనిదీ ఆ తరవాత వచ్చినదీ తెలుసుకోవచ్చును.

వాస్తవానికి దేశాల చరిత్రలు చర్విత చరణాలే. ప్రజల బ్రతుకు "ఎండా వానా కుక్కల నక్కల పెళ్లి." ఈ కాలంలో తరుచు నక్కమీద పిడుగులు పడుతున్నాయి.

సరిగ్గా మూడేళ్ళ కిందట అర్ధరాత్రి దాటినసమయాన భరతఖండం రాజకీయ దాస్యబంధాలను తెంచి శుభ్రస్వేచ్ఛావాయువులు పీల్చింది. కాని గంగాయమునాసింధునదీతటాలలో రుధిర ప్రవంతులు ప్రవహించాయి. భారతమాత భుజాలు విచ్ఛేదితాలైనాయి. దేశమంతా ద్వేషాగ్నికీలల్లో శోకోద్వేగంలో విలవిల్లాడిపోయింది. స్వాతంత్ర్యోత్సవాల ఆనందసంతోషంలో ఆర్తరవాలు మిళితమై జీవితధర్మాన్ని నిరూపించింది. పశ్చిమ పంజాబ్, సరిహద్దు, సింధురాష్ట్రాల నుంచి చావగా మిగిలిన హిందువులు చేతికి దొరికిన వస్తుసామగ్రినీ ధనాన్నీ తీసుకుని భారతదేశం వచ్చేశారు.

ఆపైన కాశ్మీరంపైన దండయాత్ర జరిగింది. అంతవరకూ ఏకరూపంలో ఉన్న దేశం రెండుగా ఖండితం కావడంతో, ఉభయఖండాలూ కాశ్మీరంలో యుద్ధానికి దిగాయి. రక్తబాంధవ్యం కల సోదరులు నెత్తురోడ్చారు. జ్ఞాతులై పరస్పరానుమానాలతో ద్వేషాలతో రచ్చకెక్కారు. పరుల ఆదేశంపై యుద్ధం విరమించినా కత్తులు సాగుతూనే ఉన్నాయి. పాకిస్తాన్ భారత దేశాల మధ్య రెండుమార్లు యుద్ధం ప్రజ్వలించే ప్రమాదం పండిట్ నెహ్రూ రాజనీతిజ్ఞతవల్ల తప్పిపోయింది

మతకలహాల ఫలితంగా నూటపాతికేళ్లు బ్రతకాలనే వాంఛ గాంధీ మహాత్మునికి అంతరించింది. చివరికి మతోన్మాదులచేత మహాత్ముడు దుర్మరణం పాలైనాడు. హంతకులు ఉరికంబ మెక్కారు.

యథాయథలై చీలిపోనున్న దేశాన్ని కాంగ్రెస్ సంస్థజాతీయబలసంపద కాపాడింది. సంస్థానాలన్నిటినీ నయానా భయానా ప్రభుత్వం కూడగట్టుకుని వచ్చింది.

(34-వ పేజీ చూడుడు)

స్వరాజ్యంలో సంపద

శ్రీ వేలూరి
సహజానందం

దేశంలోని ప్రతి పౌరుడూ పొలాల్లోనో, కర్మాగారాల్లోనో, గనుల్లోనో అధికోత్పత్తికి పాటుపడాలి అని పదేపదే మంత్రులు, పెద్దనాయకులు హెచ్చరిస్తూ ఉంటారు. యువకులు, విద్యావంతులు ఎంతసేపు సర్కారునౌకరీనే మనస్సులో పెట్టుకుంటారు. కాని శారీరకకష్టానికి గాని, స్వతంత్రంగా ఏదైనా వ్యాపారాన్ని నడపటానికి గాని ఒప్పుకోరని విమర్శిస్తూ ఉంటారు. కాగితం, కలం, కుర్చీ వదలి మధ్యతరగతివారు, విద్యావంతులు పార, పలుగు పుచ్చుకోవాలని, లేదా కర్మాగారాల్లో యంత్రసారథ్యం వహించాలని సలహాలిస్తూఉంటారు. ఇటీవల పండిట్ జవహర్‌లాల్ నెహ్రూకూడా ఈ పల్లవినే వినిపిస్తున్నాడు.

కర్మాగారాల్లో ఉత్పత్తి అధికమవాలని ఒక పక్కన అంటూ, వరసన ఇంకోపక్కనుంచి కర్మాగారాలు మూసేస్తుంటే ప్రభుత్వం చూస్తూ ఊరుకుంటోంది. బొంబాయిరాష్ట్రంలో ఒక మూసిన మిల్లును ప్రభుత్వపర్యవేక్షణకింద తిరిగి నడపటానికి నెలలకు నెలలు పట్టింది. మిల్లుఅధిపతులైన పెట్టుబడిదార్లు ఉత్పత్తిలేకుండా మిల్లు మూసివేస్తే, వారిపై ఏట్టి విచారణ, శిక్ష లేదు. ఏప్రజారక్షణచట్టమూ వారిని ముట్టుకోదు. కాని పెట్టుబడిదార్లు స్వయంగా మిల్లులను మూయటంబదులు, కార్మికులు కూలి, నాలి చాలదని సమ్మె కట్టితే, 144 వ సెక్షన్, 'టియర్‌గాస్' ప్రయోగాలు, లాఠీ ఛార్జీలు, ఇంకా దేవుడు మేలు చేస్తే కాల్పులు, మరొక పక్కనుంచి ప్రజారక్షణచట్టాలు ఇన్నిటినీ ఒక్కుమ్మడిగా ప్రభుత్వం ఒరలోంచి దూస్తుంది. 'ఉత్పత్తినష్టం' 'ఉత్పత్తినష్టం' అని మంత్రులు, నాయకులు గొంతుచించుకుంటారు. సమస్యల లోతు తరచని ప్రజలూ కార్మికులు గొంతెమ్మకోరికలు కోరుతున్నారని, ప్రజానీకానికి కావలసిన బట్టను ఉత్పత్తిచేయ్యలేదని అనుకుంటారు. కాబట్టి ఉత్పత్తిసాధనాలకు యజమానులు కానట్టి శ్రమజీవుల విషయంలో చూపించే అధికారదర్పం, విసురు, చెప్పే నీతి నియమాలు ప్రభుత్వం యజమానుల విషయంలో పాటించదు. సమ్మెచేస్తే, ఉద్యోగం తీసేస్తే, రెండో పూటకు డొక్కలు వెళ్లాడే కార్మికులపై స్వారీచేయటం సులభమేకాక, ప్రభుత్వాలకు సహజధర్మమై పోయింది. కాని యజమానులవిషయంలో నెలలు గడచినా కిమిన్నాస్తి. ఈ పరిస్థితిలో ఉత్పత్తి నధికంచేయాలని ఘోష పెట్టితే ప్రయోజనం ?

ఉత్పత్తిసాధనాలు ఇంకొకరి స్వంతసొత్తై ఉండగా, ఉత్పత్తి పెరుగుతరుగులు వారి ఇష్టాయిష్టాలపై ఆధారపడిఉంటయ్. వ్యాపారం లాభాలను తెస్తుంటే ఉత్పత్తి హెచ్చుతుంది. లాభాలు తగ్గితే ఉత్పత్తి తగ్గుతుంది. అంతేకాని ప్రభుత్వాధికారంపై ఉత్పత్తి ఆధారపడిలేదు. పోలీసు, మిలిటరీ, శాసనాలు, 'ఆర్డినెన్సులు, ఉత్పత్తిసాధనాలు లేని పాటకజనంకోసమేగాని, అంటే ఉత్పత్తికి కావలసిన అధికారంగాని, యాజమాన్యం గాని లేని దరిద్రులపైకోసమేగాని, ఉత్పత్తిపై అధికారమూ, యాజమాన్యమూ ఉన్న యజమానులకోసం కాదు. నిజానికి ఇప్పటిసంఘంలో రాజకీయంగా సర్వాధికారం కలిగిన ప్రభుత్వానికిగాని, చెమటోడ్చి ఉత్పత్తిచేసే శ్రమజీవులకుగాని ఉత్పత్తిపై యాజమాన్యమూ లేదు. అధికారమూ లేదు. (ఏదో కొద్దిగా పరిశీలనాధికారం కావాలని ప్రభుత్వం కోరితే, యజమానులు ఆ కాస్తకే ప్రభుత్వాన్ని తీవ్రంగా ఖండించారు. 'చిత్తం' అంది ప్రభుత్వం.) ఉత్పత్తిసాధనాలపై యాజమాన్యమూ లేక, అధికారమూ లేక, శ్రమజీవులనూ, నిన్నూ, నన్నూ, మిగతా పౌరులనూ 'అధికోత్పత్తి, అధికోత్పత్తి' అనే నినాదాలతో హెచ్చరిస్తే, వాగాడంబరం తప్ప ప్రయోజనం ఏమిటి ? నీటికాలవ ఒకని ప్రత్యేక స్వంతసొత్తైనప్పుడు, పనివాళ్ళను 'పొలా లెండిపోతున్నయే ...నీళ్లు తోడండి... నీళ్లు తోడండి' అని పురమాయిస్తే లాభం ? ఆ కాలవయజమాని నీటి తూము మూసేసి, నిశ్చింతగా కూర్చుంటాడు. ప్రభుత్వానికి వానిపై అధికారం లేదు. ప్రభుత్వానికి ఆ కాలవపై యాజమాన్యం లేదు. కాబట్టి పొలాలు ఎండినా, నిళ్ళతో తడిసినా అందుకు ఆ కాలవయజమాని సర్వాధికారి. ఆ కాలవపై యాజమాన్యం, అధికారం ప్రభుత్వం సిద్ధించుకోనంతవరకు, పనివాళ్లు చేయగలిగేది శూన్యం. పొలాలు ఎండుతూ, తడుస్తూ, తడుస్తూ ఎండుతూ వుంటయ్. ఇప్పటి మన స్థితి అలాగే ఉంది.

కాబట్టి ఉత్పత్తిగాని, అధికోత్పత్తిగాని కావాలంటే, వాటి సాధనాలపై అధికారం, యాజమాన్యం కావాలి. ఇది నిస్సందేహం. ఇది స్పష్టంగా గుర్తించినంతవరకు, సమస్య పరిష్కారం కాదు. ఉత్పత్తి అధికమవాలి. అనే నినాదాలతోపాటు, ఉత్పత్తిసాధనాలపై అధికారమూ, యాజమాన్యమూ సిద్ధించాలి' అనే నినాదా లివ్వాలి మంత్రులు, నాయకులు - ఈ అధికారం, యాజమాన్యం సంఘానికి సంపూర్ణంగా సిద్ధించనంతవరకు, ప్రభుత్వానికి ఎన్ని మంచి ఉద్దేశ్యా లున్నా, సంఘంలోని ప్రజలందరినీ సమంగా, నిష్పక్షపాతంగా పరిపాలించటం అసంభవం. అసాధ్యం. కోటీశ్వరుడికీ ఓటు ఉంది, కూలివాడికీ ఓటు ఉంది, చూసుకోండి సమత్వం అన

వచ్చు. ఓటుతో ప్రతినిధిని ఎన్నుకుంటాడు. రాష్ట్రపతిని ఎన్నుకుంటాడు. కాని ఎన్నుకొనే పౌరుడు గాని, ఎన్నుకొనబడే ప్రతినిధిగాని, రాష్ట్రపతిగాని కోటీశ్వరునికి సమానం కారు. సంఘజీవనానికి కావలసిన సంపదకు అధికారి, యజమాని కోటీశ్వరుడు. ఈ కోటీశ్వరుని హక్కు - ఓటు హక్కు కాదు - ఆస్తి హక్కు, సంఘపరం కానంతవరకు, సంఘానికి నిజమైన పాలకుడు, అధికారి కోటీశ్వరుడేగాని ప్రభుత్వం కాదు. ఆ కోటీశ్వరుడు వెనక నుంచొని స్వాధికారం చెలాయించుకోటానికి ప్రభుత్వం తెరగా ఉపయోగపడుతుంది. ఇది యథార్థం. మంత్రులు, అధికార్లు ఎంత కాదని వాదించినా, ప్రయోజనం లేదు. ఎందుకంటే ఉత్పత్తిసాధనాలు స్వంత సొత్తు కాని శ్రమజీవులు పెట్టుబడిదార్ల కెలా పరాధీనులో, అలాగే ప్రభుత్వంకూడా పెట్టుబడిదార్లకు పరాధీనమై ఉంటుంది. కారణం కూడా ఒకటే. శ్రమజీవులతోపాటు ప్రభుత్వానికికూడా ఉత్పత్తిసాధనాలు స్వంత సొత్తు కాదు. ఈ సాధనాలపై యాజమాన్యంగాని, అధికారంగాని ప్రభుత్వానికి లేవు. ఉత్పత్తిసాధనాలు సంఘపరం కావాలని శ్రమజీవులు పోరుసల్పుతున్నారు. ప్రభుత్వం ఈ లక్ష్యాన్ని అనుసరించకుండా, 'మా కే పక్షపాతమూ లేదు. ఉభయవర్గాలనూ సమంగా చూస్తాం.' అని, పెట్టుబడిదార్ల పాదాక్రాంతమై ఉన్న ఇప్పటి వ్యవస్థను ఇలాగే ఉంచి, సంఘ దైన్యాన్ని పోగొట్టగలం అని అనకుంటున్నారు. ఇది సదుద్దేశ్యమే అయినా, సిద్ధించదు. మాంచి బలశాలి అయిన వస్తాదు, అర్భకుడైన ఇంకొక వస్తాదు బరిలో పడి మల్లయుద్ధం ఆరంభిస్తే, ఉభయుల మధ్య నిష్పక్షపాతంగా న్యాయం చూస్తాను అని మధ్యవర్తి అన్నట్టుంటుంది ప్రభుత్వవ్యవహారం.

వ్యాపారులముందు, ధనాధిపతులముందు ప్రభుత్వస్థితి ఎంత దుర్బలంగా ఉందో ఇప్పటి ధరల వృద్ధిబట్టి తెలియగలదు.

ధరలను పెరగనివ్వం, ధరలను తగ్గించటానికే ప్రయత్నిస్తున్నాం అని ఎప్పటికప్పుడే మంత్రులు, నాయకులు ప్రకటనలు చేస్తూఉంటారు. ఈ ప్రకటనలతోపాటు ధరలూ పెరుగుతూనే ఉన్నయ్.

మనకు స్వాతంత్ర్యం సిద్ధించినప్పటినుంచి ధరలు ఎలా పెరిగిందీ చూద్దాం.

సంవత్సరం.	అన్ని సరకుల ధరలు. (1939=100)
1947 నవంబరు	302
1948 మార్చి	340.7
1948 జూలై	389.6
1948 అక్టోబరు (2-10-48)	382.0
1949 నవంబరు (26-11-49)	389.7
1950 జూన్ (24-6-50)	397.1
1950 జూలై (8-7-50)	404.9

ప్రజాజీవనం నానాటికీ ఎంత కష్టభూయిష్ఠమవుతోందీ, పై అంకెల బట్టే తెలుస్తోంది. ప్రభుత్వపు ప్రకటనలు, హెచ్చరింపులూ, ఎలా ఉన్నా, ధరలుమటుకు విజృంభిస్తూనే ఉన్నయ్.

ఇంక ఇప్పటి కొరియాయుద్ధం అదును చూసుకొని, వ్యాపారులు మళ్ళీ ఇప్పటి అత్యధికధరలనే ఇంకా విపరీతంగా పెంచేస్తున్నారు.

ఇదివరలో ధరల పెరుగుదలను ఆపలేకపోగా, ఇప్పటి ధరలవృద్ధిని అరికట్టగలం, అరికట్టగలం అని హుంకరిస్తున్నారు మంత్రులు. ఇలా ధరలను పెంచేయటం మహాపాపం అని శ్రీ కె. యం. మున్షీ, వ్యాపారులకు నచ్చచెప్పాడు. "జాగర్త" అని హెచ్చరించాడు. పారిశ్రామికమంత్రి శ్రీ హరికృష్ణ మెహతాబ్. మరోకపక్కన (పశ్చిమ) బెంగాలుప్రభుత్వం వ్యాపారులకు తలొగ్గి, ధరల్లో 5% వృద్ధికి ఒప్పుకుంది. ఉత్తరప్రదేశపు గవర్నరు సర్ హోమీ మోడీ వ్యాపారుల సమావేశంలో వాపోయాడు. "సంజీవిలాంటి మందులైన పెనిసిలిన్, స్ట్రెప్టోమైసిన్ మందుల ధరలను విపరీతంగా పెంచటం అంటే, ప్రాణాలతో చెలగాటలాడటం కాదూ? ధరలుకనుక తగ్గకపోతే, ఇంకా తీవ్రమైన కంట్రోళ్లను అమలు జరుపవలసివస్తుంది.''

'ఇంకా ధరలు తగ్గకపోతే?' అనే హెచ్చరిక 1947 ఆగస్టు 15 నుంచి మళ్లీ 1950 ఆగస్టు 15 దాకా వింటూనే ఉన్నాం. ఇవి ఉత్తరకుమారప్రజ్ఞలుగా పరిణమిస్తున్నయని వ్యాపారులు గ్రహించారు.

కలకత్తా, బొంబాయి, మద్రాసునగరాల్లోనే కాదు, గ్రామాల్లో చివరకు పచారీ సరుకుల ధరలదగ్గరనుంచీ పెరిగిపోతున్నయ్.

ఇలా ధరలు మండిపోతుంటె, ప్రభుత్వం ఏం చేయగలుగుతోంది?

బొంబాయిమంత్రి ఒకడు, కొట్లవద్ద 'పికెటింగు' శాంతియుతంగా చేస్తే ప్రభుత్వం అడ్డురాదు. అని సెలవిచ్చాడు. కాని ఇలాంటి పికెటింగుకు కాంగ్రెసువాలంటీర్లు తగినంతమంది రాకపోవచ్చు అని కూడా నిజం చెప్పాడు.

కార్మికులుగాని, ఇతరపాటకజనంగాని ఎక్కడైనా సమ్మె జరిపితేమటుకు, పోలీసులు, బాష్పవాయుబాంబులు, లాఠీలు, తుపాకులు ప్రభుత్వబలపరాక్రమమంతా ప్రదర్శితమౌతుంది. కాని పెట్టుబడిదార్లు వ్యాపారులు వీళ్ళ విషయంలోమటుకు కొట్లవద్ద 'శాంతియుతమైన పికెటింగు'!

ప్రభుత్వాలు సంపన్నులకు పరాధీనమై ఉంటయని, ఉన్నయని అనేవాదం నిజం అనటానికి ఈ పైవిషయం చాలు.

ఈ సందర్భంలో, 'బ్లాకు-మార్కెటు' సందర్భంలోనూ మంత్రులు ప్రజలు ఎక్కువధరలకు సరుకులు కొనమంటే చాలు ప్రజలదే బాధ్యత అని అంటూ ఉంటారు.

ఇతరవిషయాల్లో అలా అని ఊరుకుంటున్నారా? కమ్యూనిస్టుదౌర్జన్యాన్ని ప్రజలేఎదుర్కోవాలి, అని ప్రభుత్వం ఊరుకుంటోందా? రాజకీయంగా కమ్యూనిస్టులు మన ప్రజాస్వామ్యానికి ఎలా ముప్పును తెస్తున్నారో, అలాగే వ్యాపారులూ ఆర్థికంగా మన ప్రజాస్వామ్యానికి ముప్పు తెస్తున్నారు.

బెంగాలుప్రభుత్వం ధరల్లో 5% వృద్ధికి ఒప్పుకుందంటే, వ్యాపారుల ఆదాయం 5% పెరిగి, ప్రజల ఆదాయంలో 5% తరుగుతుంది. ప్రభుత్వం ఎవరి కుపయోగపడుతోంది? ప్రజాప్రభుత్వానికి ప్రాణదాతలైన ప్రజలకా? లేక వ్యాపారులకా?

కమ్యూనిస్టుదౌర్జన్యాన్ని స్వయంగా ఎదుర్కొంటున్నట్టే, వ్యాపారుల అక్రమాన్ని స్వయంగా ఎందుకు ఎదుర్కోవట్లేదు ప్రభుత్వం?

ఈ మూడేళ్ల స్వరాజ్యంలో ప్రభుత్వాలు ఎంతమంది 'బ్లాక్-మార్కెటు' వ్యాపారులనుపట్టుకొన్నారు? ఎంతమందిని శిక్షించారు?

సంకల్పమెలా ఉన్నా, ప్రభుత్వాలు సంపన్నులకు, వ్యాపారులకు తలొగ్గి ఉంటున్నారు.

ఇండియాప్రభుత్వం మీదే తిరుగు

బాటుకు పూనుకొని యుద్ధానికి దిగిన హైదరాబాదు నైజాంను నిర్వీర్యం చేయగలిగింది ప్రభుత్వం. దేశంలో నలుమూలలా 'విప్లవాన్ని' ఆరంభించిన కమ్యూనిస్టులను ఇంచుమించు సాంతం అణగార్చగలిగింది ప్రభుత్వం. కాని పల్లెల్లో చిన్న పచారీదుకాణంనుంచి నగరంలో పెద్ద అంగడిదాకా ప్రభుత్వానికిదుర్భేద్యమైనదుర్గమాలుగాఉన్నయ్. హైదరాబాదు సైన్యం శరణు కోరింది. కమ్యూనిస్టుదౌర్జన్యాన్ని తుపాకులతో అణగార్చుతున్నారు. కాని వ్యాపారులను మాత్రం ప్రభుత్వం ఏమీ చేయలేకపోతోంది.

ధరలవృద్ధి అంటే, ప్రజల ఆదాయం క్షీణించటం. ధరలను ప్రభుత్వం అరికట్టలేకపోతోంది అంటే తన్ను ఎన్నుకొన్న అధికసంఖ్యాకులైన ప్రజలకు తాను ఉపయోగపడక అల్పసంఖ్యాకులైన ధనికవర్గానికి ఉపయోగపడుతోంది.

ఒక పక్కన ధరలు పెరిగిపోతున్నయ్. అంటే కూలీలు, జీతాలు, చిన్నరైతుల, వ్యవసాయకూలీల ఆదాయాలు క్షీణిస్తున్నయ్. మరొకపక్క నిరుద్యోగుల సంఖ్య నెలనెలకు హెచ్చుతోంది. ఉద్యోగావకాశాలు క్షీణిస్తున్నయ్. ఇదివరకే దేశంలో కర్మాగారాలను యజమానులు మూయటంమూలంగా దాదాపు లక్షకార్మికులు నిరుద్యోగులయారు. ఈ ఆర్థికవాతావరణంవల్ల స్పష్టమవుతోందల్లా ఒక్క విషయమే. సంఘంలోని ధనిక, శ్రామికవర్గాల్లో అధికసంఖ్యాకులైనట్టి శ్రామికప్రజలకు కాక, ధనికవర్గపువారికి అధీనమై ఉంది ప్రభుత్వం. శ్రామికప్రజలు అధికసంఖ్యాకులు కదా, ఓటర్లలోనూ వీరే కదా అధికసంఖ్యాకులు.

మరి మనది ప్రజాస్వామ్యం కూడానయ్యె, అలాంటప్పుడు ప్రభుత్వం అధికసంఖ్యాకులకే అధీనమై ఉంటుందిగదా అని అనవచ్చు. సంఘంలోని సంపత్తు వ్యక్తుల గుత్త, స్వంతసొత్తుగా ఉన్న సమాజపు ప్రజాస్వామ్యంలో నిజమైనబలం. ప్రజలది కాదు, ఆ సంపన్నులది మటుకే. రాజకీయాధికారం రాజునుంచి సామాన్యప్రజానీకానికి సాంఘికంగా సంక్రమించినట్టే, సంపదయాజమాన్యంకూడా వ్యక్తులనుండి ప్రజానీకానికి సాంఘికంగా సంక్రమించాలి.

ఈ పరిణామం శాంతియుతంగా సిద్ధించేట్టు ప్రభుత్వం చేయగలిగినప్పుడే, ప్రజాస్వామ్యం సంపూర్ణంగా ఏర్పడుతుంది.

ఈ పరిణామానికి పూనుకోక, సంఘంలోని అన్నివర్గాలను నిష్పాక్షికంగా చూస్తూ ఉంటాం అని అంటేమటుకు, దాని పర్యవసానం అధికసంఖ్యాకులకు అపకారం, అల్పసంఖ్యాకులకు పరాధీనత.

సంపదనిర్మాణపు మూలంలో మార్పు [illegible] లేనంతవరకు, మంత్రుల, నాయకుల హెచ్చరికలు, ప్రబోధాలు, "వ్యాపారుల్లారా, జాగ్రత్త. కార్మికుల్లారా, అధికోత్పత్తికి పూనుకోండి" అనే నినాదాలు పనిచేయవు.

నవల:



శ్రీ నోరి నరసింహశాస్త్రి

౪౬

మహాశివరాత్రి దగ్గరకు వచ్చినది!

ఒకనాటి యర్ధరాత్రసమయమున దూరమునుండి ఎవరో గిగ్గరగా నిట్టూర్చుచున్నట్లు చిత్రమైన ధ్వని ఓరుగల్లుపౌరులకు వినబడెను. ఓరుగల్లుపౌరులకే కాదు! ఓరుగంటికి చుట్టును చాల దూరముననున్న పల్లెలను పట్టణములను ఆ ధ్వని వినవచ్చెను! ఏమిటీ ధ్వని! మనుష్యులందరు నిద్దురపోవుచున్నవారు ప్రక్కలపైనున్నవారు ప్రక్కలపై లేచి కూర్చుండి భయవిహ్వలులై యా శబ్ద మాలకింపసాగిరి. మనుష్యులే కాదు. పశువులుకూడ చెవులు రిక్కించి మోర లెత్తి భయభ్రాంతములై దాని నాలకించుచుండెను. పక్షులు తమ కులాయములనుండి అరచుచు బయటికి వచ్చి వృక్షములపై నల్లాడసాగెను. కీటకములుకూడ తమ కలుగులనుండియు చాటుమాటు నివాసస్థానములనుండియు బయటికి వచ్చి ప్రాకులాడుచుండ, నేల యీనినదా యనిపించుచుండెను.

ఆ శబ్ద మేమి? పిశాచములు దండు వచ్చుచున్నవా? ఆకాశము విరిగి మీద పడనున్నదా? సముద్రము చెలియలికట్టను త్రెంపుకొని భూమండలమును కబళింప దొరకొనినదా? ఆదిశేషుని ఘూత్కారమా?

అల్పకాలముననే దాని స్వరూపము స్థిరపడినది. వాయుదేవుడు స్వేచ్ఛావిహారము ప్రారంభించినాడు! అతడు జగత్ప్రాణుడే, కాని కోపించినయెడల లోకమునంతటిని మ్రింగివేయు మారుతుడుకూడ నతడే! సర్వమును పునీత మొనర్చు పావనుడే మధ్యమధ్య ప్రభంజనుడును ప్రకంపనుడును! సర్వమును గ్రహింపగల శక్తి తన కున్నదని యాతని గర్వము!

అట్టి మరుత్వా డిప్పుడు ప్రకోపించినాడు! ముందు నిట్టూర్పులుగా వినబడిన శబ్దము హోరుగా మారిపోయినది. కాని యా గాలి యెటునుండి వీచుచున్నదియో మాత్రము స్పష్టము కాలేదు. ఒక కొంతవడి తూర్పునుండియు, కొంతవట్టు పశ్చిమమునుండియు, మరికొన్నియెడల దక్షిణమునుండియు, ఇంకొకతరి ఉత్తరమునుండియు వచ్చుచున్నట్లున్నది. అది యొక భయంకర సుడిగాలి! గాలిదుమారము!

ఆ ప్రభంజనముతోపాటు నలువైపులనుండి కాలమేఘములు క్రమ్ముకొని వచ్చినవి. ఆ మేఘములను గాలితాకు పింజెలు పింజెలుగా నేకివేయుచున్నది. ఏమైనను తెల్లవారుజామున వర్షము ప్రారంభించినది. అదియును కుండపోత!

ఆ గాలికిని ఆ వర్షమునకును ఓరుగంటి పరిసరములన్నియు గడగడలాడిపోయెను. తలదాచుకొన నిరవులు కలవారే నిలువలేకపోయిరి. ఇక నట్టి యాచ్ఛాదనలు లేనివారు తాళలేక నేపోయిరి. దేవకార్యములును రాజకార్యములును మనుష్యకార్యములును సర్వము కట్టువడిపోయినవి. నిముస మొక యామముగా, యామ మొక దినముగా, దిన మొక సంవత్సరముగా గడచిపోవుచున్నవి.

ఈ మాఘమాసములో నీ యకాలవర్షము!

అట్లు మూడు రాత్రులు మూడు పవళ్ళు, గాలియు వానయు ఓరుగల్లుపరిసరములను దడదడ లాడించెను. వృద్ధు లింతటి గాలివాన తమ జన్మలలో చూడలే దనిరి. పెద్దపెద్ద భవనములే కొన్ని కూలెను. పూరియిల్లెగిరిపోయెను. పడిపోయిన చెట్లకు లెక్క లేదు. దేశమంతయు జలమయముగా కనిపించెను. పశుపక్ష్యాదు లల్లాడిపోయెను.

రేపు మహాశివరాత్రి యనగా తెరపియిచ్చెను! సూర్యభగవానుడు దర్శన మిచ్చెను. ప్రజలు ఒకరి మొగము లొకరు చూచుకొన బయలువెడలిరి. ప్రమాదములు కలిగిన జనులను గుర్తించి యుపచారాదులు చేయుట, పారిపోయిన పశువులను వెదకి తెచ్చుకొనుట, పడిపోయిన గోడలను ఇళ్లను సరిచేసుకొనుట జనములు ప్రారంభించిరి. తన దొడ్డిలో చెట్టుపై కాకులు గూళ్లు పెట్టి చికాకుపరచుచుండగా, ఆ యింటి గృహస్థు కోపించి యా గూళ్లను తీసిపారవేయగా, ఆ కాకులు అరచుచు తీసివేసిన పుల్లలను మరల ఒక్కొక్కటే వీరి ముక్కులతో కరచి తెచ్చి చెట్టుపై పెట్టు విధముననే వారి చర్య లనుకరించెను. చిమ్మివేసిన చీమలపుట్టనుండి వెడలి బారులు తీరి వేలకువేలుగా కూడి మరల తమ పనికి ఉపక్రమించు చీమల సంరంభమునే ఆ ఓరుగంటి ప్రజల ఆత్రము స్మృతికి తెచ్చెను.

* * * *

ముందు వచ్చిన వార్తల ననుసరించి శ్రీ రుద్రదేవమహారాజులు మహాశివరాత్రినా డుదయమున పురప్రవేశము చేయవలసియుండెను. కాని యీ గాలివాన యన్ని ప్రయత్నములను తాఱుమాఱులు చేసివేసినది. మహారాజు లెంతవరకు వచ్చినదియు గూడ వార్తరాలేదు.

వార్తాహరులు మాత్రము మనుష్యమాత్రులే కదా! వారు రాలే దని కోపించిన లాభము లేదు. రుయ్యమ వెంటనే మహారాజుల క్షేమ వార్తకై వేగరుల బంపి ఏకశిలానగరమున పరిస్థితులు చక్కజేయు ప్రయత్నమున నిమగ్నమయ్యెను.

ముఖ్యముగా శిలాప్రాకారనిర్మాణమున నియుక్తులైన శిల్పులును పనివారును ఈ మూన్నాళ్లను యమయాతన ననుభవించిరి. గోనగన్నారెడ్డి మహాసైన్యముతో బల్లాలకర్ణాటసేనల నెదుర్కొనబోయినదాది శిలాప్రాకారనిర్మాణకార్యక్రమమంతయు మేచయనాయకుని యల్లుడగు నాగదేవనాయకునిపై బడినది. అతడు వెంటనే పనివారిని కూర్చుకొని, పని కడ్డముగా కందకములలో నిలిచిన నీరు వెడలగొట్టించుచు, వారికి కావలసిన సమస్త సదుపాయములు కల్పింపసాగెను.

మేచయనాయకుడు స్వయముగా నగరమునం దెల్లెడ సంచారము చేయుచు పౌరులకు తన భటు లెల్లవిధముల సహాయముగా నుండునట్లు శాసించుచుండెను.

జైనవసతిలో మహాశివరాత్రికి నేమినాథప్రతిష్ఠ జరుగవలసి యుండెనుగదా! గాలివానకు ముందే దాని ప్రయత్నము లన్నియు బూర్తి యైనవి. కాని యచ్చటికి ఉత్సవము చూడవచ్చు నశేషజనమునకు ఆచ్ఛాదనకును నివాసమునకును నిర్మించిన పందిళ్లు పాకలు ఎగిరిపోయినవి. సమర్థులగు శిల్పులు వెంటనే వాని నన్నిటిని సరిచేయుటకు ప్రారంభించిరి. అప్పటికే ప్రతిష్ఠకు పూర్వాంగములగు మాంత్రికతాంత్రికములు నిర్విఘ్నముగా సాగిపోవుచున్నవి.

రాజకోశమునుండి వసదిపెద్దలు కోరినప్రకారము లక్ష సువర్ణములును ముందుగనే వారికి పంపబడియుండెను. ధనవంతులగు జినభక్తు లెందరో విరివిగా నా ప్రతిష్ఠకు ద్రవ్యసహాయ మొనర్చిరి. నగరములో పెద్దల కందరకు వసదినుండి యాహ్వానములు వచ్చినవి. రాజమందిరమునకు ప్రత్యేకముగా నాహ్వానము విశేషగౌరవముతో పోయి యుండెను. శ్రీ రుద్రదేవమహారాజులు స్వయముగా ప్రతాపరుద్రకుమారులతోగూడ వచ్చి యా మహోత్సవము దర్శించి పోవలె నని వారు మరిమరి యర్థించిరి. కాని శ్రీ రుద్రదేవమహారాజులు గాలివానచే దారిలో నిలువవలసివచ్చిన దని యా పెద్దలు విని నిరుత్సాహపడిపోయిరి. "లక్ష సువర్ణము లిప్పించి యనుగ్రహించిన మహారాజులు వచ్చు భాగ్యము మాకు ప్రాప్తము కాలేదు. మహాదేవరాజులు శ్రీ ప్రతాపరుద్రకుమారులతో నక్కడికి దయచేసిన కొంత కృతార్థుల మగుదుము." ఇట్లు వసదిపెద్దలు అర్థించిరి. దానితో మహాదేవరాజు మిక్కిలి ప్రీతుడై యంగీకరించెను. ప్రతాపరుద్రకుమారుడును పోయి చూడ నుబలాటపడసాగెను.

మహాశివరాత్రి వచ్చినది. స్వయంభూదేవాలయమున వైదిక శైవవైభవముతో అభిషేకార్చనలు సాగిపోవుచుండెను. కరణపాఠశాలలలో శస్త్రవిద్య నిప్పు డభ్యసించుచున్న బ్రాహ్మణు లందరును తమ తమ క్రొత్త శస్త్రములతో నాలయప్రాంగణమున కరుదెంచిరి. వారు శతరుద్రీయమును మహారుద్రసంఖ్యగా జపింప సంకల్పించి మహాదేవుని పురుషసూక్తముతో ముందు ధ్యానించిరి. మహాదేవుడు విశ్వరూపుడై వారి హృదయములలో నావహించెను. వారంతట నా మూర్తిని శతరుద్రీయముతో మరల మరల స్తోత్రముచేయ నారంభించిరి. ఉదయముననే వారందు రుపక్రమించిరి. శతరుద్రీయము నూటయిరువదియొక్క మారులు జపించుట వారి కెప్పటికి పూర్తి యగును? అందులో మధ్య వచ్చు మాధ్యాహ్నికములు సాయాహ్నికములు గూడ నిర్వర్తించుకొనవలెను. లింగోద్భవకాలమునకు గాని వారి సంకల్పించిన జపము పూర్ణత నొందదు! విశ్వమూర్తిని ధ్యానించు వారికి సర్వసంకల్పసిద్ధి సాధ్యమగుచో శస్త్రసాధనసిద్ధి యొక టని ప్రత్యేకము చెప్ప నేల?

మరియు శివభక్తులు అనేకవిధముల నీశ్వరు నారాధించుచుండిరి.

జైనవసదిలో తెల్లవారుజామున నుండియు ఒకే తీరున ఘంటానాదములు మ్రోయుచున్నవి. పెద్దపెద్ద యుష్ణీషములు ధరించి జినభక్తులు కేలకేలుగా వసదికి వచ్చుచుండిరి. రాత్రి ఎనిమిదిగడియలకు గాని గర్భగుడిలో ప్రతిష్ఠాకలాపము పూర్తి కాదు. అంతవరకు మధ్యమధ్య ప్రతిష్ఠాంగముగా తీసికొనిపోబడు ద్రవ్యములే ఆ మహాజనము దర్శించి జయజయనాదములు చేయుచుండిరి. గర్భగుడికి ముందు చిన్న ముఖమండపము కలదు. అందులో జైనసాధువులు పలువు రుపవిష్టులైరి. దానికి బయట మహామండప మొకటి తాత్కాలికముగా నిర్మింపబడినది. ఉత్సవము దర్శించుటకు వచ్చిన పెద్దల కందరికి నచ్చట ఆసనాద్యుపచారములు జరుగుచుండెను. ప్రతిష్ఠ పూర్తియైనా ముందువసదికి ప్రధానాచార్యు డగు సిద్ధనంద్యాచార్యులు ప్రథమపూజ నిర్వర్తింతురు. ఆ పిమ్మట పెద్దలందరు నొకరొకరే ముఖమంటపములోనికి వచ్చి నూతనప్రతిష్ఠితనేమినాథవిగ్రహమును దర్శించి ప్రసాదము పుచ్చుకొని వెళ్లవచ్చును.

ఉద్యోగులలో నచ్చటికి రేచర్ల రామిరెడ్డి నామిరెడ్డి మల్లయరెడ్డి గణపిరెడ్డి మల్రెడ్డి మధ్యాహ్నమునకే వచ్చిరి. చీకటిపడు వేళకు నాగదేవనాయుడు వచ్చి దర్శనమున కాలస్య మున్న దని తెలిసి మరల వచ్చెద నని వెడలిపోయెను.

మహాదేవరాజు సాయంత్రము మూడు జాములకే ప్రయాణమై ప్రతాపరుద్రకుమారులను తెండని అంతఃపురములోనికి వార్త పంపెను. అంతఃపురమునుండి ఇదిగో అదిగో అని కొంతవడి వార్తలు వచ్చెను. మహాదేవరాజు బయట తొందరపడుచుండెను. ప్రతాపరుద్రకుమారుడు కదలుటకు ఉబలాటపడుచుండెను. అతని తల్లి ముమ్మడమ్మ యాతని ప్రయాణము చేయించుచుండెను. అంతలో కామసాని కుబ్జతో నామె యొద్దకు వచ్చి, శ్రీ రుద్రదేవమహారాజులు మరల తాము తిరిగివచ్చువరకు శ్రీ ప్రతాపరుద్రకుమారుని నెట్టి సందర్భములందును అంతఃపురము వెడలిపోనీయవద్దని యాజ్ఞాపించినది జ్ఞప్తికి తెచ్చి నిషేధించెను. కామసాని అంతఃపురరక్షకులకు అధికారిణి! అందులో నామె మహారాజుల స్పష్టమైన ఆజ్ఞను గుర్తుకు తెచ్చినది. అది ధిక్కరించి కుమారుని పంపుట సమంజసము కాదు. గట్టిగా కామసాని పట్టుపట్టినచో, రాజపుత్రిక యగు తానుకూడ ఎదురాడలేదు. కామసాని పట్టుదల మనిషి. అంత ముదుసలి యైనను దాని తీవ్రత యేమియు తగ్గలేదు. మరి ప్రతాపరుద్రకుమారుని ఉబలాటమును మహాదేవరాజుల కోరికను తాను ధిక్కరించు టెట్లు? పాపము ముమ్మడమ్మ కామసానివంక చూచెను. దాని ముఖము నిశ్చలముగా తీక్ష్ణముగా నుండెను. లాభము లేదని నిశ్చయించి ప్రతాపరుద్రకుమారులు రారని వినయపూర్వకముతో మహాదేవరాజులకు వార్త పంపెను. అది విని క్రోధోగ్రుడై మహాదేవరాజు కదలి ఒంటరిగా చీకటిపడినతర్వాత వసదికి చేరుకొనెను. అక్కడి పెద్ద లాతని మిక్కిలి గౌరవించి ప్రతాపరుద్ర

(33-వ పేజీ చూడుము)

నేటిమానవుని జీవితం

శ్రీమతి వేదుల మీనాక్షీదేవి

"గురువుల రాక, దాసి మృతి,
గుఱ్ఱపు దాడియు, వల్లు నల్కయుఁ
బరసతిగర్భ వేద నటు
పై నడివీథిని దొమ్మరాటయుఁ,
పొరుగున నప్పుబాధ, చెవి
పోటు భరింపగరాదు, వానయుఁ,
కరువు, దరిద్ర మాద్దిక మొ
కప్పుడు గల్గును కృష్ణభూవరా"

కర్మం చాలకపోతే ఒక్కమారే అన్ని బాధలూ వస్తాయిసుమా అని శ్రీకృష్ణదేవరాయలతోనో, మాడుగుల కృష్ణభూపతితోనో, ఒకానొక కవి ఆశువుగా తన అవస్థ చెప్పుకొన్నాడు; ఆలించి పాలించే రాజు గదా అని.

ఇప్పుడా రాజులు లేరు. ఆ కిరీటాలు లేవు. ఆ సింహాసనాలు లేవు. ఆ ప్రజాసమ్మతమైన పరిపాలన లేదు. భాషాభిమానము లేదు. పండితపోషణ లేదు. ప్రజల కష్టసుఖములందాసక్తి లేదు. కాని, పరిపాలించడానికిమాత్రం చాలామంది పరిపాలకులు బయలుదేరారు. ఇంతమంది పాలిస్తున్నా ప్రజలు సుఖిస్తున్నారా అన్నదే ప్రశ్న. దీనికిమాత్రం సమాధానం చెప్పడం కష్టం. బహునాయకత్వం. ఒకరి మాట, పద్ధతి యింకొకరికి నచ్చదు. ఓ పెద్దకెరటం అటునుంచి కొడితే యింకో పెద్దకెరటం యిటునించి కొడుతూ పరిపాలనానౌకను స్తంభింపజేస్తోం దన్నమాట యేటూ సాగకుండా. పైకి యెంత పెద్ద కబుర్లు చెప్పినా, బల్ల గ్రుద్ది లెక్చర్లిచ్చినా లాభ మేమిటి క్రియ శూన్యమయాక ? వీరు శిక్షించదలచుకొంటే "దండనార్హులు" "సజ్జనులు" అనే విచక్షణ వుండదు. అదేమంటే అనుమానం మీద అలా చెయ్యవలసివచ్చింది అంటారు. ప్రభుత్వంమీాగ ప్రజలకి నమ్మకం వుండాలి అని పదేపదే నొక్కి చెబుతుంటారు మన పరిపాలకులు. మామీద, మామాటమీద మీకు నమ్మకం వుండా అని ప్రజలు తిరిగి ప్రశ్నిస్తే మాయందు అగౌరవంగా ప్రవర్తిస్తున్నారని శిక్షిస్తారు. న్యాయం కావాలంటే యెవరితో చెప్పుకోవడం?

వెనక పల్లెటూరినుండి ఒకాయన పట్టణం వచ్చాడు బంధువుల యింటికి. ఊరంతా చూద్దామని బయలుదేరాడు వుదయం ఎనిమిది గంటలకి. తిరిగి వస్తోంటే యెవరో పట్టుకుని స్టేషన్‌కి తీసుకు వెళ్లారుట. "అల్లా దిక్కులు చూస్తూ నడుస్తున్నావేం?" "ఈచివర నీ కేం పని?" "నీదే వూరు?" "వస్తూవస్తూ సగంలో ఆగావేం?" అని ప్రశ్నపరంపర వర్షంలాగ కురిపించేశారా పల్లెటూరి వ్యక్తిమీద. పట్టణాల్లో వుండే పెద్దవీథులూ, మేడలూ, కార్లు, జట్కాలు, బజార్లు చూసి ఆశ్చర్యపోతూవుంటారు పల్లె ప్రజలు. అదే మొట్టమొదట రావడంవల్ల అల్లా ముందు, వెనక చూసుకుంటూ నడిచాడు కాబోలు; నిలదీసి యిన్ని ప్రశ్నలు వేసేసరికి హడలిపోయాడు. వారి ప్రశ్నలకి మెల్లి మెల్లిగా సమాధానాలు చెప్పాడు. ఉదయం వెళ్ళినవాడిని మధ్యాహ్నం పన్నెండు గంటలదాకా వుంచి. "కొత్త ముఖాల్లాగ కకబడ్డవాళ్లని పట్టుకోమని ఆజ్ఞ వచ్చింది. ఈ కమ్యూనిస్టులను పట్టుకోవడంలో ప్రతీవారినీ అనుమానించ వలసి వస్తోంది" అంటూ పూరడింపు వాక్యాలతో యింటికి పొమ్మన్నారు.

పై పద్యంలో చెప్పిన యజమాని అవస్థలాగ వుంది నేటి ప్రతిమానవుని జీవితం. ఇదివరలో పదిరూపాయలు గడించేవాడు ఆనందంతో బ్రతికేవాడు. ఈనాడు వంద రూపాయలు గడించినా ఆ ఆనందం తృప్తి లేదు. ధరలు పెరిగాయని ప్రభుత్వమువారిచ్చే కరువుభత్యాలకీ యీ అధికధరలకీ చాలా వార వుంది. ధరలు కుందేళ్ళలాగ పరిగెడుతున్నాయి. భత్యాలు తాబేళ్ళలాగ ప్రాకుతున్నాయి. కథలో కుందేలులాగ యీ కుందేళ్ళు యెక్కడైనా నిద్రపోయినా బాగుండును. వ్యాపారస్తుల మోసాలు, వున్న వస్తువు లేదనడం, ఖరీదులు విపరీతంగా పెంచడం, బ్లాక్‌మార్కెట్లు వగైరా అందరూ యెరిగినవే.

ప్రజలు గోలపెట్టగా పెట్టగా ఆ వ్యాపారస్తులను తప్పించి కొత్త లైసెన్సుదార్ల నేర్పాటుచేశారు. పి. సి. సి. సొసైటీల నేర్పాటుచేశారు. బియ్యం, పంచదార, గోధుమలు, గోధుమనూక, గోధుమపిండి, సెనగలు వగైరా సరుకులను వారిచేత అమ్మించారు. దీనితో వ్యాపారస్తుల జుట్టు తమ చేతిలో బిగించుకున్నామనుకున్నారు. వ్యాపారం యెవడు చేస్తే వాడే అన్యాయం చేస్తాడని, అది వ్యాపారధర్మం అని యెరగరు. కొత్తవాళ్ళు నిజాయితీ వాళ్ళని నమ్మారు. కొత్త వింత, పాత రోత కదూ మరి!

కొత్తలైసెన్సుదార్లుకూడా తమ పని ధర్మంగా నెరవేర్చలేదు. సరుకులు లేవని కొన్నాళ్ళు వచ్చాక ధర తెలియలేదని కొన్నాళ్లు, వచ్చినవాళ్లని రేపురా మాపురా అని కొన్నాళ్లు తిప్పేవారు. ఆఖరికి యిచ్చేరోజున చాలా మందికి తెలియనే తెలియదు. తెలిసి వెళ్లినవాళ్ల సంగతి చూద్దాం. వారు తమ బియ్యపు కార్డులనో, కిరసనాయిల్ కార్డులనో తీసుకు వెళ్లేవారు. ఏవస్తువు కావలసినా యివి చూపించవలసిన అవస్థ వొకటుండి. మహా న్యాయంగా యిచ్చేటట్టు వరసగా కార్డులను పుచ్చుకుని జనాన్నికూడా అల్లాగే నిలబెట్టేవారు. ఏ పదిమందికో యిచ్చి భోజనానికంటూ చక్కాపోయేవారు జనాన్ని మధ్యాహ్నం రమ్మంటూ. ఏం చేస్తారు పాపం! అన్నప్రకారం మధ్యాహ్నం కొట్టు దగ్గిరికి హాజరయేవారేకాని కొట్టు తీస్తేనా? సాయంత్రందాకా పడిగాపులు పడగా పడగా తన కొంపమీద పడతారేమో ననే పరిస్థితిలో పెరటికిసుమ్మన్ని వచ్చి మళ్లీ యే నలుగు రైదుగురికో యిచ్చి, సరుకు

అయిపోయిందని గమ్మని తలుపు వేసుకుని చక్కాపోయేవారు. చేసేది లేక జనం తిట్టుకుంటూ పోయేవారు. రోజూ పని నష్టపెట్టుకుని కొట్టువద్ద నిలబడివున్నా ప్రజల ముఖం చూసేవాళ్లు లేకపోయేవారు. పోనీ అని బజారుకి వెళ్లి కొట్లవాళ్ల నడిగితే "ఏం మేం మంచివాళ్లం కామని పెద్దమనుష్యుల నేర్పాటుచేశారుగా ప్రభుత్వంవారు? వారినే అడగండి" అని హేళన చేసి తమ అక్కసు తీర్చుకొనేవారు. కష్టపడి సొమ్ము సంపాదించుకోగలిగేవారు గాని వస్తువు సంపాదించలేకపోయేవారు ప్రజలు. ఇందులో తుపాను, పంటల నాశనం. ఆ కారణంగా యింకా ధరల పెరుగుదల. కరువంటే యెక్కడో లేదు. ఇదే కరువు. ఇంతో అంతో వున్నవాళ్లే కటకటలాడిపోతున్నారు. ఇక బీదా బిక్కీ మాట చెప్పే దేమిటి?

ఆనాడు గుత్తపుదాడు లుండేవి. ఈనాడు గుత్తము లేకుండానే దాడులు ప్రారంభమౌతున్నాయి. పంటపొలాలపైకి, వూళ్లపైకి దౌర్జన్యవాదులు దాడులు చేసి ప్రజలను భయావహులను చేస్తున్నారు. పంటలు కోసుకుపోతున్నారు. వూళ్లువూళ్లు దోచేస్తున్నారు. ప్రజల ప్రాణాలు తీస్తున్నారు. ఈ దాడులకు, అక్రమాలకు పల్లెటూళ్ల ప్రజలు గురిఅవుతున్నారు. గ్రామాలలో రక్షకదళాలుగా యేర్పడి ప్రజలు గస్తీచర్యలు జరుపుతున్నారు నిరాయుధులుగానే. అప్పుడప్పుడు అధికార్లు వీరు కాపలా కాస్తున్నారో లేదో చూడడానికి వస్తూంటారు. కాపలా కాస్తూంటే సరే. లేకపోతే తన్నుతున్నారు. కాపలాకాస్తే దోపిడీదారులు తన్నుతున్నారు. కాయకపోతే ప్రభుత్వాధికారులు తన్నుతున్నారు. ఏ విధాన్ని బాధపడ్డా ప్రజలే.

ఇన్ని బాధలు పడుతూ ప్రజలు యాతన జీవితాన్ని గడుపుతుంటే 'పులిమీద పుట్ర' అన్నట్టు యిప్పుడింకో కొత్త పద్ధతి వచ్చింది. వారిలో వారికి సఖ్యత లేకపోవడమువల్లో, అసమర్థతవల్లో, కొత్తలైసెన్సుదార్లను తీసివేయడం జరిగింది. ఊళ్లో జనాన్ని లెక్కచూసి వారందరికీ సరిపోయే వస్తువుల నిమ్మని మళ్లీ పాతవ్యాపారస్థులను నియమించారు. ఇదివరకు సామానుకే వారి నాశ్రయించవలసివచ్చేది. ఈ "పూల్" వల్ల రేషన్ కార్డులదగ్గరనుండి వాళ్లని దేవిరించవలసిన గతి పట్టిందన్న మాట. ప్రభుత్వంవారు వీరికి దాసోహమ్మనక తప్పింది కాదు. దీని ఫలితం యేమైతే యేం? ఆబోతూ! ఆబోతూ కుమ్ములాడుకుంటే మధ్య లేగదూడ కాళ్లు విరిగాయట. ఈ వ్యాపారస్థుల ప్రభుత్వాల మధ్య బాధపడేది ప్రజలే.

వీరు తమ షాపులను వుదయం ఎనిమిది గంటలమొదలు పన్నెండుగంటలవరకు తీసి వుంచుతారు. మధ్యాహ్నం శలవు. రోజుకి ఒక్కపూటే కొట్టు వుంటుంది. ఏవిధమైన వుద్యోగులకు, విద్యార్థులకు, ఆఖరికి కూలివారికి కూడా తెచ్చుకొనుటకు సాధ్యము కాని సమయం అది. అందుకే అల్లా యేర్పాటుచేశారేమో యెవరికి తెలుసు!

వాళ్లు యేనాడు రమ్మంటే ఆనాడు వెళ్లవలసిందే, పనైనా మానుకుని. కర్మం చాలక ఆనాటికి హాజరు కాలేకపోతే, ఆ నెల కోటా యిక యివ్వబడదు. "మేం రమ్మన్ననాడు రారు. మీరు వచ్చిననాడు సరుకు వుండవద్దా" అంటూ వాదన ప్రారంభిస్తారు పైగా. సరుకు అయిపోయిందంటే అర్థమేమిటి? యెలా అయిపోతుంది? ఊళ్లో వున్నవాళ్ల లెక్క వాళ్ల వద్ద వుండనేవుంటుంది. వాళ్లందరికీ సరిపోయే సామాను తెప్పిస్తారు. పట్టుకువెళ్లినవారు పట్టుకువెళ్లగా, మిగిలిన సరుకు రానివారిదే గదా? ఆ సరుకు యేమైనట్టు? ఆ సంగతి నిలదీసి అడిగేవా రెరి? అందరికీ అడగాలనే వున్నా, ఒకమారు కాకపోయినా మరోమారైనా యివ్వకపోతారా; అల్లరిపెడితే అసలే యివ్వరేమో, అని భయపడుతున్నారు. బాధపడుతున్నారు. ఇదంతా సాటిమానవుల బ్రతుకు కింకొకరి చేతులలో పెట్టడమువల్ల జరుగుతోంది. బ్లాక్ మార్కెట్‌లో కొంటే తప్పంటారు. ఇచ్చేవాళ్లివ్వకపోతే ప్రాణధారణకోసం పల్లెలనుండి బియ్యం మొదలైన అవసర వస్తువు లధికధరలకు కొనక తప్పడంలేదు.

ప్రజ లిల్లా బాధపడుతూంటే, ఆహారశాఖామంత్రిగారు ప్రతిసోమవారంభోజనం చెయ్యవద్దని ప్రజలకు విజ్ఞప్తిచేశారు. వంట చెయ్యవద్దని స్త్రీలను అర్థించారు. ఆ గడ్డీ యీగడ్డీ పెట్టమన్నారు. పోనీ యీజమానిమాట .అల్లా వుంచినా పిల్లలు "అమ్మా, అన్నం పెట్టవూ" అని అడిగితే యే తల్లి కడుపు చుమ్మలుచుట్టుకునిపోదు? సోమవారమే అక్కరలేదు. ఏడువారములూ వుపవాసం వుంటే ఆహారసమస్యే వుండదు. జనాభా తగ్గుతుంది. అప్పుడు పండిన పంట సరిపోతుంది.

ఆహారధాన్యాలు స్వయంసమృద్ధంగా చేయుటకు యత్నించాలి. లేదా దిగుమతి చేసుకోవాలి. అంతేకాని అలాంటి బాధ్యతగల వ్యక్తులు యిలాంటి సలహా లివ్వడం హాస్యాస్పదంగాను, అసమంజసంగాను, బాధ్యతారహితంగాను వుంటుంది. ఈ వరస చూస్తే ఆయనను "ఆహారశాఖామంత్రి" అనడంకంటె "నిరాహారశాఖమంత్రి"అంటే బాగుంటుందేమో!

వీరు చాలా ఆలోచించినమీదటే వుపవాసానికి సోమవారం యేర్పాటుచేసినట్టున్నారు. ప్రజలు సోమవారం భోజనం లేకుండా పనులకి వెళ్లడం కష్టం. ఆదివారమైతే కళ్లుమూసుకుని పడుకోవచ్చు. అందుచేత మంత్రిగారు వుపవాసం ఆదివారం యేర్పాటు చేయిస్తే చాలా బాగుంటుంది.

ప్రజాప్రతినిధులం; ప్రజాసేవకులం అని పదేపదే చెప్పుకోవడమే గాని, ప్రజలకోసం చేసే మంచిపని మాత్రం దృగ్గోచరం కావడం లేదు. పందాలలో పావుల నొడ్డినట్లు వారికి తోచిన పద్ధతులను ప్రజలపై ప్రయోగించుతారు. ఒకవేళ యెక్కడైనా ఆకలిచావుల గురించి తెలిస్తే "అబ్బే వాడికేదో రోగంట, దానివల్లే పోయాడు" అంటారు. కావలసినంతమంది సాక్షు లుంటారు. కావలిస్తే ఒకే ఒక ప్రాణి నష్టం అంటారు. ఆ ఒకే ఒక ప్రాణి నాశ్రయించుకుని యెన్ని ప్రాణు లుంటాయో గ్రహించరు. ఒక ప్రాణి అంటే ఒక కుటుంబమని తెలుసుకుని, ఆ ఒక్క ప్రాణికూడా సుఖంగా వుండేందుకు ప్రభుత్వముదే బాధ్యత.

కథానిక:

"కాంతాకనకాలు"

శ్రీ పురాణం సుబ్రహ్మణ్యశర్మ

౧

జీవితమంటే—యింత 'నెయ్యి జీడిపప్పు ద్రాక్ష కిస్‌మిస్‌పండ్లు' తో పోసి చేసిన 'హల్వా, లడ్డూ, మైసూరుపాక్, పకోడీ' ల్లా 'హాట్ హాట్ స్వీట్ స్వీట్' మనిపించకపోయినా, ఏదో రెండు వేళ్లా నోట్లోకి యథేచ్ఛగా వెళ్లగలవనీ, బంగారు చెంగావిపట్టురవసెల్లాలు కట్టలేకపోయినా మానాభిమానాలను కప్పుకోవచ్చునీ, మేడలు మిద్దెలు దర్జాలు వెలిగించలేకపోయినా అలసి ఆయాసంతో యింటికి చేరుకొని, అర్ధకప్పు కాఫీతో అర్ధణా సిగరెట్టుతో స్వర్గాల్ని వాటి నీడల్నైనా కనవచ్చుని అనుకుంటూ గడిపే రోజులు వెళ్లినై.

కనీసం జీవితమనేది పూలపాన్పే గానక్కర్లేదు, యిసుకతిన్నె ప్రాయంగానైనా వుండనీయవయ్యా భగవంతుడా అని వేడుకుంటూన్న కొద్దీ ఆయన మరీ బిగిసిపోతున్నాడు. ఆస్తి చూసుకొని పట్నాలు చేరి ఆ చదువుకోసం ఆస్తి హారతికర్పూరం కాగా, పట్నాల్ని వదలలేక కడుపు చేతబుచ్చుకుని యీడ్వలేక సంసారాల్ని యీడుస్తూ ఎటు తిరిగినా జీవితాల్లో చీకటిలా దరిద్రం అనారోగ్యం ముసురుకోగా - తరుణవయస్సులో కన్న కలలూ, చేద్దామనుకున్న పనులూ ఆశయాలూ—ఒక్కటొక్కటే వదలి వెళ్ళిపోగా తనలోకి తాను చూసుకుంటే ఏం మిగల్తుంది? ధర్మారావుకి?

ఏదో చదువుకుంటున్నాడు; బుద్ధిమంతుడు; ఆస్తి వుంది అని పొరబడి ఓ ఆసామీ పద్నాలుగువందలు పోసి కన్నెచెర విడిపించుకున్నాడు. తన్ను నమ్మి చిన్న వయస్సులో అన్ని కోర్కెలకూ మొహం వాచి తనతో కాపురం చేస్తూన్న పరిహారేళ్ల కస్తూరి, ఆ పిల్లకూడా పదరారేళ్ళకే పాతికేళ్ళ సంసారం చేసి రాటుదేరిన మనిషిలా మారిపోయింది. ముఖంలో ఆ లావణ్యం కూడా అంతర్హితమై కస్తూరి యింక కొద్ది కాలంలో కొవడిబద్దలా వంగిపోవచ్చు. ప్రస్తుతానికి ఆకర్షణీయంగా వుందని అనుకోవచ్చు. ఆపిల్లకో సంతానంకూడా. ఇవి గాకుండా ఎదుగూ బొదుగూ లేని ఓ గుమాస్తా ఉద్యోగం. కష్టపడి సంపాదించుకున్నప్పటికీ ఎక్కువగా జీవితంలో ఉపకరించని బియ్యేడిగ్రీ - చివరకు చూసుకుంటే అన్ని శ్రమలకూ సహించి యెక్కువ సుఖాల్ని కోరకుండా వున్న 'ఇటంటి కాంకాళం - యివే మిగిలాయి. అడుగులో అంసపాదు.

ప్రతీదీ, ఒక్కటేమిటి అన్నీ తలపెట్టిన పనల్లా చెడికూర్చుంది. సరే, కాలం ఎదురు తిరుగుతోంది.

రోజులు మునవికావనుకున్నాడు ధర్మారావు. పెద్దకోరిక లేవీ, అతడు పెట్టుకోలేదే? చదువుకున్నందువల్ల పొలం, పుట్రా అమ్ముకుని గ్రామాల్లో నిలవదొక్కుకొని వుండలేకపోయాడు.

రంగాపురంలో కొద్దిగా - అంటే వుండటానికో యిల్లు - చిన్న మామిడితోట- ఏదో నాలుగైదెకరాల మాగాణీ వుండొచ్చు. ఎకరంతర్వాత ఎకరం చొప్పున ఐదెకరాల ఆస్తి హరించుకుపోయినతర్వాత మిగిలినది యిది.

ఈ ఆస్తి సీతారామయ్య చూస్తూ వుంటాడు. ఈ అన్నదమ్ములకు పిత్రార్జితం వుందనుకుంటే వుంది. లేదనుకుంటే లేదు. నా వాటా నాకు పంచియిమ్మని ధర్మారావు అడిగినది లేదు. తమ్ముడూ యిది నీవంతు నిస్తు; ఇంత నేను వాడుకున్నానని యివ్వబోతే 'ఉంచు అన్నయ్యా. పిల్లల కేమన్నా చేయించు. వాళ్లు కాపురాలకు వెళ్లిపోతారు. నే నేదో యిస్తోకుపాశేగా, నా కష్టం నేను ఎల్లాగో పడతాను,' అంటూ వచ్చాడు ధర్మారావు.

ఈ ఏడు సీతారామయ్య ధర్మారావుకిలా జాబు వ్రాశాడు. 'చిన్నవాడు ఫిప్తుఫారం దాటుతాడు. వాడి చదువు ఏమాత్రం బాగులేదు. అక్కడ పట్నంలో పరీక్షలెల్లాగున్నయ్యో తెలియబరుస్తే పైవకి కొంచెం నిఘావుంచి ఎవరైనా దగ్గరుంచి కనుక్కుంటూ వుంటేనేగాని కాంతారావు పరీక్ష దాటించడు. ఆలోచించుకుని వ్రాయి', అని.

ధర్మారావు మూడు రోజులు జేబులో వుత్తరం పెట్టుకొని తిరిగాడు ఉంకో మనిషి ఎక్కితే పడవ మునక్కుండా వుంటుందా అన్న ఆలోచనతో. ఇటు కస్తూరివంక చూస్తే పట్టుమని ఇరువైఏళ్లయినా నిండని మనిషి. యీసురోమని నీరసంగా తెవుల్చుకొస్తోంది కాలాన్ని. కానైతే కాంతారావు చేతికందిన కుర్రాడు; కాస్త వీథిలో వస్తు వింట్లోకి రావచ్చు. ప్రతీదీ తనే చూసుగోనక్కర్లేదు. అడపాతడపా కాంతారావుధర్మాన అప్పగారు శేషమ్మ కాస్త ఆసరాపడచ్చు. ఎందువల్లనంటే శేషమ్మ తన మరిదికూతుర్ని పెంచుతోంది. ఆ పిల్లను కాంతారావుకివ్వటం విషయంలో ఆమె చాలా ఆప్యాయంతో ఏది కావాలన్నా చూస్తుంది. ప్రస్తుతం యీ రెండు జీవాలకు ఎప్పటికైనా దొరికే అండ ఆదొక్కటే. ఆవిడభర్త వుంటే పరిస్థితులెట్లా మారేవో గాని ధర్మారావు కూడా ఆవిడమీద ఆశ పెట్టుకున్నాడు.

ఆశ అనేది మనుష్యుణ్ని ముక్కుట్టుకు ఆడిస్తుంది. చీకట్లో లేస్తూ పడుతూ తప్పుడు దోవలో నడుస్తున్న బాటసారి సైతం దూరాన వెలిగే దీపాల్లా కనుపించే కొరివి దయ్యాలను నమ్మి ఏదో ఆశ్రయమున్నదనుకున్నట్లుగా 'ఏదో వుంది' అది దొరుకుతుంది, ఫరవాలేదు' అని ఆశ నీడను కమ్మగా నిద్రపోతాడు మనిషి.

ధర్మారావు సరే పంపమని సమాధానం వ్రాశాడు.

కస్తూరి కేమీ తెలియదు. కాని యథాలాపంగా అంది.

'ఈ ఏడు మావిడికాయన్నది మహోముడిపోతుంది. మన తోటలో కాయ దింపినపుడు ఓ రెండువందలు వుప్పులో పడేసి వుంచమని రాయండి. అవకాయ కెంత? మనకు యాభై కాయ కొనుక్కుంటే ఎక్కెతక్కెను.!' అని.

ధర్మారావు విసుక్కున్నాడు.! 'అవతల కుర్రవాడ్ని పంపమని వ్రాస్తూ యీ వార్త కూడా ఎందుకు? అందులో వాళ్లు ఏమన్నా పెడర్థాలు లాగుతారు' అన్నాడు.

'ఏ కుర్రాడు?' అంది కస్తూరి అర్థం కాక చెట్టునెడు
ర్థంగా.

'శాంతారావు చదువుకోడానికి వస్తున్నాడు. ఇక్కడ స్కూల్లో చేరుతాడ్ట.' అని ఆమె ముఖంలోకి చూశాడు.

కస్తూరి నిదానంగా తల పైకెత్తి 'రమ్మనమని వ్రాయండి ఐతే' అంది. ధర్మారావు ఏకాయెకి భోంచేసి ఆఫీసు కెళ్ళాడు. మునుపట్లా ఎండలు లేవు.

అభిషేకముఖలక్ష్మని తాకి నిగనిగలు తీరుతున్న సౌరువన్నా గమనించకుండా, చేతిలోని నీళ్ల సంచిపుచ్చుకుని కాళ్లు కడుక్కుని వచ్చి కుర్చీలో జారిగిలబడ్డాడు. దుమ్ములో పొర్లివచ్చిన పసివాడు కుర్చీ తలవైపున జేరాడుతున్న తండ్రిచొక్కా కొసలతో ఆడుకొంటూ మధ్యమధ్యన తన భాషలో 'తాయ్ తాయ్ - తా...తా... నా...నా...నా' అని చేతుల్తో తడ్తూ అక్కడ తిష్టవేసి ఏ వ్రాతపనన్నా చూసుకోవటానికి వలనుపడదు.

అక్కడే సమాధిలో పడినట్లు కూర్చుండిపోయాడు ఏదో ఆలోచిస్తూ ధర్మారావు. పసివాడు భయం లేకుండా చీకట్లో 'తాయ్—తాయ్ నా...నా...నా' అని దీర్ఘాలు తీస్తూనే వున్నాడు.

అప్రయత్నంగా బిడ్డవంక ఆ తండ్రి చూశాడు. నిజానికి కా పసిమూన ఆ చీకట్లో



సాధారణంగా కొద్ది మార్పులతో అదే ప్రశ్న ప్రశ్నాపత్రంలో తిరగవేసి అడుగబడినట్టుగా క్రొత్త అనిపిస్తున్నాయి యీ కాలంలోని మార్పులు- ఎండకి ఎండలూ అంతే. వానకి వానలూ అంతే.

కోటు వంకీన తగిల్చి చొక్కా విప్పుతూ ఎదురుగుండా దుమ్ములో ఆడుకొంటున్న పసివాడ్ని రెక్క బుచ్చుకుని యీడ్చుకొస్తున్న కస్తూరి నుద్దేశించి -

'వాడు రాలేదూ?' అని నీరసంగా ఉచ్చరించాడు.

'లేపు వస్తాడనుకుంటూ. ఇదుగో ఎక్కడికీ వెళ్లకండి; వంట ఖపోవచ్చింది మళ్ళీ.' అంటూండగా సాయంకాలపు లేతఎండ కేరింతాలు కొడ్తున్నాడు. ధర్మారావు కూర్చున్న చోట ఎడమవైపు నో అలమారు- వెనుకతట్టు నో కుర్చీ పట్టె- ఎడంలో కిటికీ- వాటి తలుపులు తెరవడానికి వీల్లేకుండా అప్పుడప్పుడు ధర్మారావు చదివే పుస్తకాలు - చదివి పారేసిన పాతపత్రికలు కొన్ని గుట్టగా పేరుకొనున్నాయి. అక్కడే చిందరవందరగా ఆఫీసుఫైళ్ల నుంచుతాడు ధర్మారావు. ఆ ప్రక్కనే బట్టలవంకీన మాసిన దుస్తులు వేలాడుతూండటంవలన ఆ ప్రదేశంలో సూర్యాస్తమయం గంటన్నర కవుతుం దనగా చీకటి పడిపోతుంది. ప్రొద్దుట ఎండ బాగా మూరెడు నుంచీ బారెడువరకూ సాగినతర్వాతగాని ఎక్కడా కనుపించటం లేదు. ధర్మారావు మనస్సులోని చీకట్ని కూడా తరుమగలిగేటంత శక్తివంతమై మిలమిల లాడుతున్నాయి వాడి కళ్లు. 'తాయ్ తాలేదురా.' అంటూ ఒకచేత్తో చెమ్మగిలిన కళ్ల నద్దుకుని వాడ్ని ఎత్తి ఎదురురొమ్ములమీద కూర్చోబెట్టుకున్నాడు.

'కానీ యివ్వనా-నానీ' అంటూండగా వాడు అరిచేత్తో తండ్రిజంధ్యాన్ని లాగుతూ పెనవేస్తూ మహదానందకేళిలో మున్నడయాడు. వాడికి కానీల మారకపు విలువ తెలీదు. చాలసేపటివరకూ కస్తూరి వాకట్లోకి వ్రాలి చూడలేదు. ధర్మారావుకూడా దీపం మాట చెప్ప మరిచాడు. రోడ్డుమీది గాలి

కొంతదుమ్మని అప్పుడప్పుడు ; రివ్వురివ్వు మంటూ లోపలకు విసుర్తోంది.

హటాత్తుగా కస్తూరి దీపం వెలిగించుకొచ్చి తీగను వ్రేలాడేస్తూ 'లేవరా అన్నాని' కంటూ, చెమ్మగిలిన భర్తకళ్లను చూసి ఆశ్చర్యపోయింది. ధర్మారావు ముఖాన్ని మరుగుపరుస్తూ 'వస్తున్నా పద' అని కుర్రవాణ్ణి ఒళ్లోంచి దించాడు.

ఒక్కమాటు చూడటంతో భర్తముఖకళవళికలోని మార్పులకు ధర్మారావు ఖిన్నవదనుడు కావటానికి గల అర్థం బోధపడలేదు. ఏమీ అవగాహన కాలేదు. వంటయింట్లో దీపంమీద నేతిగిన్నె వెచ్చబెడుతూ కలుపుతున్న పదార్థంలోకి నేతివడ్డన కొంచెమాలస్యం కాగా భయపడుతూ భర్తవంక చూసింది. అతను మామూలు పరిస్థితులలో యీఆలస్యానికి చిరాకుపడేవాడు. ఇవ్వాళ కస్తూరి నేమీ అనకుండా 'వాణ్ణి లాగివ్వు' అని చంటివాణ్ణి ప్రక్కన కూర్చోబెట్టుకుని నాలుగు ముద్దలు తినిపిస్తూ—

'నువ్వు పెట్టుకున్నావు కావే'మని కస్తూరివంక చూశాడు.

'ముందు మీరు తినండి' అన్నది నమ్రతతో.

'ఊహుఁ' అని మజ్జిగ కల్పుకుని లేచి చేయి గడుక్కుని చొక్కా వేసుకుంటూ 'వెళ్లివస్తా - తలుపేసుగో' అంటూ చెప్పులలోకి కాళ్లు దూర్చి జోళ్లు టకటకలాడించాడు.

కస్తూరి విస్తరిదగ్గరనుంచి లేచి అంటచేత్తో వచ్చి భర్తకేసి చూస్తూ నిలబడిపోయింది. ధర్మారావు గుమ్మందాటుతూ కస్తూరిలోకి చూశాడు. ఆవిడకళ్లు బేలగా జాలిగా వెన్నాడుతున్నై. 'తలుపేసుకో' మని చెప్పి చరచరా దిగి వెళ్లిపోయాడు చీకట్లోకి.

తిరిగి వచ్చి విస్తరిముందు కూర్చున్నదేగాని ఒక్క మెతుకుకూడా పోలేదు లోపలికి. పదార్థాల్ని మూతబెట్టి వంటయిల్లు కడిగి నేలమీద నిద్రతీస్తూన్న చంటివాణ్ణి ప్రక్కలో బెట్టుకొని ఆలోచిస్తూ పరుండిపోయింది.

ధర్మారావు అన్యమనస్కుడై యుంటమే గాకుండా కంట తడిపెట్టుకున్నాడు. అన్నంకూడా కలిపి వెళ్లిపోయాడు. తనీరోజు ఏదన్నా తప్పు పని చేసిందా? పరిపరివిధాల పోయింది మనస్సు. కస్తూరిఅల్లిన ఏ కుచ్చుల్లోనూ ధర్మారావు వ్యాకులతకు సరియైన కారణం చిక్కలేదు. మగవాళ్లు వున్నట్లుండి యిలా ఎందుకు మారిపోతారో... ఏదన్నా తమను కలచివేస్తూన్న సంగతు లుంటే ఎందుకు ఆడవాళ్లకు చెప్పకుండా లోపలల్లోపల్నే కుమిలిపోతారో కస్తూరికి ఎంత గింజుకున్నా అవగతం కాలేదు. అందరు మగవాళ్లూ యింతేనా? యిట్లా యింత నిర్దయగా తమ కష్టసుఖాల్ని తామే లోలోపల దాచుకుంటూ విలువలేని తృప్తుల్ని జుర్రుకుంటూ వుంటారా?

ఆడది తన మనస్సుని తేలిగ్గా పాదరసంలా మగవాడివైపుకు పోనియ్యదు. ఒకమాటు ఏ కారణంవల్లనైతే నేమి, ఆ మనస్సు ద్రవించిందా అది కట్ట తిరుగకుండా పొర్లి ప్రవహిస్తూనే వుంటుంది. తిరిగి వెనక్కు మళ్లట మనేది వుండనే వుండదు. మగవాడు ఆ మనస్సు తనవైపు మళ్లించుకోవటంకోసమే విశ్వప్రయత్నం చేస్తాడు. అందాకా 'నువ్వు నా భాగ్యరాశివి. భువనైకమోహినీ! జగదేకసుందరీ! మధురహాసినీ! కురంగాక్షీ - మదగజయానా' అని ఏవో కూస్తాడు. ఒక్కమాటు తనవైపు మళ్లినతరువాత ఏమైపోతాయో యీ ప్రేమలు పేరులు. ఎవ్వరికీ తెలియదు. మళ్ళీ అంతా మామూలు ఐపోతుంది.

రాత్రిపూట చెప్పకుండా యింట్లోంచి బయటకు నడచిన భర్తను ఎన్ని అనుమానాస్పదమైన కోణాల్లోంచి భార్య చూడగలదో అన్నివైపులనుంచీ చూసింది కస్తూరి.

ధర్మారావు యిల్లు చేరుకునేసరికి తాలూకాఫీసులో ఒంటిగంట తామ్మని ఒక్క దెబ్బతో బలంగా చీకటిని మొత్తింది. ధర్మారావు చొక్కా విప్పుతూ దీపం వొత్తి కొంచెం పెద్దది చేసి 'బయట వెయ్యి పక్కలు. లోపల ఉక్కగా వుంది' అంటూ కస్తూరికేసి చూశాడు.

కస్తూరి బొటబొటా కార్చేస్తోంది కన్నీరు. పొడుగుచేతుల చొక్కాకప్పుతో నవ్వుతూ వెన్నుమీద గట్టిగా మోదాడు. కొంచెం దగ్గరసా వెళ్లి కస్తూరి చుబుకాన్ని వ్రేలితో మీటుతూ 'ఎందుకే; ఆ పిచ్చి ఏడుపు. దడుసుకున్నావా? విభూతి మంత్రిచేదా— ఏది. ఉః ప్పు' మని కళ్లలోకి వూదాడు.

కస్తూరి నిలబడిపోయి మూతి బిగుంచుకున్నదై కదల్లేదు. ధర్మారావు తన ప్రక్క చుట్టుకుని విలాసంగా అరుగుమీదకు పోయి పర్చుకుని కూర్చున్నాడు.

కస్తూరి 'ఏమిటా ఉద్ధరింపు?' అన్నట్లు చూసింది వెళ్తూన్న భర్తను. కాస్సేపటికతను—

'కప్పుగోవడానికి ఖద్దరు కండువా యియ్యి' అని అరిచాడు. లోపల కిమన్నాస్తి—సమాధానం లేదు.

'కస్తూరీ!' అని లాలనగా పిలిచాడు.

'ఆఁ' అంటూ సన్నగా లోపల్నుంచి ధ్వని.

'ఖద్దరుకండువా?' అని మళ్ళీ ప్రశ్న.

'చంటివాడి ప్రక్కలోకి వెళ్లిపోయింది' అని లోపల్నుంచి.

'మరి నాగతేం కానూ' రసధ్వనియుక్తమైన సందేశం.

'ప్రక్కదుప్పటే తీసి కప్పుకోండి.' అని అజ్ఞ.

'పోనీ నీ చీర ఏదన్నా యివ్వు.' అని బ్రతిమాలుకోవటం.

ఆమె 'ఛీ! ఎంత సిగ్గులేని మనుష్యులు?' అని కసరటం.

'కొంతసేపటికి చలివేస్తుంది.' అని స్వగతం. లోపల్నుంచి సమాధానం నిల్.

మౌనంగా పదిక్షణాలు శాంతి ఆవరించింది ఆలోకాన్ని. ఆకాశంలో నక్షత్రాలు చంద్రుడిచుట్టూ కాపలాకాస్తున్నై.

ధర్మారావు వూరుకున్నాడు. మళ్ళీ కాస్సేపాగి,

'తలుపులు తీసున్నాయి. దొంగలు జొరబడగల్రు.'

'మీరు గుమ్మంలో అడ్డంగా పడుకున్నారుగా.'

'నన్నొకవేళ పొడిచేసి లాగిపారేస్తే..'

కస్తూరి నెమ్మదిగా 'చంటివాడు ఒంటరిగా పడుకున్నాడు. వొస్తే వాడు మేలుకుంటా...'

'పోనీలే... యిల్లా రా కొంచం వీపు దురదగా వుంది'.

౨

కస్తూరిగనుక తట్టి మెలకువ తెప్పించక పోయినట్లైతే సూర్యకరసంతప్తప్రధానాంగుడై త్వరతోడఁ బరువెత్తి వంటింట్లోకి దూకాల్సి వచ్చేది. ఐనా అతను కాలకృత్యాల్ని పూర్తిచేసుకుని కాగితాల ముందు కూర్చునేసరికి తొమ్మిదికి పైబడింది. లోపల కాళ్లు చేతులు విరుచుకుంటూ

ఆదరాబాదరా ఆఫీసువంట చేయటంలో కస్తూరి మున్నురాలైవుంది. పిల్లవాడు వంట యింట్లో గూర్చుని పోపుల డబ్బాలోని యింగువ పిసుగుతూ ఆడుకుంటున్నాడు. ధర్మారావు కొన్ని కాగితాలమీద బరకటం పూర్తిచేసినమీదట యింగువవాసన వస్తున్న దేమని లోపలకు తొంగిచూసాడు.

'ఒక్కమాటుగూడా తీసుకోరాయిరి. ఏం చెయ్యను ?'

అంటూ పిల్లవాడివీపుమీద ఒక్కటి పెట్టి వాడ్ని యీడ్చుకొచ్చి సావట్లో కుదేసింది. వాడు పెద్దపెట్టున బ్రహ్మాండం బ్రద్దలయ్యేలా అరుస్తున్నాడు.

ధర్మారావు 'అబ్బబ్బా' అంటూ కాగితాల్ని కట్టి ప్రక్కనవుంచి పిల్లవాడ్ని ఎత్తుకుని వీధిలోకి తీసుగెళ్లి ఆడిస్తూ అరుగుమీద నుంచున్నాడు.

చిన్నచిన్న వాగులన్నీ సెలయేటిలో కలసినట్లు అన్ని ప్రక్కరోడ్లమీది జనమూ మెయినురోడ్డుమీదికే ప్రాకుతున్నారు. వీధుల్లో పాలవాళ్ళూ కూరలవాళ్ళూ సన్నగిలిపోగా కళాశాలవిద్యార్థినీవిద్యార్థులు తదితరోద్యోగులు బాట నాక్రమించుకోగా ఒక ప్రవాహం సాగిపోతున్నది. మార్కెటునుంచి కూరలు తెచ్చుకునే సామాన్యుల చేతిసంచీలు, కూలివాళ్ల నెత్తిమీది కూరల బుట్టలు, పాకశాలల్లోకి చేరి వివిధరుచ్య పదార్థాలుగా స్వరూపభేదాల్ని పొందుతున్నాయి. ఇంకా వీరు గాకుండా కోర్టులకు బ్యాంకులకు చిల్లరపనులమీద తిరిగే జనాభా లెక్కలేకుండా అక్కడా యిక్కడా సందుల్లోనూ ప్రోగయి గుంపులు గుంపులుగా ఆగుతూ మాట్లాడుతూ నడుస్తున్నారు. పంపులవద్ద ఆడవాళ్లు పక్షాలు పక్షాలుగా విడిపోయి బిందెలమీద గట్లమీద రాళ్లమీద నిల్చొని కూర్చొని వంగుని లోకాభిరామాయణాలు కజ్జాలు వాగ్వాదనలు విమర్శలు దొర్లిస్తున్నారు. రోడ్డుమీది సైకిలుగంటలు, రిక్షామువ్వలు, పోలీసు యీలలు, కారుహారన్లు ఉత్పత్తించే మిశ్రమధ్వనులు లోకస్వరంలో కలపి ఏకస్థాయిలో మనోహరంగా వినిపిస్తున్నాయి. ఇంకా వీటికి తోడుగా రేడియోగ్రామఫోనులు, అన్నిహోటళ్లలోనుంచీ లోకాన్ని వూదరగొట్టి పారేస్తున్నయ్.

తెల్లవారగట్ల పై వూళ్లనుంచి వచ్చే పాలవాళ్లు కూరలవాళ్లతో ఆరంభింపబడే యీ ప్రవాహం క్రమంగా వృద్ధిపొందుతూ పన్నెండు ఒంటిగంట వేసేసరికి మెల్లగా క్షీణించి వూరుకుంటుంది. సరిగ్గా మళ్లీ రైలుప్రయాణీకుల రాకపోకలతో బాటకు జీవం వస్తుంది. ఈ ప్రవాహం చాలా నిలకడగా మందంగా సాగిసాగి తిరిగి మూడున్నర గంటలు లగాయతూ రాత్రి రెండో ఆట వదిలేవరకూ వృద్ధిపొందుతూనే వుంటుంది.

ఇది మెయినురోడ్డు దైనికజీవితసమగ్ర ప్రవాహచరిత్ర.

ఉదయప్రవాహం యింక క్షీణిస్తున్నదనగా పదకొండున్నరకు రావలసిన రైలు మందంగా ఒంటిగంటకు వచ్చి నిలవటం వలన యివ్వాళ మధ్యాహ్నంకూడా రోడ్లు కళగానే వున్నాయి.

ధర్మారావు ఒక గంట పర్మిషను తీసుకుని కాంతారావుని కలుసుకోవటంకోసం స్టేషనుకు వచ్చాడు. రెండుసంవత్సరాలుగా అన్నగార్ని గాని పిల్లల్ని గాని ధర్మారావు చూచివుండలేదు. ఇప్పుడు కాంతారావు

గత స్మృతి

శ్రీ నండూరి రామమోహనరావు

గడిచిపోయిన మధురచైత్రం
కోరకించిన మల్లె లేవీ?
మల్లికాసుమదామకీలిత
కేశబంధ సుగంధ మేదీ?

తిరిగిరాని శరన్నిశీథుల
వన్నెవన్నెల వెన్నెలేదీ?
కౌముదీపరిఫుల్లగాత్రీ
చరణ చారణ రణన మేదీ?

గతవసంతస్మృతుల మధురిమ,
విస్మృతస్వప్నాల జాడలు,
కంఠరుద్ధప్రణయగీతులు,
గుండెలోలో కలచునేలో?

ఏ యుగమ్యద్వీపమందే
హేమసౌధ ప్రాంగణానో,
నా పురాప్రణయాధిదేవత
మ్రోల నిలిచే రోజు రాదో?

ప్యగ్రామంనుంచి వస్తున్నాడంటే ఎట్లా
శరీరమంతా పులకలుగా వుంది. జననీ-
జన్మభూమిశ్చ' అనుకున్నాడు నిండుగ
ధర్మారావు స్టేషనువైపు నడుస్తున్నా వేగా
అంతసేపూ రంగాపురాన్ని గురించి
వూహల్లో తేలిపోతూనే వున్నాడు. అత
కళ్లముందు పెద్దమండువా, వంట సావిడి
యిటో గదితో తాతలు కట్టించిన యి
దొడ్లో ధాన్యము పోయించేందుకు ప్రత్యే
కంగా కట్టిన చెక్కగాదులు, అన్నట్టు
అక్కడే ఆ గాదిక్రిందే ధర్మారావు పొరు
పిల్లలతో చిన్నప్పుడు ఆడుకునేవాడు
పొరుగుపిల్లలంటే జ్ఞాపక మొచ్చింది. తనతో
ఆడుకునే శూర్పణఖ ఏ వయినట్టు? ధర్మా
రావుపెదవులమీద చిరునవ్వు అంకురించింది
గాదులక్రింద చిన్నప్పుడు బొమ్మరిల్లు కట్టు
కుని మొగుడూ పెళ్లా లాడిన శూర్పణ
ఎట్లా వుందో యిప్పుడు? అసలు ఆడపిల్లల
చిన్నప్పుడు తమతో ఆడుకుని తిరిగిన మొ
పిల్లలను పెద్దఅయినతరువాత పల్కరిస్తారు
ఎక్కడా పల్కరించరు. వాళ్లు చాల
తేలిగ్గా మర్చిపోయినట్లు ప్రవర్తిస్తారు. లే
పోతే దానికి శూర్పణఖని పేరు పెట్టినపుడు
అట్లా పిలిచినపుడు నవ్వు వూరుకుంది గా
వాళ్ల అమ్మతోనన్నా చెప్పలేదేం? దా
సంగతోటి అడిగి తెలుసుకోవాలి.' ధర్మా
రావు యీ రకమైన వూహలతో స్టేషన
లోకి వచ్చి నిలుచున్నాడు. బండి యింకా
రాలేదు.

'హల్లో ! ధర్మారావు.'

ధర్మారావు వెను దిరిగి చూసి 'నువ్వా
చక్రీ - ఎన్నాళ్ళకు కనపడ్డావురా !' అ
కౌగలించుకున్నాడు.

'ఇక్కడే వుంటున్నావా ?' చక్రి సి
రెట్టు కేసు ధర్మారావు ముఖంమీద పెట్టి
'తీసుగో బ్రదర్' అన్నాడు.

'నో ప్లీజ్, థాంక్యూ.' అని కొద్దిగ
నవ్వాడు.

చక్రి ధర్మారావువీపుమీద చరిచి,

'నువ్వు నీ ప్రిన్సిపుల్సు మార్చుకోలేవ
సుమా ! ఏవి టీ పంచె- కండువా వాలకం
నన్ను చూడు ఎంతగా మార్చివేసాన
పంథా.'


అవును నిజమే. చక్రివాలకం మునపటి
కన్నా మరీ భిన్నంగా వుంది. మునుప
కొన్నాళ్లు బెంగాలీవేషం వేస్తూ వచ్చాడు
గళ్ళలాల్చీ బిళ్లగోచిపంచె- నల్లటి ము

(39-వ పేజీ చూడుడు)



అమె రైతుల

వ్యవసాయక్షేత్రాలలోని స్త్రీలు తయారుచేసిన పండ్ల మురబ్బాలు.



ఆవుల పాలు పితకటంలో సరికొత్త విధానం. చిత్రంలో చూపిన ఎత్తయిన అరుగులమీద ఆవులను నిలబెట్టి, ఎలక్ట్రిక్ యంత్రంతో పాలు పిండుతారు. పాలుపితుకుతూన్నంతసేపూ, ఆవు దాణా తింటూనే వుంటుంది.

అమెరికాలో రైతులు ఏటేటా జరిగే సంతలకు పోవడంకోసం సన్నద్ధమౌతూ వుంటారు. ఈ సంతలు ప్రతిరాష్ట్రంలోనూ జరుగుతాయి. 19 శతాబ్దప్రారంభంలో అమెరికాలో శాస్త్రీయపద్ధతులద్వారా వాట్సన్ అనే ఒకరైతు వ్యవసాయం చేయడం ప్రారంభించాడు. శాస్త్రీయమైన పద్ధతులలో వ్యవసాయానికి, పశుపోషణకు జరిగే కర్గలాభాలు వాట్సన్‌కు దృగ్గోచరం కావడం ప్రారంభించాయి. ఆకాలపు రైతులకు ఏ కొత్తవిషయాన్ని నచ్చచెప్పాలన్నా తలప్రాణం తోకకు వస్తూవుండేది. బాగా ఆలోచించి, వాటన్స, మరో 86 మంది రైతులతో సంప్రదించి, ఒక పశువుల సంతను ఏర్పాటుచేశాడు. ఈ సంత జయప్రదంగా కొనసాగింది.

దీనితో, వాట్సన్‌లో ఉత్సాహం రేకెత్తింది. ప్రతిరాష్ట్రం పర్యటిస్తూ ఈ సంతల్లో వుండే ప్రయోజనాన్నిగూర్చి రైతులకు నచ్చచెప్పడం ప్రారంభించాడు. ఒక రైతుదగ్గరనుంచి ఇంకొకరైతు తెలుసుకోవలసింది ఎంతో వుంది. అందుకు ఈ సంతలు మంచి ఉపకరణాలు అని వాట్సన్ వారికి నచ్చచెప్పాడు.

పశువులను బాగా పెంచినవారికి బహుమానాలు, గృహపరిశ్రమలు బాగా నిర్వహించిన స్త్రీలకు బహుమానాలు, ఏర్పాటయినాయి. దున్నడంలోను, ఆటల్లోను, పాటల్లోను పోటీలు పెట్టి గెలిచినవారికి బహుమానాలు కూడా అతను చెప్పాడు.

1841 సంవత్సరం న్యూయార్క్ వ్యవసాయకసంఘంవారు శాశ్వత పదికగా ఒక పెద్ద సంత చేశారు. రైట్సూ ఆఫ్ బా చెందిన ఈశకోజుల్లో, రాష్ట్రంలో వున్న రైతైనా, ఇట్టి సంతల గల్గుతున్నాడు.

ఇప్పుడు ఈ సంతలను నడపడానికిగాను ప్రత్యేకంగా బోర్డులు వున్నాయి. ఈ బోర్డులు సంఘాలు యువజనరైతుసంఘ సహకారసంఘాల ప్రతినిధులు దించి, ఈ సంతను ఎక్కడ జడ్జీలుగా ఎవరిని ఎన్నుకొనయిస్తారు.

ఈ సంతలవల్ల నాగరికులు యకజీవితం అంటే ఏమిటో పశువులను కాయడం, గుర్రాలు యుంచడం, కోళ్లను పెంచడం నిర్వహిస్తాడో, అవగతమౌతు వ్యవసాయపరికరాలు, కొత్త సంతల్లో ప్రదర్శితా శాలలనుగూర్చి వీరంతా చర్చింతు

కా లో సంత

ష్టి, వాటిల్లో
ఇవ్వాలని

్యార్క వ్యవ
ష్ట్రం ప్రాతి
ను ఏర్పాటు
'గా అభివృద్ధి
ంలో ఏమూల
కు - ల్లో జరుకా

ఏర్పాటుచేయ
డైరెక్టర్ల
ద్దవారు రైతు
మూల్ను రైతు
లతో సంప్ర
జరపవలసిందీ,
వలసిందీ, నిర్ణ

లకు వ్యావసా
తెలుస్తుంది.
'లను సముదా
ం రైతు ఎట్లా
ంది. శాస్త్రీయ
త్త కొత్తవి ఈ
ు. ఈ పరికరా
ంటూరు.




ఫిర్కా వ్యవసాయ కేంద్ర ప్రదర్శనాలు-(సంతలు) దక్షిణ తీరంలోని మేరీలాండు ఫిర్కా ప్రదర్శనం. ఈ సంతల్లో రంకులరాటాలు కూడా వినోదాలుకూడా యేర్పాటుచేస్తారు.

అమెరికాలో వ్యవసాయ క్షేత్రం ఏ విధంగా సహకారపద్ధతిమీద నడుస్తూవుంటుందో అటువంటి సహకారపద్ధతులమీదే ఈ సంతలు గూడా నిర్వహింపబడుతూ వుంటాయి.

[illegible] వ్యవసాయపు పనిముట్లలో కొత్త కొత్త పనిముట్లను గూర్చి చర్చిస్తూ వుంటారు. ఈ పనిముట్లవల్ల రైతులకు చాలా లాభం కల్గుతూవుంటుంది. పనిభారం తగ్గించేవి కొన్ని పనిముట్లు వుంటాయి. పంటను అధికం చేయగలవి కొన్ని వుంటాయి. అసలు ఈ వ్యవసాయంస్వరూపాన్నే మార్చివేసేవి కొన్ని వుంటాయి. అందువల్ల రైతులు ఈ పనిముట్ల ప్రదర్శనలో మంచి కుతూహలం చూపుతూవుంటారు.

గృహపరిశ్రమలకు సంబంధించిన ప్రదర్శనలకు వేరే ఏర్పాట్లు సంతల్లో జరుగుతాయి. స్త్రీలు అచ్చటికి పోతారు. పిల్లతల్లులు అయినవాళ్లు శిశుసంరక్షణా ప్రదర్శనాలు చూస్తారు. ఆరోగ్యవంతులైన శిశువుల పోటీ జరుగుతుంది.

ఏ పదిరోజులలో ఈ సంత మహోత్సవంలాగా అమెరికాలో ప్రతిరాష్ట్రంలోనూ, ప్రతి ఏటా, వేసగి చివరిరోజుల్లో జరుగుతూవుంటాయి.



అయోవా రాష్ట్ర ప్రదర్శనంలో పశు ప్రదర్శనశాల.

"సైబీరియా కథ"

(TALE OF SIBEREA)

రెండవ ప్రపంచయుద్ధపు ఆఖరిరోజులవి. సోవియెట్ సైనికులు ఒక జర్మన్ పట్టణాన్ని ముట్టడిస్తున్నారు. యుద్ధ మధ్యంలో కొంత విశ్రాంతి. సైనికులు ఒక శిథిల గృహంలో విరామంగా కూర్చున్నారు. ఇంతలో ఎవరో పాడటం మొదలెట్టారు. పియానోసంగీతం వినిపిస్తుంది. సైనికులు ముగ్ధులై వింటున్నారు. వాళ్ల సేనాని అంద్రేబలాషోవ్ ఒక రష్యన్ గీతాన్ని పియానోమీద వాయిస్తున్నాడు. ఆ శిథిల గృహంలో ఆ పియానో ఒక్కటే పాడు కాకుండా నిలిచింది. ఇంతలోకే యుద్ధ ధ్వని. సైనికులు గబగబ ఆయుధాలు పట్టుకొని ఆఖరియుద్ధంలోకి పరిగెడతారు.

ఇలా ప్రారంభమవుతుంది "సైబీరియా కథ" అనే రష్యన్ చిత్రం. ఈ చిత్రం ఇండియాలో ఈమధ్యనే విడుదల అయింది. టెక్నికలర్ చిత్రం, కళాయుతమైన, సహజమైన రంగుల ఫోటోగ్రఫీ; కళాత్వం ఏమాత్రం చెడకుండా ప్రజలకతి సన్నిహితంగా వచ్చే వాస్తవికత.. ఈ చిత్రంలో రష్యన్ ప్రజల నూతనజీవితం మనం కొంతవరకూ అవగాహన చేసుకో గలుగుతాము.

పైన చెప్పిన దృశ్యంతో చిత్రం ప్రారంభమై యుద్ధానంతరం మాస్కోలో మరొక దృశ్యానికి తిరుగుతుంది. సేనాని, యువకుడు అయిన అంద్రేబలాషోవ్ మాస్కో తిరిగి వస్తాడు. ఆసమయానికి ఒక సంగీతశాలలో అంద్రే ప్రియురాలైన నతాషా పాడుతూ వుంటుంది. అంద్రేకి పూర్వం సంగీతగురువైన ప్రొఫెసర్ ఐగోనిన్ అంద్రే చాల గొప్ప గాయకుడవుతాడని ఆశ పెట్టుకుంటాడు. కాని అతని ఎడమచెయ్యి యుద్ధంలో దెబ్బ తిని గొప్ప పియానోవాద్యకుడు కావలసిన అవకాశం పోతుంది. తన ప్రియురాలు నతాషా పియానిస్టు అయిన బోరిస్ ఓలెనిచ్‌ని ప్రేమిస్తున్నటు అనుమానపడి అంద్రే పెద్ద నిరుత్సాహంతో మాస్కో విడిచి సైబీరియా వెళ్లిపోతాడు.

సైబీరియాలో కాగితాల ఫ్యాక్టరీలో కార్మికుడుగా చేరతాడు అంద్రే. సాయంత్రాలు తోటి కార్మికులకు సైబీరియన్ పాటలు పాడి వినిపించి త్వరలోనే వాళ్లందరికీ సన్నిహితుడవుతాడు. కళ, దాని ప్రయోజనం అప్పుడతనికి అర్థమవుతాయి. ప్రజలకోసమే కళ అనే సత్యం అతనికి నూతనోత్సాహాన్నిస్తుంది.

యుద్ధకాలంలో అంద్రే సేనలో నర్సుగా పని చేసిన నాస్టెంకా అనే యువతి కాగితాలఫ్యాక్టరీలో అంద్రేకు తిరిగి పరిచితురాలవుతుంది. గాయకుడైన అంద్రేని ఆమె ప్రేమిస్తుంది. కాని నాస్టెంకాని జాకొవ్ బుర్మాక్ అనే డ్రైవరు ప్రేమిస్తాడు. అంద్రే అతనితో తాను నాస్టెంకాని ప్రేమించటం లేదని నచ్చచెబుతాడు.

అక్కడ మాస్కోలో నతాషా, బోరిస్ ఓలెనిచ్ మొదలైన కొందరు గాయకులు అంతర్జాతీయగానప్రదర్శనలకని అమెరికాకు వెడుతూ, వాతావరణం బాగుండక సైబీరియాలో అంద్రే వున్న కాగితాల ఫ్యాక్టరీకి సమీపంలోనే బలాత్కారంగా దిగవలసివస్తుంది. ఇద్దరు ప్రేమికులు—నతాషా, అంద్రేలు కలుసుకొని సంతోషపడతారు. అంద్రే చేస్తున్న ప్రజాసేవను చూసి నతాషా గర్వపడుతుంది. అమెరికా వెళ్లననీ, ఇక్కడే వుంటాననీ అంటుంది. కాని డ్రైవరు బుర్మాక్, నాస్టెంకా అంద్రేని ప్రేమిస్తోందని, ఆమె ప్రేమను పాడుచెయ్యవద్దని నతాషాతో చెబుతాడు. ఆమె నిరాశతో అమెరికా వెళ్లిపోతుంది. అంద్రే ఫ్యాక్టరీని విడిచి సైబీరియా ఉత్తరభూములలోకి వెడతాడు.

నతాషా తిరిగి వచ్చేసరికి, డ్రైవరు బుర్మాక్, నాస్టెంకా పెళ్లిచేసుకుంటారు. బుర్మాక్ తన తప్పును మన్నించమని నతాషాను వేడుకుంటాడు. నతాషా అంద్రే కోసం అన్వేషిస్తుంది. ఈలోగా అంద్రే సైబీరియాలో అజ్ఞాతవాసం చేస్తూ, 'సైబీరియాకథ' అనే గొప్ప సంగీతఖండాన్ని (సింఫొనీ) రచిస్తాడు. ఆ సంగీతాన్ని మాస్కోకు వచ్చి సంగీతశాలలో ప్రజలకు వినిపిస్తాడు. అక్కడికి నతాషా, ప్రొఫెసర్ ఐగోనిన్, పియానిస్టు బోరిస్ ఓలెనిచ్, నాస్టెంకా, బుర్మాక్ కూడా హాజరవుతారు. 'సైబీరియాకథ' సంగీతఖండాన్ని అంద్రే పాడతాడు. ప్రజలు తన్మయులై వింటారు. అంద్రేసంగీతం ప్రజలకి దగ్గిరగా ఇంకా దగ్గరగా గుండెల్లోకి వస్తుంది.

తరవాత బుర్మాక్, నాస్టెంకా, అంద్రే నతాషా సైబీరియాకు వెడతారు, కాగితాల ఫ్యాక్టరీలో పని చెయ్యటానికి.

ఈ చిత్రంలో ఒక కథానీతి వుంది. నిజమైన కళ, విశాలమైన కళ ప్రజలకి సన్నిహితంగా, వారి మనోభావాలని జీవితాలని ప్రతిధ్వనించాలి. మానవుడు సంఘజీవి. అతడు సాంఘికంగా చేసే ప్రతిచర్యకీ సంఘపరంగా ఒక ప్రయోజనం వుండాలి.

ఈ చిత్రం చూస్తుంటే రష్యన్ ప్రజలు ఒక శాంతరకంజీవితాన్ని అనుభవిస్తున్నట్లు అనిపిస్తుంది. వాళ్లకీ మనకిమల్లేనే ప్రేమించటాలు, అసూయపడటాలు, ద్వేషం, క్రోధం, సమస్యలు అన్నీ వున్నాయి. కాని వాళ్ల విలువలు వేరు. వాళ్ల లక్ష్యాలు, ఆదర్శాలు వేరు. ఈ తారతమ్యాన్ని యీ చిత్రంలో చూస్తాము.

ఛాయాగ్రహణం మనస్సు పరికట్టేట్లు వున్నది. సైబీరియావిశాలమైదానాల్లో దూరాన సూర్యోదయపు వింతకాంతులు అతిసహజంగా, మనోహరంగా తెరమీద కనిపిస్తాయి. సంగీతం మన భారతీయుల చెవు

తెనుగు చిత్రసమీక్ష :

"జీవితం" 16-8-50

నిర్మాతలు: ఏ. వి. యం. ప్రొడక్షన్స్. దర్శకులు: యం. వి. రామన్. మాటలు, పాటలు: తోలేటి.

తారాగణం: వైజయంతీమాల, ఎస్. వరలక్ష్మి, టి. ఆర్. రామచంద్రన్, నారాయణరావు, సి. యస్. ఆర్. ఆంజనేయులు, లలిత, పద్మిని మొదలైనవారు.

ఇది 'వాళ్కై' అనే తమిళచిత్రానికి తెనుగు. తమిళచిత్రం తమిళనాడులో ప్రజల ఆదరం పొంది,

"ఎవనికైన తిన లేదన అవనిని నరికేదాం
"ఒకటే మానవజాతి ఒకటే మానవనీతి"

అని ఆంధ్రయువకులకోసం పాట పాడుతూ తెలుగుభాషలో తెలుగుదేశాని కొచ్చింది.

కథలోగాని సంవాదంలోగాని పొందిక, సందర్భశుద్ధి, మాటశుద్ధి మొదలైనవి ఆట్టే పాటించ నవసరంలేకుండా, ప్రజల్ని రంజింపచేద్దామనే నిర్మాతల ఆశయం ఫలించిం దీ చిత్రంలో. మంచి వాళ్లకి మంచిరోజు లెప్పటికైనా రాకపోవులే అనే నిశ్చింతతో జీవితంలో కొన్ని విశేషాల్ని, విచిత్రాల్ని చూపించ డానికి యత్నించారు. కథలోగాని భావంలోగాని సన్నివేశంలోగాని ప్రేక్షకుల్ని తికమకలు పెట్టకుండా నడిపారు దర్శకులు.

కథలో అంశాలు సామాన్యమైనవే. ఈ రోజు ఇల్లా గడిచిపోతే చాల్లే అనుకునే వారి హృదయాల్లో గూడు కట్టుకునే తలపులు భావాలు కలలు ఆశలు అవి ఎంత అవ్యక్తమైనవైనం వానిని దాటిపోకూడదనీ, దాటిపోతే సంభవనీయాలుకూడా అసంభవంగా వారికి కనిపిస్తాయని, దాటిపోనంతవరకు అసంభవాలుకూడా సంభవాలేనని • అంగీకరించగలరనీ దర్శకులకు కథకులకు తెలుసు. కథ ఆ ప్రకారమే నడిచింది. కాబట్టి జనసామాన్యాన్ని ఆకర్షించిన దనడంలో విశేషం లేదు. ఈ విషయాన్ని తెలుగు చిత్ర నిర్మాతలు అరవవారివద్ద నేర్చినట్లయితే బాగా సొమ్ము చేసుకోగలరు. చంద్రలేఖ గుణసుందరి వచ్చిన తరవాత తెలుగు నిర్మాతలుకూడా ఈ విషయాన్ని గ్రహిస్తున్నట్లు దాఖలా లేకపోలేదు.

పట్నంలో ప్రొఫెసర్ శివశంకర లింగేశ్వరప్రసాద్ గారి (సి. యస్. ఆర్) కూతురు మోహినిని (వైజయంతీమాల) ఆమె సవతితల్లి దుర్గమ్మ తన వేలు విడిచిన తమ్ముడు మూర్తి (నారాయణరావు) కిచ్చి పెళ్లిచెయ్యాలని ఎంత కోరినా, మోహిని ఇష్టం తెలపకపోవడంవల్ల పొసగదు. ఎలాగైనా మోహినిని పెళ్లిచేసుకోవాలని పట్టుదలతో ఉన్న మూర్తి, తాతని చూడ్డానికి పొలెం వెళ్లి, అక్కడొక రైతుకూతురు వరలక్ష్మిని (ఎస్. వరలక్ష్మి) బుట్టలో వేసుకుంటాడు. ఋణదాత నిర్బంధంవల్ల ఈడొచ్చిన కూతుర్ని వృద్ధుడైన ఋణతనదాతకి కట్టబెట్టడానికి రైతుఒప్పుకుంటాడు. తండ్రిఋణం తీర్చి పెళ్లిచేసుకుంటానని మాట ఇచ్చిన మూర్తిని నమ్మి, అతనితో విలాసంగా గడిపి వరలక్ష్మి గర్భిణి అవుతుంది. మూర్తి మళ్లీ పట్నం వెళ్లి మోహినిని పెళ్లిచేసుకోడానికి పన్నాగాలు పన్నుతూ కూచున్నాడు. అపవాదభయంతో వరలక్ష్మి రాత్రివేళ తలిదండ్రులికి చెప్పకుండా వెళ్లి పట్నం చేరుతుంది. మూర్తిచేత నిరాకరించబడుతుంది. బిడ్డను ఒక ధనవంతుని కార్లో విడిచిపెట్టి వరలక్ష్మి



ఏ. వి. ఎం. వారి 'జీవితం' చిత్రవిజయాని-కారణభూతురాలు కుమారి వైజయంతిమాల.

ఆత్మహత్యాయత్నం చేసి రక్షించబడుతుంది.


పసిపాపను ఆదరించి పెంచుతున్న అశోకుని కథారచనప్రశస్తి విని మోహిని మోహిస్తుంది. ఆ అశోకుడు పొరుగింటి నారాయణపతే నని (రామచంద్రన్) తెలియడంతో పతీ, మోహినీ "దసెడా" పాటలు పాడుతూ పెళ్లిచేసుకోడానికి సిద్ధపడతారు. కాని పతిపెంపకంలో ఉన్న పసిపాపను బయటపెట్టి పెళ్లి చెడగొడతాడు మూర్తి. తరవాత తప్పిపోయే కారుప్రమాదాలూ, గడపదెబ్బల బొప్పిలతో పిల్లడి తల్లి బయటపడుతుంది. మూర్తిమనస్సు మారుతుంది. రెండుజంటలూ పెళ్లిచేసుకొని కథని కంచికి పంపుతారు.

చిత్రం పొడుగునా అరవఫక్కీ "ఆరోగ్యమయం" హాస్యంతో "జీవితం" నవ్వుతూ తూలుతూ బాగానే నడిచిపోతుందిలే అని ప్రేక్షకులకు చెప్తుంది.

లకు కూడా హృద్యంగా, అర్థవంతంగా వినిపిస్తుంది.

"ఇనప తెర కవతల ఉండిపోయిన ప్రజల" ను మనం అర్థంచేసుకోవాలి. వాళ్లలోని మంచిచెడ్డలని చూసి మనం కావలసిం దేదో స్వీకరించాలి. దీనికి రష్యన్ చిత్రాలు విరివిగా మనదేశంలో ప్రదర్శితం కావటం అవసరమని ప్రభుత్వాన్ని మనం కోరాలి.

[ఎన్నార్]



బాపూజీ - రవీంద్రుడు

శ్రీ బొడ్డుపల్లి పురుషోత్తం

భారతభాగ్యవిధాతమైన గాంధీ మహాత్ముడు; విశ్వకవిచక్రవర్తి యైన రవీంద్రులు సమకాలికులు కావటం భారతదేశం చేసుకొన్న మహాపుణ్యాలలో ఒకటి. వారిరువురు వారి వారి రంగాలలో సమగ్రమైన కృషిసల్పి ప్రపంచదృష్టిలో భారతదేశప్రతిష్ఠను సమున్నతం చేశారు. రవీంద్రుడు మహాత్మునికన్న వయసులో పెద్దవాడు. భారతీయసాంప్రదాయవిజ్ఞానాన్ని ఆర్జించిన ఋషిసత్తముడు. అందువలన మహాత్మునకు రవీంద్రునిపై యెంతో భక్తిగౌరవప్రపత్తు లుండేవి. వీనికి సూచనగా బాపూజీ, రవీంద్రుని "గురుదేవా!" అని సంబోధిస్తుండేవారు. వీరిరువురు చాల పర్యాయాలు సమావేశమైనారు. వారి సమావేశాలు నిజంగా రూపుగొన్న సత్యసౌందర్యముల కలయికలే.

సత్యశివాద్వైతముల ఆశ్రయమైన శాంతినికేతనంలో మహాత్ముడు మూడురోజు లుండే తలంపుతో, రానున్నాడనే వార్త తెలియగానే నికేతనంలో ఆబాలగోపాలం అమందానంద మందింది. సమధికోత్సాహంతో నికేతన విద్యార్థులు అందుకు కావలసిన వసతుల్ని ఏర్పరుస్తున్నారు. గురుదేవులు కూడా అందులో పాలు పంచుకున్నారు.

'కళాభవనం' లోని ఒక గదిని బాపూజీకై నియోగించారు. ఆ గదినంతా సుప్రసిద్ధచిత్రకారుడైన నందలాల్ బోసు సౌందర్యాలంఛనాలైన చిత్రాలతోను, తోరణాలతోను అలంకరించారు. దీనికై విద్యార్థులు తీసికొన్న శ్రమ వర్ణనాతీతము.

ప్రభాతసమయంలో బాపూజీ వేంచేశారు. ఆయనవెంట జవహర్ లాల్, మహాదేవదేశాయి, మున్నగువారున్నారు. గురుదేవుడు వారందరికి తన ఆశ్రమంవద్ద రుచిరాగత మిచ్చాడు. పూర్ణమానవుడైన బాపూజీకి స్వయంగా, తన మధురహస్తంతో రవీంద్రుడు నొసట కుంకుమ తీర్చిదిద్ది, చందనతాంబూలాదులతో సత్కరించాడు రవీంద్రుడు. నికేతనవిద్యార్థినులు కలకంఠంతో స్వాగతగీతాలాలపించారు. ఈ మహోత్సవమంతా ముగిసినతరువాత, రవీంద్రుడు, బాపూజీని పరివారంతో, అతిథిగృహానికి గొనిపోయాడు. తనకై అలంకరింపబడిన గదిని బాపూజీ తొంగిచూశాడు. అది యెంతో నేత్రోత్సవంగా వుంది. ఆ అలంకరణవిధానానికి ముగ్ధుడైనాడు. కాని దానిని స్వీకరించటానికి ఆయనహృదయం అంగీకరించలేదు. ఆయనపెదవులపై చిఱునవ్వుదొంతరులు దొర్లాయి.

"ఇదంతా ఏమిటి? నన్నీ వైవాహికమందిరానికి తీసుకొచ్చారేమిటి?" అని చమత్కారంగా అన్నాడు బాపూ.

"ఇది సౌందర్యోపాసిమైన కవినికేతన మని మీకు తెలియదా?" అన్నాడు రవీంద్రుడు మరింత చమత్కారంగా.

"అయితే పెండ్లికూతు రేది?" అని ప్రశ్నించాడు బాపూ, హృదయగతమైన నవ్వునంతా ఒలకబోసుకుంటు.

కవిచంద్రుని సమాధానము సంసిద్ధము. "మాహృదయాల రాణియైన 'శాంతినికేతన' కన్య ఇదే మీకు దివ్యనీరాజనమందిస్తున్నది."

"ఈ బోసినోటి ముదుసలిని కన్నెత్తి చూడటాని కాకన్య యిష్టపడుతుందా?" అన్నాడు బాపూ.

"మా హృదయేశ్వరి సత్యోపాసి. సత్యమూర్తినే తన హృదయాధిపతిని గావించుకొంటుంది." అని రవీంద్రుడు బదులు పల్కి వసతులన్నీ యేర్పఱచి పనివిన్నాడు.

మఱునాడు ఉదయం అతిథుల సంగతి విచక్షణ చేయటానికి రవీంద్రుడు వెళ్లాడు. అప్పటికే మహాత్ముని బృందము ప్రార్థనలు ముగించుకొని, తమ తమ కార్య

బాలానందం :

కానుక

పూర్వకాలమునందు ఒకసారి దేవేంద్రునికి ఒక దేవతపై కోపము వచ్చి "నీవు భూలోకమునందు మానవివై పుట్టు" మని శాపమిచ్చెను. ఆ దేవత స్వర్గమును విడిచి వచ్చునపుడు ఒక ద్వారపాలకుడు ఆమెతో "నీవు దేవేంద్రునికి ప్రియమగు వస్తువు తెచ్చినయెడల నిన్ను మరల నీస్థానములో నుంచు" నని చెప్పెను.

అప్పుడామె "ఇండియా" దేశమునకు వచ్చెను. అప్పుడు "మహమ్మదుగజినీ" ఇండియా పై ఎనిమిదవపర్యాయము దండెత్తినరోజులు. యుద్ధమునందు హిందువులు ఓడిపోవుచుండిరి. ఒక యోధుడు మాత్రము ధైర్యమును చిక్కబట్టి పోరాడుచుండెను. హిందువు లందరును చనిపోయిరి. ఆ యోధుడు ఒక్కడు మాత్రము మిగిలెను.

పి. ఎస్. వేణుగోపాల్

అప్పుడు గజినీ ఇట్లనుకొనెను. "నేను ఈతనిని గెలువజాలను. ఎట్లయినను నే నీతనితో మంచిమాటలాడి సంధిచేసుకొని అర్ధరాజ్యమిచ్చెదను." ఆతనివద్దకు పోయి తా ననుకొన్న విధముగా చెప్పెను. ఆ యోధుడు "నేను గెలుపైనను పొందవలెను. లేక చావ నైనను చావవలెనేగాని "నీ సఖ్యత నాకు వద్దు" అని చెప్పెను. గజినీకి వేరుపాయము లేక తన సైనికుల నాతని పై పురికొల్పి అతనిని చంపించెను.

దేవత "ఇంత ధైర్య సాహసములు కల యోధుని రక్తపు చుక్కలను తీసికొనిపోయినచో దేవేంద్రునికి ప్రీతి కలుగునేమో" అని తలంచి ఆ రక్తపుచుక్కలను తీసికొనిపోగా, ద్వారపాలకుడు "ఇవి ఆ దేవునికి ప్రీతికాదు" అని చెప్పెను.

అప్పుడు ఆమె మరల భూలోకములో ఈజిప్టు అను దేశమునకు పోయెను. అచ్చట మంచి రోజా పూవులతోట నొకదానిని చూచెను. అప్పుడా దేవత ఒక్క పువ్వునుతీసికొని పోగా మరల ద్వారపాలకుడు మొదటి మాదిరిగనే చెప్పెను. దేవత మరల భూలోకమునకు వచ్చి అచ్చట నొక్క దేవాలయములో నొక బాలుడు దేవుని ప్రార్థించుచుండగా చూచెను. ఆపిల్లవాని తండ్రి అచ్చటికి వచ్చెను. అతడు చాల దురాత్ముడు. దైవభీతిలేక చరించుచుండెడి వాడు. కుమారుని ప్రార్థనవిని ఆతడు "నేనుఇన్నాళ్లు దేవుని లెక్కచేయక పోతినే" అని పశ్చాత్తాపపడెను. అట్లు పశ్చాత్తాపపడుచుండగా రెండు కన్నీటిబొట్లు అతని కన్నులనుండిజారి క్రిందబడెను. దేవత ఆ కన్నీటి చుక్కలను తీసికొనిపోగా దేవేంద్రుడు మెచ్చి దేవతను క్షమించి తిరిగి ఆమెకు స్వర్గమున తా విచ్చెను. పశ్చాత్తాపమువలన సకలపాపములును అంతరించును

కలాపాలలో నిమగ్నమైంది. ఆయన బాపూను సందర్శించాడు. బాపూకై గదిలో ఏర్పఱచబడిన మంచం ఆరుబయట ఉంది. బాపూ ఎప్పుడు మిన్నుగొడుగుక్రిందనే పవ్వళిస్తాడు. గదిలో తోరణాలు లేవు. గదినిండా రాట్నాలున్నాయి. ఇదంతా తిలకించి రవీంద్రు డాశ్చర్యచకితుడైనాడు.

"హరే రామ్, హరే రామ్! వివాహమందిరం ఏ స్థితిలోకి వచ్చింది!! పెండ్లికుమార్తె అంతర్ధానమైనట్లున్నదే" అన్నాడు రవీంద్రుడు హృదయావేదనతో.

బాపూ, గురుదేవుని రాకపై నిలువబడి వినయపూర్వకమైన దరహాసవదనంతో "నే నిదివఱకే చెప్పలేదా! ఈ బోసినోటివాడిని ఆమె వరించదని" అని బదులు పలికాడు.

మధురభావగర్భితమైన ఈ యిరువురి దివ్యసంభావణల నాలకించడానికి దేవతాగణం అవ్యక్తరూపంలో ఆ ప్రదేశాన సంచరించి ఉంటా రప్పుడు.

విశ్వాసపాత్రుడు

శ్రీమతి వి. యల్. సీతాదేవి

పూర్వము జర్మనీదేశమును రాజును చాలా జబ్బుచేసింది. ఆ రాజు నమ్మినవారిలో ముఖ్యుడు జాన్. ఆ రాజు చేయదలచుకున్న పనులన్నీ జాన్ తో చెప్పి మరీ ప్రాణము విడువవలెనని తలచాడు. రాజు చనిపోయే స్థితిలో 'జాన్' తో ఇలా చెప్పాడు. "నేను ఈ భూమిమీద ఎంతోకాలముండను. నా చిన్న కుమారుని విషయమై చాల జాగ్రత్తతీసుకోవలసింది. అతడింకా ఇతరుల పోషణలో ఉండవలసినవాడు. నేను చనిపోయాక నా భవనాన్ని అంతా చూపించు. ధనాగారము ఉండే స్థలము చూపించు. అన్ని గదులూ చూడవచ్చును. కాని ఒక్క గది మాత్రము చూడరాదు. దానిని చూపించవద్దు. కారణ మేమంటే దానిలో మిక్కిలి అందమయిన కన్యయొక్క చిత్రపటము ఉంది. దానిని రాకుమారుడు కావాలని పట్టుపడతాడు. కాని ఆమెను పొందుటకు చాల కష్టములు పడవలసిఉంటుంది. నీసాధ్యమయినంతవరకు ఈ ఆపదనుండి రక్షించవలసి ఉంటుంది." జాన్ తప్పకుండా ప్రయత్నిస్తానని రాజునిసంతృప్తిపరచాడు. కొంతసేపటికి రాజు దీర్ఘనిద్రపోయాడు.

జాన్ తన యువరాజుతో, రాజు చెప్పిన విషయాలన్నీ చెప్పి బోధపర్చాడు. యువరాజు,'జాన్'ను తన కుడిభుజములాగ చూసుకుంటా నని చెప్పాడు. 'జాన్' యువరాజుకి తాళముచెవులని స్వాధీనము చేశాడు. ఒక్కొక్కగది తెరచి దానినిగూర్చిన విషయాలన్నీ తెలియజేశాడు. ఒక్కగదిమాత్రము తెరువకుండా దాటి వెళ్లిపోతూంటే, యువరాజు ఆపి అడిగాడు. "ఈఒక్కగదిలోకి తమరువెళ్లకూడదని రాజుగారి మనవి." అని జాన్ తెలియజేశాడు. "నేను చూడతగనిది ఏముం"దని తిరిగి ప్రశ్నించాడు.

"నిన్నుకష్టాలపాలు చేసే ఒక చిత్ర ముందని." జాన్ చెప్పాడు.

"నేను దానిని తప్పక చూడాలి. నన్నుభయపెట్టుటకు చిన్న పిల్లవానినిగాను. నేను నీయజమాని నని జ్ఞాపకముంచుకో. నా భవనాన్ని చూడటానికి నీఅధికార మేమిటి" అని యువరాజు'జాన్'ని గద్దించాడు.

నిట్టూర్పువిడుస్తూ విధిలేక జాన్ ఆ గదిని తెరచాడు. శపథము విషయము జ్ఞాపకమొచ్చి 'జాన్' యువరాజునే ఆ తాళముతీయమన్నాడు. తలుపు తెరువగానే యువరాజు యెదురుగా నున్న చిత్రపటమును చూచాడు. స్పృహ తప్పి పడిపోయాడు. 'జాన్' మెల్లిగా అతని గదిలోనికి తీసుకెళ్లి ఉపచారములు చేశాడు. మెల్లిగా యువరాజు తెప్పరిల్లి "ఆ పటములో నున్న స్త్రీ యెవరు? అంత అందగత్తె యెవరు?" అని ప్రశ్నించాడు. జాన్ దీనికి జవాబు చెప్పదలచుకోలేదు. కాని చెప్పక తప్పిందికాదు. జాన్ చాల విచారవదనుడై "ఆమె ఒక రాజకుమార్తె. ఆమెను కోరినట్లయిన, నీవు కష్టాలపా లవుతావు" అనిచెప్పాడు.కాని యువరాజు "నేను దానికి లెక్కచెయ్యను. నాసర్వస్వాన్ని ఆమెకొరకు త్యాగముచేయుటకు సిద్ధముగా వున్నాను. ఆమె లేని నాజీవితము వృథా. ఆమెకొరకు నా జీవితాన్ని సంతోషముగా త్యాగము చేస్తాను" అన్నాడు.

జాన్ ఇదేలాగూ తప్పదనుకున్నాడు. కాని యువరాజును మాత్రము ఈ కష్టాలనుండి ఎలాగో కాపాడటమే తన ధర్మమనుకున్నాడు. యువరాజు ఆమె ఎక్కడుంటుందో ఎలా ప్రయత్నించాలో చెప్పమని అడిగాడు. జాన్ ఇలా చెప్పాడు. "ఆ రాజకుమార్తెకు బంగారముతో చేసిన వస్తువులంటే చాల ప్రీతి. ఆమెభవనములో పళ్లెములు, గోడలు, ప్రతివస్తువులు బంగారముతో చేయబడినవే. ఆమె ఎప్పుడూ ఇంకా కొత్త కొత్త బంగారువస్తువులకొరకు ప్రయత్నిస్తూంటుంది. మనదగ్గర కూడ చాల బంగార ముంది.మన ఆస్థానకంసాలులను పిలిపించి రకరకాల వస్తువులను చేయించుదాము. వీటితో ఆమెను జయించగల మనుకుంటాను" అన్నాడు. యువరాజు సంతోషముతో ఉప్పొంగిపోయాడు. పనితనము గల కంసాలులందరు ఆహ్వానింపబడ్డారు. అందరికీ యువరాజు బంగార మిచ్చి వారి శక్తికొలది అమూల్యమయిన వస్తువులను తయారుచేయమన్నాడు. ఈవిధముగా సంవత్సరమునైన ఒక్క రోజుకల్లా అన్ని వస్తువులూ తయారా

(30-వ పేజీ చూడుడు)

బాలానందం:

'చిన్నమ్మ'

★

[కోకిల]

విజయనగరము రాజధానిగా యావదాంధ్రదేశమును ఏకచ్ఛత్రాధిపత్యముగా పరిపాలించి, అష్టదిగ్గజములైన కవులను పోషించి, తెనుగుభాషామతల్లికి అపూర్వసేవ లొనర్చి, "ఆముక్తమాల్యద" అనే ఉత్కృష్ట గ్రంథాన్ని రచించిన శ్రీకృష్ణదేవ రాయలవారి భార్యలలో 'చిన్నమ్మ' ఒకామె. ఆమె అసలుపేరు అన్నపూర్ణ. అది రాయలవారామెకు పెట్టిన ముద్దుపేరు. రాయలవారు చిన్నమ్మను వివాహంచేసుకున్న సందర్భంలో ఒక కథ చెప్పారు.

ఒకరోజు రాయలవారి ముఖ్యమంత్రి తిమ్మరుసు (అప్పాజీ) ఒక దండుతో బయలుదేరాడు. ప్రయాణం చేయగా, చేయగా, చీకటి పడేటప్పటికి విజయవాడ కనకదుర్గకొండవద్దకు చేరుకున్నాడు. సైన్యమంతా గుర్రాలతో సహా కొండ యెక్కేటప్పటికి పూర్తిగా చీకటిపడిపోయింది. ఆరోజు అమావాస్య. దారీ, తెన్నూ కనబడటంలేదు. సైనికులందరూ తమతో తెచ్చుకున్న ఆహారం తిని, అక్కడ కోనేటిలో నీరు త్రాగి, నివాసయోగ్యమైన చోట విశ్రమించారు. తిమ్మరుసు మాత్రము కోనేటిలో స్నానం చేసి, సాయంసంధ్య వార్చుకుని, ఒక చెట్టుమీద కూర్చున్నాడు.

క్రమంగా రాత్రి పన్నెండుగంటలయింది. సైన్యమంతా మైమరచి నిద్రపోతున్నారు. తిమ్మరుసు మాత్రం మేలుకునేఉన్నాడు.

ఇంతలో తిమ్మరుసుకు ఒక దృశ్యం కనబడింది. మినుకు మినుకు మనే దీపంతో కొందరు బోయీలు ఒక "మేనా" మోసుకు వస్తున్నారు. ముందు దివిటీలు పట్టుకుని, ఒక పూజారి, నలుగురు ఖడ్గధారులున్నారు. "ఆడబోయిన తీర్థం ఎదురైన" ట్లయింది తిమ్మరుసుకి. కిక్కురుమనకుండా ఆ చెట్టు మీదనే కూర్చున్నాడు. ఇంతలో ఆకాశంచిల్లులు పడ్డట్లు, కుంభవృష్టి ప్రారంభమైంది.

బోయీలు మేనాను, కనకదుర్గగుడిముందు దింపారు. పూజారి గుడితలుపులు తెరిచి, లోపలదీపారాధన చేశాడు. పూజారితోపాటు వచ్చిన ఖడ్గధారులు మేనాతలుపు తెరిచి, ఒక అందమైన యువతిని, యువకుని దింపి ఇద్దరినీ బలవంతంగా గుడిలోకి నెట్టి, తలుపు బిడాయించారు. తిమ్మరుసు ఏమి జరుగుతుందో చూదామని, మెల్లిగా చెట్టు దిగి, తలుపుసందులలో నుంచి చూడటం మొదలుపెట్టాడు.

లోపలకు వెళ్లిన పూజారి, వాళ్లిద్దరి మెడలలో వేపదండలు వేసి, అమ్మవారికి నైవేద్యంచేస్తున్నాడు. తిమ్మరుసుకు పట్టరాని ఆగ్రహం వచ్చింది. వెంటనే సైన్యాన్ని లేపాడు. అందరూ చేరి ఒక్కపెట్టున గుడితలుపు పగులకొట్టి, లోపలకు చొరబడ్డారు. తిమ్మరుసునీ, దండునీ చూచేటప్పటికి పూజారికీ, బోయీలకూ పై ప్రాణాలు పైనే పోయినయి. ఆ తొందరలో, బలిసాగదనే భయంతో, ఒకడు యువకుని తల నరికివేశాడు. ఆ వ్రేటుతో, యువకుని తల దేవికాళ్ళముందు పడి, నెత్తురు పై కెగజిమ్మింది—

తిమ్మరుసు ఆలస్యంచేస్తే పిల్లను కూడ చంపుతారని ఖడ్గం దూసి,

వాళ్ల మీాద్ధి కురికాడు. ఈ సమయంలో తన ప్రాణాల రక్షించుకోటానికి పూజారి అమ్మవారివిగ్రహం చాటున దాక్కుని, తొంగి తొంగి చూస్తున్నాడు. క్షణంలో అందరూ హతులైనారు. తిమ్మరుసు యువతిచెంత చేరి ఆమె వృత్తాంతం చెప్పమని అడిగాడు. ఆమె యిలా చెప్పింది.

"అయ్యా! ఆ చనిపోయినవాడు నా సోదరుడు. మేము కొండపల్లి దుర్గానికి చెందినవారం. మా ప్రభువైన గజపతిదేవుడు పరమదుర్మార్గుడై, ప్రజలను నానాహింసలు పెడుతున్నాడు. అక్కడి బాధలకు తట్టుకోలేక, సుభిక్షమైన రాజ్యం విజయనగరానికి వలసవస్తున్నాము. దారిలో రాజభటులు మమ్మల్ని బందీచేసి, గజపతిముందు పెట్టారు. గజపతి నన్ను చూచి మోహించి, తన్ను పెళ్లిచేసుకోమని ప్రాధేయపడ్డాడు. పెళ్లిచేసుకుంటే కొండపల్లిదుర్గానికి రాణి చేస్తానని ఆశపెట్టాడు. అటువంటి నీచుడిని పెళ్లిచేసికోడం నా కిష్టంలేకపోయింది. అందుకు గజపతి కోపించి మమ్మల్ని గుళ్లో బలి ఇవ్వాలని ఆజ్ఞాపించాడు. మేము చాలా బీదవాళ్ళం. మా యిద్దరికీ చిన్నతనంలోనే తల్లిదండ్రులు చనిపోయారు. అప్పటినుంచీ దిక్కులేకుండా పెరిగి, నేటి కీస్థితికి వచ్చా" మని చెప్పి, దుఃఖాన్ని ఆపుకోలేక వలవల ఏడ్చింది.

తిమ్మరుసామెకు ధైర్యం చెప్పి, ఆమెఅన్నకు యథావిధిగా దహన సంస్కారములు చేశాడు. తరువాత పూజారికోసం వెదికి, విగ్రహం చాటున పట్టుకున్నాడు. కాని పూజారిని చంపలేదు. ఎందుకంటే జరిగినదంతా అతడు అతని ప్రభువుకు చెప్పుకోవాలని, తిమ్మరుసు అభిప్రాయం.

తెల్లవారేసరికి, తిమ్మరుసు విజయనగరం చేరుకున్నాడు. కొండపల్లిదుర్గానికి బయలుదేరిన అప్పాజీ, తెల్లవారేటప్పటికి తిరిగి రావటం, రాయలవారి కాశ్చర్యాన్ని కలిగించింది. సంగతేమిటని అడిగాడు. తిమ్మరుసు మేనాలో ఉన్న యువతిని చూపి, జరిగిన కథంతా చెప్పాడు. రాయలవారు, తిమ్మరుసుబుద్ధికుశలతకు, ఔదార్యానికి చాలా మెచ్చుకున్నాడు.



రాయలవారు చేయించిన పరిచర్యలతో, అన్నపూర్ణ కొంతకాలానికి పరిపూర్ణ ఆరోగ్యవంతురాయింది. అన్నపూర్ణ బాగాచదువుకున్నది. తెలివితేటలు, చురుకుదనము కలది. ఏ విషయాన్నైనా ఒక్కమారు విన్నంతమాత్రానే గ్రహించేది.

విజయనగరం వచ్చినప్పటినుండీ, అన్నపూర్ణ కొక ప్రత్యేక మందిరమేర్పాటు చేయబడినది. పరి ఆరోగ్యపూర్ణ వంతురాలయిన తర్వాత కూడ, అన్నపూర్ణ కామందిరంలోనే ఉండాలంటే విసుగు కలిగేది. అందుకని రాయలవారి అనుమతిమీద, అప్పుడప్పుడు రాజసభలలో పాల్గొంటూ, తన తెలివి తేటలను ప్రదర్శించేది.

కొంతకాలం గడిచింది. రాయలవారు అన్నపూర్ణ తెలివికి, విద్యకు, విజ్ఞానానికి, అందచందాలకు ముగ్ధుడైనాడు. ఆమెపై మోహం కలిగింది. ఒక శుభ ముహూర్తాన, అగ్నిసాక్షిగా రాయలవా రామెను వివాహం చేసుకున్నాడు.

నాటినుండిఅన్నపూర్ణ 'చిన్నమ్మ' అయింది. రాయలవారు ఆమె ప్రోద్బలంపైన, కొండపల్లిదుర్గాన్ని నేలమట్టం చేసి, దుర్మార్గుడైన గజపతిని సంహరించాడు.

నక్షత్రకుని దర్భలు

శ్రీ బి. ఎల్. దేశపాండే

పూర్వం విశ్వామిత్రమహర్షికి నక్షత్రకుడు అనే ఒక శిష్యుడు వుండేవాడు. నక్షత్రకుడు మాటలలోను, పనులలోను, నడకలోను వినోదాన్ని ప్రదర్శిస్తూ వుండేవాడు. విశ్వామిత్రుని శిష్యబృందములో అందరికంటే తెలివిగలవాడనికూడా పేరు సంపాదించుకున్నాడు. హరిశ్చంద్రమహారాజువద్దనుండి బాకీ వసూలు చేయటానికి విశ్వామిత్రుడు నక్షత్రకుడినే పంపాడు.

హరిశ్చంద్రమహారాజు అడవుల వెంట భార్యాబిడ్డలతో వెడుతూ అనేక రకాలయిన కష్టాలు పొందుతూ వుంటే నక్షత్రకుడు మాత్రం కడుపార భుజించి, కాళ్లు నొప్పులు పుట్టకుండా మహారాజుగారి భుజాలమీదఎక్కి వెడుతూ వుండేవాడు. దోవలో విచిత్రమైన సంభాషణలు చేస్తూ పాటలు పాడుకుంటూ తనలోతాను నవ్వుకుంటూ వుండేవాడు.



చివరకు కాశీపట్టణంలో హరిశ్చంద్ర మహారాజు ఆలుబిడ్డలనుఅమ్మి, తానూ అమ్ముడుపోయి విశ్వామిత్రునిఋణం నక్షత్రుకునికి ఇచ్చి పంపాడు. నక్షత్రకుడు చుట్టుప్రక్కల వున్న పుణ్యతీర్థాలు అన్నీదర్శిస్తూ వెడుతూ వున్నాడు. దోవలో ఒకనదిలో స్నానం చేయటానికి చేతిలోని డబ్బు, గుడ్డలు ఒడ్డున పెట్టి స్నానంచేసి జపంప్రారంభించాడు. కొంతసేపటికి ఈశ్వరుడు కోయవానివేషంలోఅక్కడకు వచ్చి నక్షత్రకునిచూచి "ఆర్యా! ఈమూటలో ఏమివున్నది" అని అడిగాడు.

"ఏమి వుంటె నీకెందుకు? పో అవతలకు" అన్నాడు నక్షత్రకుడు.

"మా ఆజ్ఞ లేనిదే ఈ కాశీనగరి హద్దులుదాటి ఏవస్తువూ తీసుకొని పోకూడదు" అన్నాడు కోయవేషంలో వున్న ఈశ్వరుడు.

డబ్బు అని చెప్పితే తీసుకొనిపోనీయడేమోనని "భావించి దాంట్లో మీ ఊరినుండి తెచ్చిన వస్తువులు ఏమీ లేవు. మా దేశంనుంచి తెచ్చిన దర్భలుఅవి"అని సమాధానం చెప్పాడు నక్షత్రకుడు.

"ఓహో! అలాగా, దర్భలా తథాస్తు, అట్లాగే దర్భలనే తీసుకుపోండి. కాని ఇంకేమీ తీసుకొనిపో వద్దు సుమా?" అని వెళ్లిపోయాడు కోయ.

నక్షత్రకుడు జపం పూర్తిచేసుకొని మూట తీసుకొని బయలుదేరాడు. కాశీసరిహద్దు దాటాక మూటలోని పండ్లను తిందామని మూట విప్పిచూశాడు. దాంట్లో వున్న డబ్బుఅంతా దర్భలుగా మారిపోయివుండటం చూచిఆశ్చర్యపోయాడు. గురువుగారికి ఏమి సమాధానం చెప్పాలో అర్థంకాక పిచ్చి ఎక్కినట్లు గంతులు వేశాడు.

ఈ విషయం విశ్వామిత్రునికి "దివ్యదృష్టి" వల్ల తెలిసింది. దానికి విరుగుడు ఏమిటా అని ఆలోచించాడు. ఆ దర్భలకు నరబలి యిస్తే తిరిగి ధనంగా మారుతుందని బోధపడింది. దానికోసం రాజకుమారుడైన లోహితాస్యుని-దర్భలకైవచ్చిన వానిని పాముచేత కరిపించి దర్భలకు బలియిప్పించాడు. వెంటనే నక్షత్రకుని మూటలో తిరిగి ధనం వచ్చింది. డబ్బు తీసుకొని తిన్నగా విశ్వామిత్రునిదగ్గరకు పోయి జరిగిన

(40-వ పేజీ చూడుడు)

విశ్వాసపాత్రుడు

(26-వ పేజీ తరువాయి)

రయాయి. ఒకదానిని మించిన దొకటి కనబడింది. తప్పక యువరాజు ఆమెప్రేమను పొందగల ననుకున్నాడు జాన్.

యువరాజు, జాన్, ఇద్దరూ కూడా విదేశవర్తకులవలె వేషములు వేసుకున్నారు. బంగారపు సరుకులన్నీ ఓడలోనికి చేర్చారు. జాన్ సరిగ్గా ఆ రాజకుమార్తె ఉండే ప్రదేశానికి చేర్పించాడు ఓడని. తీరమును చేరినతర్వాత, యువరాజుతో జాన్ "నేను ముందు వెళ్లి ఆమెనే ఇక్కడకు తెచ్చుటకు ప్రయత్నిస్తాను. నాతోకూడ కొన్ని బంగారపుసరుకులను తీసుకవెళ్తాను. నీవు సిద్ధముగా వుండు" అన్నాడు. ఉన్న వానిలో మంచిసరుకులను తీసికొని బయలుదేరాడు జాన్. ఆ రాజకుమార్తెభవనములోకి ప్రవేశించాడు. ఒక అందమయిన బాలిక రెండు బంగారపు బాల్చీలతో నీటిని తెచ్చుటకు వెళ్లుతున్నది. ఆ బాలిక జాన్ విషయ మడిగింది. ఆమె అతని వద్ద నున్న వస్తువులు తమ రాకుమారివద్దకు తీసుకువెళ్లింది. రాజకుమార్తె ఒక అందమయిన బంగారుగదిలో బంగారుపాన్పుపై కూర్చొని బంగారుమురళిని వాయిస్తున్నది. ఆమెను చూడగానే జాన్ తన శరీరాన్నే మర్చాడు. ఆ చిత్రపటంలోకన్న వెయ్యిరెట్లు అందముగానున్న దనుకున్నాడు. ఆ వస్తువులన్నీ చూడగానే రాజకుమారి మంత్రించినట్లయిపోయింది. జాన్ తెచ్చిన వస్తువులన్నీ రాకుమారి కొంటా నంది. జాన్ "ఇవే కావు. తమరు అక్కడకే వస్తే ఆ ఓడలో ఉన్న ఇంకా మంచి వస్తువులను చూడవచ్చును" అన్నాడు. సరేనని రాకుమారి ఆతనివెనుక బయలుదేరింది.

జాన్ ముందుగా వెళ్లి యువరాజుతో చెప్పాడు రాజకుమార్తె వస్తోందని. యువరాజు రాజకుమార్తెను మాత్రమే ఓడలోనికి రానిచ్చి, ఆమెతో వచ్చినవారిని ఒడ్డున ఉండ మన్నాడు. జాన్ ఆమెను ఓడలోనికి ఎక్కించాడు. వెంటనే జాన్ యువరాజుకు వప్పగించాడు రాజకుమార్తెను. ఆ వస్తువులన్నీ చూడ్డంతోనే రాజకుమార్తె ప్రపంచమునే మరచిపోయింది. తనతో వచ్చిన పరిచారికలవిషయ మసలే గుర్తు లేదు. అన్నీ చూసినతర్వాత ఒక్కసారి తనే ప్రపంచములో నున్నదీ జ్ఞాపకముచేసుకుంది. చాలా ఆలస్యమయిం దనుకుంది. కాని ఓడ చాల దూరము పోయినట్లు ఆమె గ్రహించనే లేదు. ఆమె ఓడచివరకు వచ్చి చూస్తే సముద్రము తప్ప వేరేమీ లేదు.

ఆమె వెంటనే "ఎంత మోసము, దుర్మార్గులు. నేను తప్పించుకుపోలే ననుకున్నారు" అంటూ సముద్రములోకి దూకబోయింది. కాని యువరాజు ఆమెను దూకనివ్వకుండా పట్టుకున్నాడు. యువరాజు ఆమెతో "నువ్వుచాల అందగత్తెవు. నేను నిజంగా వర్తకుడిని గాను. ఒక రాజును. స్త్రీప్రేమను సంపాదించుటకు వచ్చాను. తిరిగి స్త్రీప్రేమను ప్రసాదించకపోతే నే నీ సముద్రములో పడి చస్తాను. నా విశ్వాసి జాన్, ఈ ఓడను తిప్పి నీ రాజ్యములో నిన్ను వదులుతాడు" అన్నాడు. రాజకుమార్తె మొదట కోపావేశురాలైనప్పటికీ ఈ మాటలు విన్నతరువాత మనస్సు మార్చుకుంది. ఆమె తనకొరకేగదా ఇంత శ్రమపడ్డా డనుకుని ఒప్పుకుంది. ఆమె తన ప్రేమను యువరాజుకు ప్రసాదించింది. ఆమె యువరాజును తప్పక వివాహము చేసుకోవా లనుకుంది.

ఇంతలో మూడు రాబందులు ఆ ఓడమీదుగా ఎగిరిపోతున్నాయి. సరిగ్గా ఓడచివర మురళివాయిస్తూ జాన్ కూర్చున్నదానిపైన ఒకసారి వాలి మళ్ళీ ఎగరసాగాయి. పక్షిభాష బాగా తెలిసినవాడు జాన్. కావున ఆ పక్షులు ఏమి మాట్లాడుకుంటాయో విందామని జాన్ తన మురళిని ఆపాడు. వాటిలో మొదటి రాబందు "రాజకుమార్తెను దొంగిలించి యువరాజు తీసుకుపోతున్నారు. సరే పోనీ!" అంది. రెండవ రాబందు "తీసుకుపోతున్నప్పటికీ ఆమెను ఇంకా పొందలేదు" అంది. మూడవరాబందు "లేదు యువరాజుముఖము సంతోషముగా ఉంది. తప్పకుండా ఆమెప్రేమను సంపాదించి ఉంటాడు." అంది. ఇంతలో మళ్ళీ మొదటిరాబందు "ఇదేమీ

లాభం లేదు. యువరాజు తీరాన్ని చేరగానే ఎర్రని రంగు గల ఒక గుర్రము ఎదురుగా కనపడుతుంది. దానిని ఎక్కుటకు యువరాజు ప్రయత్నిస్తాడు. వెంటనే ఆ గుర్రము గాలిలోకి ఎగిరిపోతుంది. ఆవిధంగా అతడు ప్రియురాలికి ఎడబాటవుతాడు" అంది. "అయితే దానికి రక్షణ లేదా" అని రెండవ రాబందు ప్రశ్నించింది. "తప్పకుండా ఉంది" అంది మొదటి రాబందు. "ఎవరయినా గుర్రముయొక్క జీనులో ఉండే కత్తిని తీసి దాంతో గుర్రము తల నరికెయ్యాలి. కాని ఆవిధముగా చేసినవారు మోకాలునుండి పాదాలవరకు శిలలైపోతారు" అంది. ఇంతలో రెండవ రాబందు "గుర్రము చచ్చినా ఇంత కన్న చెడుగు వెంటనే యువరాజుకి ప్రాప్తమవుతుంది. యువరాజు తన ప్రియురాలికి తిరిగి ఎడబాటు అవవలసివస్తుంది. భవనాన్ని చేరగానే మంచి రాజదుస్తులు కనిపిస్తాయి. అవి బంగారముతో చేయబడిన వానివలె ఉంటాయి. వాటిని యువరాజు ధరిస్తే తప్పక చనిపోతాడు." అంది. "కాని ఆ దుస్తులను చూచినవారు భవనానికి ఎదురుగా నున్న సరస్సులో ఆ దుస్తులను విసిరేస్తే యువరాజు రక్షింపబడతాడు. అయితే రాజుని రక్షించినవారు నడుమునుండి కిందివరకు శిల అయిపోతారు" అంది రెండవరాబందు. ఇంకా కష్టాలున్నాయి నాకు తెలిసిన వంటూ మూడో రాబందు మొదలుపెట్టింది. "రెండు పర్యాయములు రక్షింపబడినప్పటికీ యువరాజుకి ప్రియురాలు ఎడబాటవుతుంది. వివాహమయినతర్వాత నాట్యము ఉంటుంది. కొద్దిసేపట్లోనే రాజకుమార్తె స్పృహతప్పి పడిపోతుంది. ఏమి ఉపచారాలు చేసినా ఆమెకు స్పృహ రాదు. కాని ఆమె ఛాతినుండి మూడు రక్తబిందువులను తీసి చల్లినట్లయితే బ్రతుకుతుంది. కాని ఆవిధముగ ఆమెను రక్షించినవారు పూర్తిగ శిల అయిపోతారు"అంది. ఆమూడుపక్షులూ ఇలా అనుకుని ఒక్కసారిగా ఎగిరిపోయాయి.

ఈ బాధ్యత అంతా తనపైనే ఉందని జాన్ అనుకున్నాడు. తాన్ నిజంగా రాయి అయిపోయినట్లుగా భ్రమించాడు జాన్. సంతోషసముద్రములో తేలిఆడుతున్న యువరాజుకి ఇదేమీ తెలియపర్చలేదు. ఇంతలో ఓడ తీరమును చేరింది. ఇదివరకు రాబందులు చెప్పిన విషయము నిజమే అయింది. గుర్రము సిద్ధముగా ఉంది. ఆ గుర్రము యువరాజు తనదే ననుకొని దాని నెక్కబోయాడు. కాని వెంటనే జాన్ వెళ్లి గుర్రముయొక్క జీను పట్టిలాగి రాజును ఆపి, జీనుయొక్క సంచిలో నుండే కత్తిని తీసి దాని తల నరికివేశాడు. యువరాజు దీనినంతా విచిత్రముగా చూస్తున్నాడు. కాని జాన్ ఇంత అంతరంగికుడుగా నుండుట కిట్టనివాళ్లు "చాల అపరాధము చేశాడు. అంత గొప్ప గుర్రాన్ని చంపేశాడు. ఇప్పుడు యువరాజునీ రాణినీ తీసుకెళ్లగల గుర్రాన్ని ఎక్కడనుంచీ తేగలము?" అన్నారు. కాని యువరాజు ఏమీ కోపించక "జాన్ నా విశ్వాసపాత్రుడు. అతడు అన్నీ నామంచికే చేస్తాడు" అన్నాడు.

రాజు తన పరివారముతోసహా భవనాన్ని చేరుకున్నాడు. రాజు భవనాన్ని చేరకముందే జాన్ రాబందులు చెప్పిన విషయము జ్ఞాపకము తెచ్చుకుని భవనాన్ని చేరాడు. ఎదురుగా ఒక సోఫాపై బంగారువలె మెరిసిపోతున్న రాజదుస్తులు అమర్చబడి యున్నవి. ఇంతలో యువరాజు వచ్చాడు. వాటినిధరించబోతూండగా జాన్ లాక్కొని ముక్కలు ముక్కలుగ చింపి ఆ సరస్సులోకి విసిరేశాడు. మరల జాన్ విరోధులు తిరుగుబాటు ప్రారంభించారు. కాని రాజు "అదీ ఒక మంచి పనే అయిఉంటుం"దని శాంతి ఏర్పచాడు.

తరువాత వివాహమహోత్సవము ప్రారంభమయింది. నాట్యము ఏర్పాటుచేయబడింది. ఇవస్నీ

జరుగుతున్నప్పటికీ 'జాన్' తన మనస్సును వాటిపై పనిచేయనీక రాజు రక్షణార్థము మాత్రము పనిచేస్తున్నాడు. నాట్యానికి అందరూ హాజరయ్యారు. రాజూ, రాణీ కూడా వచ్చారు. నాట్యము ప్రారంభమయింది. ఇంతలో రాణి చనిపోవుదానివలె కళ్లు తేలేసి క్రింద పడిపోయింది. వెంటనే జాన్ ఎక్కడనుండో వచ్చి పక్షివలె వ్రాలాడు. వెంటనే ఆమెను లేవనెత్తి తన చొక్కాజేబులోనుంచి ఒక కత్తి తీసి మెల్లిగా పొడిచి ఆమె ఛాతీనుండి మూడు రక్తబిందువులను తీశాడు. ఆ రక్తాన్ని ఆమెపై చల్లి ఆమెను బ్రతికించాడు. ఈసారి రాజుకి చాల కోపము వచ్చింది. గుర్రాన్ని చంపినట్లుగానే తన రాణినికూడ చంపుతున్నా డనుకున్నాడు.

"వీడిని తీసుకెళ్లి ఖైదుచెయ్యండి. రేపటికల్లా ఇతడు చనిపోవాలి" అంటూ రాజు ఆజ్ఞఇచ్చాడు. మరుచటిదినము 'జాన్'ని ఉరికంబము వద్దకు తెచ్చుటకు సైనికులు వెళ్లారు. కాని జానీ శరీరము కదల్చుటకు వీలులేక రాతితో పోతపోసినదానివలె ఉంది. "నేను చనిపోయే ముందు బిగ్గరగామాట్లాడవచ్చునా" అని జాన్ అడిగాడు. రాజు సరే నన్నాడు, "నాకు అన్యాయము జరిగింది." అంటూ జాన్ తాను రాబందులవలన విన్నదంతా తెలియజేశాడు. తాను ఎల్లపుడు తన యజమానిని రక్షించుటకే ప్రయత్నించానని, అందుకే ఈపనులన్నీ చేశాననీ జాన్ మనవిచేశాడు. ఇది వినీ వినటముతోనే రాజు అపరాధము క్షమించుమంటూ అరిచాడు. కాని ఇప్పటికే చాల ఆలస్యమయింది. విశ్వాసి జాన్ సంపూర్ణముగ శిలగా మారిపోయాడు. జాన్ మాటా మంతీ లేక చలనము లేని విగ్రహమువలె నిలబడిపోయాడు. అప్పుడు రాజు, రాణికూడ మిక్కిలి విలపించారు. జీవము లేని ఆ శిలావిగ్రహమును రాజు తన స్వంత గదిలోకి తీసుకువెళ్లాడు. ఆరోజు రాత్రిమధ్యలో లేచి "విశ్వాసఘాతకుణ్ణి, ద్రోహిని" అంటూ రాజు పెద్దగా ఏడ్వటము మొదలుపెట్టాడు.

కొంతకాలముతర్వాత రాణికి ఇరువురు కుమారులు కలిగారు. ఒకరోజున రాణిమాత్రము వాహ్యాళికై బయటకు వెళ్లింది. రాజుకుమారులు ఇంటివద్దనే ఉండిపోయారు. భవనములో ఆ శిలావిగ్రహమువద్ద రాజుకుమారులు ఆడుకుంటున్నారు. రాజుమాత్రము ఆ శిలావిగ్రహాన్ని చూచి ఖిన్నుడై "నా విశ్వాసి జాన్, నీ ప్రాణము తేలేనుగదా" అని బొటబొట కన్నీళ్లు కార్చాడు. ఆ శిలావిగ్రహము మాట్లాడటము మొదలుపెట్టింది. "ఓ రాజా, చింతించకు, నా ప్రాణాన్ని నీవు నిలుపగలవు. కాని నీవు నీకు ప్రియమయిన ఒకదానిని వదలివేయాలి" అని మాటలు వినబడ్డాయి. రాజు "అ దెంతసేపు? తప్పకుండా చేస్తాను" అన్నాడు. శిలావిగ్రహములోనుంచి "అయితే నీకుమారుల తలలునరికి ఆ రక్తబిందువులు నాపై చల్లాలి. తిరిగి ప్రాణము వస్తుంది" అనే మాటలు వినబడ్డాయి.

"ఈ పని నేను చేయలే"నంటూ రాజు విచారవదనుడై పిచ్చివానివలె ఇటుఅటు తిరగడం ఆరంభించాడు. ఇంతలో రాణి వచ్చి, సంగతి కనిపెట్టి, తనకు కలిగిన ఆపద ఏమిటో మనవిచేయమని వేడుకుంది. రాజు కొద్దిక్షణాలక్రింద జరిగినదానిని తెలియచేశాడు.

రాణి "జాన్, నీకొరకు తన ప్రాణాన్ని త్యాగము చేశాడు. ఇప్పుడు ఈపని చేయుట మన విధి" అంది. రాణి రాజువరలోని కత్తిని తీసింది. ఆడుకుంటూన్న పిల్లలదగ్గరకు వెళ్లింది. రాణి కత్తిని చేపట్టినందుకు వారు నవ్వారు. రాణి తిరిగి నవ్వింది. ఏమి జంకక వారిమీాదకు రాణి కత్తి ఎత్తింది. ఇంతలో ఆగండి అంటూ సాధారణ శరీరుడై జాన్ వచ్చి రాజుకుమారులను కౌగలించుకున్నాడు. "మీతల్లి సత్యవాదిఅగుటయే నాప్రాణమునకాధార మయింది" అంటూ వారిని ఎత్తుకున్నాడు. కాని రాజుకుమారులు జాన్‌ను విచిత్రముగ చూస్తూ 'నీ పే రే మని" అడిగారు. నన్ను విశ్వాసి జాన్ అని మీా అమ్మ, నాన్న పిలుస్తారు అని చెప్పాడు. అయితే ఇకనుండి మేముకూడ అలాగే పిలుస్తా మన్నారు. అందరు కలసి భవనానికి పయన మయ్యారు.

రుద్రమదేవి

(13-వ పేజీ తరువాయి)

కుమారులు రాలేదేమని మరిమరి ప్రశ్నించిరి. ఏమని చెప్పగలడు? మనస్సులో క్రోధము మండిపోవుచున్నది. అంతఃపురజనము నిషేధించుటచే తాను తన కుమారుని వెంట తీసికొని రాలేకపోతి నని చెప్పనా? మూతి బిగించుకొని యట్లే యతడు సభలో కూర్చుండెను. గొప్పవారి యింటి యాడుబడుచును వివాహమాడిన యల్లుని యవస్థలో నాత డుండెను.

మరియు నా సభకు ప్రోలరాతు ప్రసాదాదిత్యనాయడు రుద్రమనాయడు ఇత్యాది ఉన్నతోద్యోగులు వచ్చిరి. నేమినాథ దర్శన మగు వేళకు నాగదేవనాయడును మేచయనాయకుడునుగూడ వచ్చిరి.

పెద్దలను దర్శనమునకు ముఖమండపములోనికి రావచ్చునని సూచించుచు మనోజ్ఞ మగు ఘంటారావ మొండు మ్రోగెను. అది యొక యపూర్వమగు ఘంట! ముఖమండపమునకును సభామండపమునకును మధ్య నున్న రెండు ద్వారములలో నొక ప్రక్క నున్న ద్వారము తెరువబడెను.

మిక్కిలి ప్రొద్దుపోయినది. అందరును త్వరలో దేవదర్శనము కావించుకొని వెళ్లిపోవలె నని తొందరపడుచుండిరి. లోపలికి వెళ్ళు ద్వారము చిన్నది.

రాజబంధువులలో అగ్రగణ్యు డగు మహాదేవరాజు ముందు బయలుదేరి ముఖమండపములోనికి వెళ్లెను. అక్కడ జైనసాధువులు క్రిక్కిరిసియుండిరి. వా రెంతయు నాదరముతో నాతనికి గర్భాలయములో దిగ్వాసస్సుడగు నేమినాథదేవుని దర్శనము చేయించి షుచ్యము లగు ప్రసాదము లిచ్చిరి. అతడు వచ్చినదారినే తిరిగి వెళ్లుటకు వెనుకకు చూడగా, మరియొక రటు లోనికి వచ్చుచుండిరి. ఆ వచ్చువారిని తాను త్రోసికొనిపోవునా? అందుచేత మిక్కిలి గౌరవముగా నక్కడివారు మహాదేవరాజును ముఖమండపమునకు దక్షిణముగా నున్న మరియొక ద్వారమున తీసికొనిపోయిరి.

మహాదేవరాజుపిమ్మట ప్రసాదాదిత్యనాయడును రుద్రమనాయడును ప్రోలరాతును నాగదేవనాయడును మేచనాయడును లోనికి వెళ్లిరి. వారి కందరకు దేవదర్శనము చేయించి ప్రసాదము లిచ్చి యట్లే ఒకరొకరిని ప్రక్కద్వారమున బంపిరి. గర్భాలయములో సిద్ధసంధ్యాచార్యులు లేకుండుట మేచయ కాశ్చర్యమై వా రక్కడ లేరే యని యడిగెను. వా రావల నున్నా రని దక్షిణద్వారము చూపి యచ్చటికి నాతని బంపిరి. మేచయ కేదో సంశయము కలిగెను. కాని సంశయించుచునే అతడు దక్షిణద్వారమున ప్రవేశించెను.

ఆపిమ్మట పిల్లలమర్రిరెడ్లు—రేచర్ల కామిరెడ్డి నామిరెడ్డి మల్లయరెడ్డి గణపిరెడ్డి మర్రెడ్డి మధ్యాహ్నమునుండి వచ్చి వేచియున్నవారు దేవదర్శనమునకు వెళ్లిరి. వారివందరను ప్రసాద మిచ్చి మరియొకద్వారమున నావలకు పంపిరి.

ఇట్లే ప్రొద్దుపోవువరకు నగరములోని పెద్దలు దేవదర్శనమునకు ముఖమండపములోనికి వెళ్లుచునేయుండిరి. అక్కడనుండి వారిని కొందరిని దక్షిణద్వారమున మరికొందరిని ఉత్తరద్వారమున నావలకు పంపివేయుచుండిరి.

ప్రొద్దుపోవుచున్నకొలది దేవదర్శనమునకు సామాన్యప్రజల సందడి యెక్కువయ్యెను. ముఖమండపమునకును సభామండపమునకును మధ్య నున్న ద్వారము లా యొత్తిడికి సడలి మహాజనమునకు దారితీసెను. మహాకోలాహలముగా నక్కడ దేవదర్శన మగుచుండెను. వాకిట నిలచియున్న పరిజనములకు తమతమ ప్రభువు లెచ్చట నున్నదియు తెలియక వాహనములతో తహతహ లాడుచుండిరి.

అహింసావ్రతము

(7-వ పేజీ తరువాయి)

మును పే భోజనము చేసెదరు. నాసికవద్ద వస్త్రము నడ్డము పెట్టుకొందురు! పురుగులకు హింస జరుగునని వారి భయము. క్రిములు నాసికారంధ్రములద్వారా లోనికి ప్రవేశించి చనిపోయిన ఆ పాపము వారి కంటు నని వారు నాసికవద్ద గుడ్డ నడ్డము పెట్టుకొందురు! ఇక పాదములక్రింద బడి చచ్చు చీమలను కూడ వారు కాపాడ యత్నింతురు; చీమల పుట్టలకడకు వెళ్ళి ఆ పుట్టలపైన పంచదార జల్లుదురు. వారటుల పంచదార చల్లనిచో చీమల కాహార మెటుల లభ్య మగును? హిందువులు పాములకు పాలు పోయుదురు. అది పుణ్యకార్యముగా భావింతురు.

'పాములకు పాలు చీమకు పంచదార మేపుకొనుచున్న కర్మభూమిం జనించి' అన్నాడు జాషువాకవి. తేళ్ళను, పాములను చంపక విడిచిపెట్టెడి కరుణాంతరంగు లీ దేశమున గలరు. అది యంతయు నహింసావ్రతాచరణము.

"ఆకాశయాన మెరింగితిమి. సముద్రాంతరయాన మెరింగితిమి. కాని మనము భూమిపై నెటుల జీవించవలయునో తెలిసికొనలేకపోవుచున్నాము" అనినా డొక మహానుభావుడు. మానవునికి మానవునికి మధ్య సౌహార్దము లేకపోయిన నేమి! 84 కోట్ల జీవరాసులలో మానవజన్మ ముత్తమమైనందున, మానవులు మానవులు ద్వేషపూరితులై ఒండొరుల నాశమున కావేశపరు లగుట న్యాయవిరుద్ధమే గాని యీ విషయమున నే మతస్థులు సుదంచితు లగుటలేదు! ఘోరసమరసము లనివార్యము లగుచున్నవి. కోర్టులలో వ్యాజ్యములు దినదినాభివృద్ధి గాంచుచున్నవి. కాంతాకనకములకై మానవుల హత్యలు నిత్యము జరుగుచున్నవి. ఉత్తమమగు మానవజన్మ నానాటికి కల్మషపూరిత మగుచున్నది. ఇటువంటి పరిస్థితిలో, మానవుకు మానవుని ప్రేమించని శోచనీయపరిస్థితిలో అహింసావ్రతమున కీలోకమున స్థానము లేదు.

అప్పుడు లేనిదీ; ఇప్పుడున్నదీ!

(8-వ పేజీ తరువాయి)

ధిక్కరించిన హైదరాబాద్ జునాగఢ్ సంస్థానాల్ని మెడలు వొంచింది.

లోకంతో పాటు మనకీ కరువులొచ్చాయి. కాని కలవారి పక్షపాతబుద్ధి వల్ల అన్యులకు తీరిన లేమి మనకు తీరలేదు. గుజరాత్‌లో క్షామం వచ్చింది. ఏటేటా చెన్నరాష్ట్రంలోనూ, బొంబాయిలోనూ ఇదుగో అదుగో నంటూ క్షామం బెదిరించి పోతూవుంది. ఈయేడు బీహారుకీ ముప్పు వచ్చింది. 'వ్యాపారులెంత వంచించినా ఏదోవిధాన ప్రభుత్వం ప్రజల రోజు గడుపుతూవచ్చింది.

వీటికితోడు మలబార్, బెంగాల్ ప్రాంతాలలో ప్రారంభమైన కమ్యూనిస్టుల అరాచకం తెలంగాణాలో గాలి తోడైన అగ్నిశిఖలాగా చరచరా వ్యాపించింది. అక్కడనుంచి కృష్ణాగోదావరీనదీప్రాంతాలకు వ్యాపించింది. దాడులు, హత్యలు దోపిళ్లు చెలరేగినాయి. దేశమంతటా రైళ్ళప్రమాదాలు సంభవించాయి. అనేక వందలమంది ఈ అరాచకచర్యలకు ప్రాణాలు కోలుపోయారు. క్రమంగా కమ్యూనిస్టు పార్టీకి ప్రజలకు మధ్య ఎడబాటు వచ్చింది. ప్రభుత్వం కఠినచర్యలు తీసుకుంది. పోలీసుల దాడులుకూడా అధికం కావడంతో క్రమంగా అరాచకంఉధృతం తగ్గుతూ వచ్చింది.

యుద్ధం అనంతరం పరిస్థితి మెల్లిగా సర్దుకుంటూ, వస్తుసామగ్రి ప్రజల కళ్లబడ వచ్చే సమయానికి మూడో ప్రపంచయుద్ధచ్ఛాయలు ఆవహిస్తున్నాయి. కొరియా యుద్ధం ప్రారంభం కావడంతో మళ్లీ ధరలు కరువుల సంచలనం ప్రారంభ మయినాయి.

ఇవన్నీ ఆరోజు తరవాత ఉత్పన్నమైన సమస్యలూ, గడిచిన ముప్పులూ, గడవని గొప్పులూ.

ప్రజల బ్రతుకు ఎలా మారినదీ కనిపెట్టడం కష్టం. ఒళ్ళు వొంచి పనిచేసేవాడికి ఏనాడూ ఇబ్బందిలేదు. కృషికి ప్రతిఫలం ధరలతో పందెం వేసి పరుగు తియ్యలేక పోయినా రెక్కల్లో ఓపి కున్నంతవరకూ ఏదోవిధాన తెల్లవారకపోదు. ధనవంతులకు ధనం పాపంవలె పెరిగిపోతూనే వుంది. మిగతావారికి ఏకాలంలోనూ కోరికవన్నీ సమకూడవు. దేశకాలపరిస్థితుల్నిబట్టి ఈ మూడుతరహాల మనుషులికీ ఇప్పుడు రోజులు గడ్డుగానే వున్నాయి. కాబట్టి ఈతిప్పలన్నీ స్వాతంత్ర్యంవల్ల వచ్చినవని భావించడం పొరబాటవుతుంది. ప్రభుత్వాలు చేయగలిగినంత చేస్తూనే వున్నాయి. ఉద్యోగుల మనస్తత్వంవల్లనైతేనేమి; అసమర్థతవల్లనైతేనేమి; దూరదృష్టి లోపించడంవల్లనైతేనేమి; చేయతలపెట్టిన కార్యం కొనసాగక పోవచ్చును. అవపరం, ప్రజల సుముఖత, పరిస్థితుల అనుకూల్యం ఉంటే ఉద్యోగులెంత అసమర్థులైనా పనులు వాటంతటవే నెరవేరగలవు. కాని ఆ పరిస్థితులకు అవసరాలకు ప్రజల అందుబాటుకు ఉండాలి ఆపనులు. తలపెట్టేకార్యాలు వీనికి లోబడి ఉండాలి.

ఇంతవరకూ ప్రభుత్వాలు తలపెట్టిన కార్యాక్రమాలలో ఈపరతులకు ఎన్ని లోబడి ఉన్నాయని చూస్తే అంతా అగమ్యగోచరంగా ఉంటుంది. మచ్చుకు ఆహారసమస్యే చూస్తే ఈ లోపాలు కొట్టవచ్చినట్లు కానవస్తాయి. బావులు తవ్వడానికి ధన మిచ్చారు. ఉచితంగా భూము లిచ్చారు. ఋణా లిచ్చారు. కాని ఏం ఉపయోగం? దానాలకీ ఋణాలకీ అర్హులైన వారెవరో, ఈ ధనసహాయం, భూమి లేకనే కేవలం సేద్యం చెయ్యజాలకుండా ఉన్నవారెవరో సరిగా గమనించారా? ధనం తీసుకున్నవారు ఆ ధనాన్ని వడ్డీలకు తిప్పి, బావులు తవ్వించకుండా ఊరుకున్నవారున్నారు. తవ్వించడానికి పూనుకున్నవారు సగంలో వొదిలేశారు. తవ్వించడానికి సౌకర్యాలు సవ్యంగా అందవలసినవారికి అందలేదు. అవసరం లేనివారికి అందాయి. ఇది కేవలం పరిపాలకుల దోషమే కాదు. దీని బాధ్యత అందరిపైనా ఉంది. ఋణాలు ఎవరికి ఎంతెంత ఇస్తే పని సానుకూలపడుతుంది? భూము లెవరికిస్తే సవ్యంగా సేద్యాని కొస్తాయి? ఏ భూము లివ్వాలి? ధాన్య సేకరణ చూసినా అంతే. ఇవ్వగలిగినవారిని ఉద్యోగులు బలవంతపెట్టలేరు. ఇవ్వలేని వారిని ఒత్తిడి చేస్తారు. అసలు ఎవరెంత ఇవ్వగలరు? మిల్లరుచేతనే సేకరింపచేయాలా? లేక ఉద్యోగులు పూనుకోవాలా? ప్రస్తుతపరిస్థితుల్లో ఈ ఉభయవర్గాలకంటె అందరికీ విశ్వాసపాత్రమైన సహకారసంఘాలు మేలు కావా? అటువంటి సంఘాలు లేనప్పుడు ప్రభుత్వం స్థాపించాలా లేదా? స్థాపించవలసివస్తే భారం ప్రభుత్వంపైన ఎంత ఉండాలి? ప్రజలపైన ఎంత ఉండాలి? అవసరాన్ని బట్టి ఆయా వర్గాల్ని సమన్వయించినట్లయితే కొంత గాకపోతే కొంతైనా ఫలించకపోదు.

అంటే కార్యక్రమ నిర్ణయ విధానంలోనే మార్పు రావాలి. ప్రజలకు ప్రభుత్వాలు కొనసాగించే కార్యక్రమాలపైన విశ్వాసం కుదరాలి గాని, ప్రభుత్వంపట్ల విశ్వాసం ప్రజలకేర్పడ్డమే ముఖ్యసమస్య అంటే అర్థం లేదు. నెహ్రూ పేరుమీద భారం ఉంచి విరివిగా పెట్టుబడికి ధనం విసరాలని చెప్తే ఏవ్యాపారి ఒప్పుకుంటాడు?

కాబట్టి స్వాతంత్ర్యఫలం అందయు అందాలంటే ప్రచారంవల్ల కాక క్రింద చూపి ప్రభుత్వాలు ప్రజల విశ్వాసం పొంద



ఆకాశంలో ఒగ్గలకు ఎగిరి, కనివినియెరుగనియెత్తులకు పోవలెననే పోటీలో తూర్పు ఆఫ్రికాలోని కిల్మాంజరో మహా పర్వతంమీదుగా విచ్చలవిడి విహారంచేస్తున్న వైకౌంట్ విమానం.

డానికి ప్రయత్నించాలి. ప్రజలు తమ మేలేదో తెలుసుకోడానికి ఇప్పటి కొలబద్దలు పనికిరావని గ్రహించాలి. వ్యాపారదృష్టి ప్రబలడం ఒక విధంగా మంచిదే కాని దానికి దూరదృష్టి తోడుకావాలి. నలుగురి మేలే నా మేలూ అనే సత్యాన్ని గ్రహించాలి. ఇంతవరకూ వ్యాపారులేకాక అధికారంకోసం పెనగులాడేవారు, ఉద్యోగాలకోసం వెతపడేవారు, వృత్తుల్లో పోటీలు పడేవారు బొత్తిగా ఈ సత్యాన్ని విస్మరిస్తున్నారు. కరువొచ్చిన రోజుల్లో నలుగురికీ కాదని తనకే దాచుకొంటే, పరిస్థితులు విషమించి అంతా కాకులపాలు కాక తప్పదనే సత్యాన్ని గ్రహించడం లేదు. ఇలా గ్రహించకపోవడానికి కారణం వ్యక్తి స్వత్వాల్ని కాపాడ్డంలో. కాని, దుర్నయాల్ని అరికట్టడంలోగాని, పాటించవలసిన హద్దుల్ని కొనకపోవడమే. సమాజంపట్ల ద్రోహం చేసేవారు ప్రభుత్వానికి పట్టుబడకుండా తప్పించుకో గలుగుతున్నారు. స్వాతంత్ర్యంవచ్చిన తరవాత ఈ దుష్టశక్తులు మరింత విజృంభించాయి.

మనిషిని మనిషి మనిషిగా ఆదరించడం, సమాజం మేలొక్కటే తనమేలని గ్రహించడం ఎంతవరకూ సంభవించదో, పాలకులు తామూ ప్రజలలో చేరినవారేనని, ప్రజలు తామే పాలకులకు బలమనీ ఎన్నాళ్లు గ్రహించరో, అన్నాళ్లు మనకు లభించిన రాజకీయస్వాతంత్ర్యం పేరుకిమాత్రమే మిగిలిఉంటుంది. అంతవరకూ 1947 ఆగస్టు 15 కి ముందేమి లేదో ఆ తరవాతా అది ఉండదు. ఆ ముందేది ఉన్నదో అదే ఇప్పుడూ ఉంటుంది.

స్వాతంత్ర్యం లభించిన తరవాత కాంగ్రెస్ సర్వజనసమ్మతిమైన పాలకసంస్థ అయింది. కాబట్టి సర్వవర్గాలవారూ అందులో చేరి వేరె పార్టీలతో నిమిత్తం లేకుండా ఆసంస్థలోనే సంఘర్షణాన్ని కొనసాగించారు. పైచెప్పిన మనస్తత్వం కాంగ్రెస్‌లోనే ప్రత్యక్షమయింది. అందువల్లనే నెహ్రూ, పటేల్ ఎంత కష్టపడినా, మోజు ఎంతవరకూ పని చెయ్యగలదో అంతవరకూ సత్ఫలితాలు కలిగాయి. మిగతారంగం అంతా చీకటిలో ఊరేగింపుగా తయారయింది. ఇప్పుడు ప్రజలకి నెహ్రూ ప్రభుత్వంపట్ల విశ్వాసం ఉందని చెప్పాలా, లేక వారి ఆదేశాలపట్ల ఆదరం లేదని చెప్పాలా? ఎటూ చెప్పలేని పరిస్థితి వచ్చింది. కాబట్టి స్వాతంత్ర్యం ఫలం ఎంతవరకూ అందుబాటులోకి వచ్చిందని ప్రశ్నిస్తే, ఎవరిచేతి కెంత దక్కితే అంత లభించినట్లు అని సమాధానం చెప్పాలి. 1947 ఆగస్టు 15 కి పూర్వం ఇదీ లేదు కాబట్టి స్వాతంత్ర్యం వచ్చింది. దానితోపాటు ఊరేగుతూ రావలసినవన్నీ వెనకపడిపోయినాయని చెప్పవలసిఉంటుంది.

నేటిప్రపంచం

భద్రతామండలి *

పెకింగ్ నగరంలో మాలిక్ ఉన్నాడన్న గాలివార్తతోపాటు భద్రతామండలిలో రష్యన్ ప్రతినిధి జాకొబ్ మాలిక్ ప్రవేశించడంతో లోకమంతా సంచలనం బయలుదేరింది. రష్యా ఏయెత్తు వేస్తున్నదోనని ఊహాపోహాలు సాగాయి.

మండలిలో మాలిక్ చెప్పే ప్రతిమాటనీ, ప్రతిచేష్టనీ జాగ్రత్తగా గమనించసాగారు. పండిట్ నెహ్రూ చెప్పిన మాటలు చాలా బాగున్నాయని అందరూ అనేవారే.

రష్యా ఏయెత్తు యెత్తబోయినా మండలిలో తనకు గల సంఖ్యాధిక్యబలాన్ని వినియోగించడానికి అమెరికా కట్టుదిట్టాలుచేసి భారతదేశం ఎప్పుడెటు మొగ్గుతుందో గమనించసాగింది. విమర్శలతో ఆరోపణలతో దూషణలతో భారతదేశాన్ని తమపక్షానికి తిప్పుకోడానికి అమెరికాయత్నం. ఆరీతిగానే బ్రిటిష్అమెరికన్‌పత్రికలు ప్రచారం చేస్తున్నాయి.

రష్యన్‌ప్రతినిధి ఒకటవ తేదీని మండలిని సమావేశపరుస్తూ, 1. చీనాకమ్యూనిస్టు ప్రభుత్వంప్రతినిధిని ప్రవేశపెట్టి కొమింటాంగ్ ప్రతినిధిని వెళ్లగొట్టాలనీ, 2. కొరియాసమస్యను శాంతియుతంగా పరిష్కరించాలనీ - రెండు ప్రతిపాదనలు చేశాడు. అమెరికన్‌ప్రతినిధి వారెన్‌ఆస్టిన్ కొరియాలో దురాక్రమణను ఖండించాలని ఒక ప్రతిపాదన చేశాడు. చర్చనీయాంశాల కార్యక్రమనిర్ణయంపైన వోటింగులో రష్యన్‌ప్రతిపాదనలు వీగిపోయాయి. అమెరికన్‌ప్రతిపాదన నిలిచింది.

అమెరికన్ ప్రతిపాదనను చర్చించడానికిగాను కొరియాలోని ఉభయదేశాల ప్రతినిధుల్ని పిలిపించాలని రష్యన్ ప్రతినిధీ, దక్షిణకొరియాప్రభుత్వ ప్రతినిధి నొక్కనినే పిలిపించాలని జూన్‌లోచేసిన నిర్ణయం ఖాయమేనని అమెరికన్‌ప్రతినిధీ, వాగ్వాదాలు జరిపారు. జూన్‌లో అధ్యక్షత వహించిన భారతప్రతినిధి బి. యన్. రావుగారు "ఎవరికీ ఆక్షేపణ లేకపోతే దక్షిణ కొరియాప్రభుత్వప్రతినిధి ఒక్కడినీ పిలిపించవచ్చునని" అప్పుడు చేసిన నిర్ణయం మళ్ళీ మరో తీర్మానంవల్ల రద్దయేవరకూ ఉత్తరకొరియాప్రభుత్వప్రతినిధిని పిలిపించే విషయం ఆలోచించడానికైన వీల్లేదంటాడు అమెరికన్ ప్రతినిధి. ఇప్పుడు తాను అభ్యంతరపెడుతున్నందువల్ల ఆనాటి నిర్ణయం దానంతటదే రద్దవుతుందంటాడు రష్యన్ ప్రతినిధి. ఉత్తరకొరియాప్రతినిధినికూడా పిలిపించాలని యుగోస్లావియా ప్రతిపాదించినప్పుడు జూన్‌లో భద్రతామండలి ఎనిమిది వోట్లతో నిరాకరించిందనీ, ఆ నిర్ణయానికి తిరుగులేదనీ అమెరికావాదన.

ఈ విషయం ఇంతవరకూ తేలలేదు. రష్యన్ ప్రతినిధి భద్రతామండలికర్తవ్యం నిర్వర్తించకుండా నిరోధిస్తున్నాడని అమెరికన్ ప్రతినిధి, ఆంగ్లో-అమెరికన్ వర్గమే నిరోధిస్తున్నదని రష్యన్ ప్రతినిధీ పరస్పరం నిందారోపణలు చేసుకున్నారు. మాలిక్ నిశ్చలంగా కూచుని పుస్తకంలోనుంచి పాఠం చదువుతున్నట్లు "ఆంగ్లో-అమెరికన్ సామ్రాజ్యవాదవర్గాన్ని, యుద్ధోన్మాదుల్ని" తిట్టిపోస్తే, అమెరికన్ ప్రతినిధి చిందులుతొక్కి నోరుపారేసుకున్నాడు. ఉత్తరకొరియాప్రతినిధిని ప్రవేశపెట్టే విషయమై జరుగుతున్న రభస చూస్తే భద్రతామండలి మన మున్సిపల్ కౌన్సిల్‌ని తలదన్నుతోంది. ఈవివాదంపైన ఎలాగైన. అధ్యక్షుని హోదాలో మాలిక్ చేత రూలింగ్ ఇప్పిస్తే, దానిపైన వీటో భయంలేకుండా మెజారిటీవోట్లతో రష్యన్ వాదాన్ని ఓడించాలని అమెరికాయత్నం. రూలింగ్ ఇవ్వకుండా వీటోకి బలిచేదామని మాలిక్ ప్రయత్నం. ఈలోగా ఉత్తరకొరియాలో సామాన్యప్రజల నివాసాలపై బాంబులు వేసి అంతర్జాతీయయుద్ధనీతి నిబంధనల నతిక్రమిస్తున్న అమెరికన్ల దుర్నయాన్ని నిరసిస్తూ రష్యన్‌ప్రతినిధి ఒక ప్రతిపాదన తెచ్చాడు.

ఈ చర్చల్లో పండిట్ నెహ్రూ ఉన్నతాదర్శాలకు అనువైన శాంతియత్నాన్ని రష్యన్‌ప్రతినిధి ప్రశంసించాడు. పండిట్ నెహ్రూ ఆశయాలకు అనుగుణంగా ఆసియాలో "నవచైతన్య పూరితమైన శాంతి"ని స్థాపించడమే తమ లక్ష్యమని అమెరికన్‌ప్రతినిధి చెప్పాడు. కాని పండిట్ నెహ్రూమాటల్ని పాటించే దేశం మాత్రం కనిపించదు.

విషాక్తకిరణాలు *

ఒకవంక బ్రిటన్‌అమెరికాలలో విషాక్తకిరణాల్నీ, నాశంకరమైన బోంబుదండుల్నీ తయారుచేస్తుండగా మరొకవంక అగ్రదేశాల మధ్య సామరస్యానికి విఫలయత్నాలు కొనసాగుతూనే ఉన్నాయి. బ్రిటన్ అమెరికా రష్యాల పాలకాధిపతులు సమావేశమై ప్రపంచశాంతిసాధనకు కృషిచేయాలని ఐక్యరాజ్యసమితి ప్రధానకార్యదర్శి ట్రిగ్వేలీ ప్రతిపాదించాడో లేదో వెంటనే అది అసంభవమని ట్రూమన్ చెప్పేశాడు.

పీడకలవలె ప్రపంచమంతటా యుద్ధవాతావరణంఆవరిస్తోంది. అన్ని దేశాల్లోనూ వస్తువుల ధరలు మిన్నంటుతున్నాయి. బ్రిటన్ ఫ్రాన్సులు సాయుధసన్నాహాలు అతివేగంగా జరుపుతున్నాయి. జపాన్ జర్మనీలలో యుద్ధవీరులను తిరిగి పనికలిగే సూచనలు కానవస్తున్నాయి.

మిలిటరీ విషయాలు చర్చించడానికి అధికారం లేని యూరోపియన్ ఎసెంబ్లీ యుద్ధసంసిద్ధతకు తీర్మానం చేసింది. వీరితో చేరడానికి టర్కీ పర్షియాలు తహతహలాడుతున్నాయి.

టిబెట్‌కు యుద్ధప్రమాదం ఆసన్నమైనట్లు వార్తలు వస్తున్నాయి. చీనా కమ్యూనిస్టుసేనలు దండయాత్ర ప్రారంభించినట్లు వార్తలు వస్తున్నాయి. ఇండోచీనాలో ఫ్రెంచిఆక్రమితప్రాంతాల్లోఉన్న కొమింటాంగ్ సేనల్ని అమెరికన్లు సన్నాహపరుస్తున్నారు.

టిబెట్‌పై కమ్యూనిస్టులు దాడిచేస్తే అమెరికన్లు జోక్యం చేసుకోబోరని చెప్పబడింది. కాని ఏమి జరుగుతుందో నిర్ధారణగా తెలియదు.

కొరియాలో ఉత్తరదక్షిణాల మధ్యసరిహద్దును అమెరికన్ సేనలు దాటినట్లయితే భారతదేశం సహించబోదని స్పష్టపరచబడింది. కాని కొరియా దక్షిణతీరప్రాంతంలో యుద్ధం విషమస్థితిలోపడింది. చింజూ, మాసాన్, టెగూ, పొహాంగ్ ప్రాంతాల యుద్ధాలు కొరియాయుద్ధభవితవ్యాన్ని తేల్చగలవు.

[సూర్యనారాయణ]

మనదేశం

ఆగస్టు 15 స్వాతంత్ర్యదినోత్సవం తిరిగి వచ్చింది. స్వాతంత్ర్యం అనుభవిస్తున్న మూడేళ్లూ వరుణదేవుడు మోసంచేసినందువల్ల రేషన్ తగ్గింపులూ ఆకలిఅరుపులూ ఏటేటా ఈ సమయానికే వినవస్తున్నాయి.



ముఖ్యమంత్రి కుమారస్వామిరాజా

ఆ ప్రకారం ఈ యేడూ వింటున్నాం. అయితే దీపావళికీ, జనవరి 26 కీ పంచదార అధికంగా ఇచ్చి మిరాయిసరుకు చేసుకోనిస్తామన్నారు మున్షీగారు. జాతీయదినోత్సవాలు అగస్టు 15 వ తేదీని కాకుండా రిపబ్లిక్ అవతరించిన జనవరి 26 వ తేదీనే జరుపుకోవాలని భారతప్రభుత్వం సలహా ఇచ్చింది. అగస్టు 15 వ తేదీని నిరాడంబరంగా పతాకావిష్కరణమాత్రం జరుగుతుందట.

స్వాతంత్ర్యం లభించినప్పుడు బాధ్యత భారం అధికమౌతాయని చెప్పదలిచినట్లుగా మనకి 13 వ తేదీనుంచి బియ్యంరేషన్ మనిషికి ఏడౌన్సులనుంచి ఆరౌన్సులికి తగ్గించబడుతుంది.

వచ్చిన ఈ ఇబ్బందికారణం ఉత్తరాదినుంచి రావలసిన బియ్యం, జొన్నలు వగైరా పూర్తిగా రాకపోవడం, కృష్ణాగోదావరి జిల్లాలనించి బియ్యం రవాణాకి గూడ్సురైళ్ల రద్దీ తట్టుకోలేకపోవడం, దక్షిణాది జిల్లాల్లో ఋతుపవనాల గైర్‌హాజర్‌వల్ల పంటలు ఎండిపోవడం, కృష్ణా గోదావరి డెల్టా జిల్లాల్లో తుపాన్లవల్ల పంటలు వరదలపాలుగావడం అని మద్రాసు ఆహారశాఖామంత్రి రోచ్ విక్టోరియాగారు చెప్పారు. బియ్యం, గోధుమ సేకరించగల రాష్ట్రాలు సరిగ్గా సేకరించకపోవడం వల్లనూ, చెన్నరాష్ట్రంలో ఎంత ఆహారపదార్థం సేకరించగలరో, ఎంత పండిందో, ఎంత సేకరించారో కూడా సరైన లెక్కలు లేకపోవడంవల్లనూ అని ఢిల్లీపార్లమెంటులో మంత్రి మున్షీగారు చెప్పారు. బీహార్‌లో వరదలమూలంగా బియ్యం రవాణాకాలేక నిలిచిపోవడంవల్లనైతే నేం అసలు పంపడానికి లేకపోవడంవల్లనైతే నేం రెండు జిల్లాల్లో కరువు తలచూపింది.

ఈ రెండురాష్ట్రాలకీ బియ్యం, గోధుమ, మైలో, జొన్న. చేతికి చిక్కినంత తరమగలరనీ, ఎక్కడా ఎవ్వరూ ఆకలితో చావకుండా కాపాడగలరనీ మంత్రి మున్షీగారు హామీ ఇచ్చారు. ఆ సరుకొచ్చినా సరే ఆరౌన్సులే ఇవ్వవలసిఉంటుందని కుమారస్వామిరాజాగారు రోచ్‌విక్టోరియాగారు చెన్నపట్నంలో చెప్పారు. మొత్తానికి ఈ అరాకలిరేషన్ ఈ సంవత్సరాంతంవరకూ ఉంటుందని ముఖ్యమంత్రి కుమారస్వామిరాజాగారన్నారు.

దక్షిణాదిజిల్లాల్లో గోధుమనిలవ ఉన్నప్పటికీ బియ్యానికి ఇబ్బందిపడుతున్నారని గోధుమనిలవ పీసమైనా లేని విశాఖజిల్లానుంచి బియ్యాన్ని తరలిరాచేస్తున్నారు. ఆ జిల్లాలో అడిగినవారికి మూడౌన్సుల రేషన్ ఇస్తే చాలన్నారు. తంజావూరు జిల్లాలో పన్నెండు నెలల్లో ప్రతినెలలోనూ ఏడాదికి సరిపడిన ఆహారాన్ని నిలవచేసుకోవచ్చని చెప్పిన ఉత్పత్తిదారులవద్దనుంచి రెండుమాసాల వాడుకధాన్యాన్ని సేకరణాధికారులికివ్వాలంటూ ప్రభుత్వం కోరగా వారంగీకరించారు. మరి మూడుమాసాలధాన్యం ఇవ్వవలసిందని కలెక్టరు అడిగారట. ధాన్యసేకరణ జూలైనెల్లో కృష్ణాగోదావరిజిల్లాల్లో వారానికి వేల టన్నులచొప్పున జరిగితే తంజావూరు జిల్లాలో 877 టన్నులే లభించిందట. తంజావూరులో సేకరణ సరిగా జరగలేదనీ, జరిగితే బోలెడు దొరుకుతుందనీ కేంద్ర ప్రభుత్వోద్యోగులు విచారణచేసి చెప్తే, ధాన్యం ఇవ్వడంలేదనేమాట కృష్ణాగోదావరిజిల్లాలమీద పడింది. ఎవరివల్లనైతే నేం రేషన్ మళ్ళీ తగ్గించబడింది.



కేంద్ర ఆహారమంత్రి కె. ఎం. మున్షీ

ఆహారసమస్యపైన పార్లమెంట్‌లోనూ, మద్రాసుశాసనసభలోనూ చర్చలు జరిగాయి. మద్రాసుశాసనసభలో ప్రతిపక్షం వారు మాట్లాడినా సేకరణవిధానం

లోపభూయిష్ఠంగా ఉందనీ, కంట్రోల్స్ నిరుపయోగంగా ఉన్నాయనీ విమర్శించిన వారే.

ఢిల్లీలో పార్లమెంట్‌లో బెంగాలీశరణార్థుల సమస్యపై తీవ్రచర్చ జరిగింది. తూర్పు బెంగాల్లో హిందువులకు క్షేమం లేదనీ, నెహ్రూ-లియాఖత్ ఒడంబడిక సఫలం కాలేదని డా॥ శ్యామప్రసాద ముఖర్జీ ప్రభృతులు విమర్శించారు. అక్కడ మిగిలిన హిందువుల్ని తీసుకొచ్చేకి, వొచ్చినంతమంది మహమ్మదీయుల్ని ఇక్కడనుంచి తరిమెయ్యాలనీ, లేక తూర్పు బెంగాల్ జనాభాలో మూడోవంతు జనాభా వొచ్చేశారు కాబట్టి మూడోవంతు భూభాగాన్ని పశ్చిమ బెంగాల్‌లో కలపాలనీ డా॥ ముఖర్జీ సూచించారు. ఈ సూచనలు పాకిస్తాన్‌లో యుద్ధానికి మాత్రమే దారితియ్యగలవనీ, తాను ప్రభుత్వంలో ఉన్నంతవరకూ అటువంటివి జరగబోవనీ పండిట్ నెహ్రూ సమాధాన మిచ్చారు. ఒడంబడిక జరక్కముందు పరిస్థితికంటె జరిగినతరవాత పరిస్థితి చాలా మేలుగా ఉందనీ, ఈనాడు తూర్పు బెంగాల్లో హిందువులికి పూర్తిగా క్షేమభద్రతలు లేవని భావించడానికి కారణాలున్నప్పటికీ, అది ఒడంబడిక విఫలమైనట్లు నిరూపించవనీ పండిట్ నెహ్రూ చెప్పారు.

ధరల పెరుగుదల *

ధరల పెరుగుదల నరికట్టడానికి గాను భారతప్రభుత్వం అధికారం తీసుకుంటున్నది. నిత్యవసరవస్తువులు, మొదలైన సరుకులపై ధరలను నిర్ణయించే అధికారం రాష్ట్రాలకే ఉంది. కాని అత్యవసరపరిస్థితుల్లో స్టేట్స్ కౌన్సిల్ అనుమతిపైన ఈ అధికారాన్ని కేంద్రప్రభుత్వం తీసుకోవచ్చును, ఇప్పుడు స్టేట్స్ కౌన్సిల్ లేదు. కాబట్టి పార్లమెంటుఅనుమతి తీసుకోవచ్చును. రాష్ట్రపతిఆజ్ఞపైన ప్రభుత్వం ఇప్పుడు పార్లమెంటులో ఆ అధికారం తీసుకోడానికి అనుమతి కోరుతూ తీర్మానం ప్రవేశపెట్టింది. తీర్మానం పార్లమెంటుచేత ఆమోదించబడింది. ఈ అధికారంకింద త్వరలో అవసరవస్తువుల ధరలు పెరిగిపోకుండా తగుశాసనాన్ని రాష్ట్రపతి ఆర్డినెన్సుద్వారా అమలు జరుపుతారు. పార్లమెంటు తిరిగి సమావేశమైనప్పుడు అదే శాసనంగా ప్రవేశపెట్టబడుతుంది.



లాయిక్ అలీ

లాయిక్ అలీ *

హైదరాబాద్ రజాకార్ ప్రధాన మంత్రి మీర్ లాయిక్ అలీ పరారైన సందర్భంలో లాయిక్ అలీ, అతని సోదరి మొదలైన పదహారుమందిపైన హైదరాబాద్ కోర్టులో తేబడిన కేసులో తీర్పు చెప్పబడింది. పదహారుగురిలో ఏడుగురు పరారిలో ఉన్నారు. మిగిలిన తొమ్మిది మందికీ హైదరాబాద్ స్పెషల్ మేజిస్ట్రేటు శిక్ష విధించారు. దీనిపైన తొమ్మిదిమందీ హైదరాబాద్ హైకోర్టులో అపీల్ చేశారు.

అసలు లాయిక్ అలీ నిర్బంధమే నూతన రాజ్యాంగంప్రకారం క్రమవిరుద్ధమైనదనీ, అందువల్ల అతని పరారిలో తోడ్పడినవారుగాని లాయిక్ అలీగాని నిందార్హులు కారని హైకోర్టు తీర్పు ఇచ్చింది. బొంబాయి హైకోర్టు కమ్యూనిస్టు నిర్బంధితుల్ని విడిచిపెట్టిన కారణాలకే, అనగా కాలపరిమితి లేకుండా, ఎడ్వైజరీ కౌన్సిల్ పరిశీలనైనా జరపకుండా వ్యక్తుల్ని నిర్బంధంలో ఉంచడం నూతనరాజ్యాంగనిర్బంధ నిబంధనలప్రకారం, ప్రివెంటివ్ డిటెన్షన్ చట్టంప్రకారం క్రమవిరుద్ధమనే కారణం చెప్తూ నిందితులు నిర్దోషులని తీర్పు ఇచ్చారు. 1948 సెప్టెంబర్‌నుంచీ నిర్బంధంలో ఉంచినప్పటికీ లాయిక్ అలీపై కేసు తీసుకురాలేకపోవడానికి ప్రభుత్వోద్యోగులపైన హైదరాబాద్‌లో తీవ్రవిమర్శలు వచ్చాయి. కేసు తీసుకురాలేకపోవడాని కింతవరకూ ప్రభుత్వం ప్రజలకు సంజాయిషీ చెప్పలేదు. కేసు తీసుకురాలేకపోయినప్పుడు కాలపరిమితి లేకుండా నిర్బంధంలో ఉంచడం రాజ్యాంగనిబంధనవిరుద్ధమే.

[సీతారామ్]

"కాంతాకనకాలు"

(19 వ పేజీ తరువాయి)

మల్ కాండల్ స్లిప్పర్లు-అద్దాల కళ్లజోడు- తదుపరి పొందూరుఖద్దరుపంచెలు - ఖద్దరులాల్చీ అంతా స్వదేశీవ్యవహారం. తరువాత షర్టు పైజమాలు అన్నీ తెల్లటివే తొడిగేవాడు. ఇప్పుడు ఫుల్ పాంట్లూ సిల్కుషర్టులమీదే నడుస్తూండటం గమనించి కొద్దిగా నవ్వి అన్నాడు ధర్మారావు.

'కొంతకాలం హిందూమహాసభ అనీ కొంతకాలం రాడికల్ డిమోక్రాట్ అనీ చాలాకాలం కాంగ్రెస్సనిపించుకుని సోషలిస్టుకూడా అయి చివరకు కమ్యూనిస్టుల్లో కలిసిపోయినట్లు...' వాక్యం పూర్తిగాకుండానే 'బాబోయ్! ఆ మాట గట్టిగా అనకు. ఆ పుణ్యంకాస్తా నీకు దక్కుతుంది.'

'నీ కేమిటోయ్ శ్రీ తలెత్తింది.' అని ఆగి-'పిల్లలా?' అన్నాడు ధర్మారావు.

చక్రి పాకు తిన్నవాడిలా అయి "మా ఆవిడను చూపిస్తాను రావోయ్. వెయిటింగురూములో వుంది. మా బేబీనిగూడా చూద్దువుగాని" చెయ్యి బుచ్చుకుని బరబరా ప్లాటుఫారంమీద లాగటానికి సిద్ధమయాడు.

నిజానికి ధర్మారావుకు చక్రిభార్యను చూడాలని లేదు. చక్రధరరావు ధర్మారావును రెండుచేతుల్లో గట్టిగా పొదివి పట్టుకుని నడుస్తున్నాడు.

చక్రధరరావుభార్య ఆడవాళ్లవెయిటింగు రూముగుమ్మంలో నుంచుని కమలాఫలం వొలుస్తున్నదల్లా తన భర్తప్రక్కను అనుకొని నడుస్తూన్న సామాన్యదుస్తుల్లో తక్కువ తరగతికి చెందిన వ్యక్తిలా కనుపిస్తూన్న ధర్మారావుని చూడగానే ఏ మనుకుందో-జోళ్లు టకటకా చప్పుడు చేసుకుంటూ లోపలకు వెళ్లిపోయింది.

ఆమెకు చక్రధరరావు పిలుపు అందినట్లు లేదు...ఆవిడ లోపల్నుంచి యివతలకు రాలేదు. కాని కిటికీలోంచి కమలాఫలం తొక్కలు గింజలు మాత్రం ధర్మారావు నుంచున్నచోటుకు కొద్ది సమీపాన వచ్చి పడ్డాయి.

'డామిట్!' అంటూ చక్రి లోపలకు వెళ్ళి, గుండ్రటిబల్లమీద తాత్కాలికంగా దిండువేసి పడుకోబెట్టబడిన పిల్లనెత్తుకుని ధర్మారావుదగ్గరకు తీసుకొచ్చి:

'ఇదిగోనోయ్ మా కృషిఫలం ప్రస్తుతానికి బేబీ అని పిలుస్తున్నాము. ఎందుకంటే పేరువిషయంలో చిన్న క్యారత్ మాయిద్దరిమధ్యా వచ్చింది. నేను మోశాను, మా అమ్మపేరు పెట్టుకుంటానంటుంది. నాన్నెన్ను నువ్వు మొయ్యడమేమిటి? మా అమ్మపేరు పెట్టుకుంటానన్నాను నేను. ఇది తెగలేదు. బారసాల చెయ్యలేదు. నువ్వే మంటావోయ్. నేను నీ సజెషన్ వాల్యూ యిస్తాను.'

ధర్మారావు కొద్దిగా నవ్వి - 'ఒకపక్షం అభిప్రాయాలు మాత్రమే విని కేసు మీద తీర్పు యివ్వటం ధర్మసమ్మతం గాదురా చక్రీ!' అన్నాడు.

చక్రి మళ్లీ పిలిచాడు భార్యను. ధర్మారావు చక్రధరరావుచేతుల్లో కాళ్లూచేతులూ ఆడిస్తూన్న శిశువు నందుకొని వ్రేలితో కితకితలు పెట్టి బోసినవ్వులు నవ్విస్తున్నాడు.

ఆవిడగారు లోపల్నుంచి యీవల కూడ రాలేదు. మళ్లీ పిలుద్దామనుకుంటూండగా-ధర్మారావు అడ్డువచ్చి వారిస్తూ— 'ఆవిడకు సిగ్గు ఎక్కువేమో—పోనీస్తూ; పిల్లను చూశానుగా.' అన్నాడు.

చక్రధరరావు చిన్నబోయి 'మరి మా బేబీకి పేరుపెట్టటంమాటో...నువ్వేతగూ తీర్చవలసినవాడివోయ్. నీవల్లే కావాలి.'

ధర్మారావుచేతిలోని పాప కవ్వుమంటూ లంకించుకుంది. వెంటనే భుజంమీద వేసుకొని చేత్తో తడుతూ జో కొట్టాడు. చక్రధరరావు నోరు యింత చేసుకుని—

'నాకు బేబీ ఏడిస్తే చాలా చిరాగ్గా వుంటుంది. నీకు పిల్ల లేడిస్తే అయిష్టంగా వుండదూ?'

'ఏడిస్తే వాళ్ల కారోగ్యమోయ్,'

దూరాన రైలు వస్తూన్న జాడయింది. ధర్మారావు 'టైమెంతయిందీ?' అన్నాడు. చక్రధరరావు గడియారంకేసి చూసి — 'సారీ—ఆగిపోయింద'ని లోపలకు వినిపించేలా 'రుక్కూ టైమెంతయిందీ?' అని బ్రతిమాలుతూన్నట్లుగా అడిగాడు. ముందు గాజుల చప్పుడు—పర్యవసానంగా 'ఒంటిగంట.' అని ఆవిడసమాధానం.

'ఈ బండిలోనేనా వెళ్ళటం?'

ధర్మారావు చూస్తూండగా ఇంకో సిగరెట్టు ముట్టించి పీలుస్తూ "మద్రాసు పోతున్నానోయ్. నా నెఫ్కి వంట్లో కొంచెం సుస్తీగా వుంది. మళ్ళీ వారం పదిరోజుల్లో వచ్చేస్తాం. నీతో సావకాశంగా చెప్పవలసిన సంగతు లున్నాయి. గాకావుగా నే నెంత మారిపోయానో-"

స్నేహితు లొకరిహృదయాల్లో కొకరు

చూసుకున్నారు. ఏవో ప్రాతతలపులు తలుపులు విచ్చుగున్నై మనస్సుల్లో.

'మళ్ళీ కలుసుకుందాం.' అని చేతులు కలిపి ఒక్కమాటు చక్రి చేతుల్లోకి మారిన పసిపిల్లబుగ్గ చిటికి ధర్మారావు వెనక్కు మళ్ళాడు.

రైలు వచ్చి ఆగింది. కాంతారావుని గుర్తుపట్టగలనా? అని ధర్మారావు అనుమానం. సరే! అనుకుని టికట్లగేటువద్ద నిలుచుని వచ్చే పొయ్యే ప్రయాణీకులను పరిశీలిస్తున్నాడు. 'బాబాయ్.' అని పిలుపు విన పడింది.

ధర్మారావు వెనక్కు తిరిగి చూశాడు.

కాంతారావు నవ్వుతున్నాడు. భారీ ఎత్తైన కుర్రాడు. కళ్లు పెద్దవి. ముఖం గుండ్రంగా వుంది. నుదురు విశాలంగా వుంది. పైన కొద్దిగా వంగిన మెత్తని పట్టుకుచ్చులాంటి జుట్టుకేసి చూసి 'ఎంతవాడివయ్యావు రా! పద యింటికి.' అన్నాడు. ధర్మారావు అతడి చేతిలోని సంచీ పట్టి పుచ్చుకున్నాడు. ఇవతల నడుస్తూ 'ఇంటి దగ్గరంతా కులాసా. అత్తయ్య తగూలాడకుండా వుంటోందా?'

అన్నింటికీ 'వూఁ' అంటూ ఆ కుర్రాడు బరువైన ట్రంకుపెట్టెని యీడ్చుకొస్తున్నాడు.

బయట ఎండ తీక్ష్ణంగా సారికేళపాకాన నడిచిన కవిత్వంలా అల్లుకుపోతోంది. సామాను రిక్షాలో వేసి యిద్దరూ నడక సాగించారు. కాంతారావు నీరికావి చొక్కా తొడుక్కున్నాడు. రైలుబోగ్గుని ప్రయాణంవలన కట్టుకున్న పైజమా నల్లబడిపోయింది. తలకాయ చెదిరి జుట్టంతా రేగి నానాచిరాకుగాను వుంది మనస్సు.

ధర్మారావు బయట నడుస్తూన్నంతసేపూ కాంతారావు భుజంమీద చేయివేసి మాట్లాడుతూనే వున్నాడు. కాంతారావు రోడ్ల మీది సినిమాపోస్టర్లను దొంగతనంగా చూసి కలిగిన సందేహాలను మనస్సులో కప్పిపెట్టుతున్నాడు. కాని బాబయ్యను అడగ సాహసించటంలేదు.

చివరకు ధర్మారావు అన్నాడు 'ఏరా ఛంటీ సోడా త్రాగుతావా? కాఫీ త్రాగుదామా? అని.

కాంతారావు 'ఇంటి కెళ్ళి మజ్జిగ త్రాగుతేగాని దాహం తీరదు. బాబయ్యా' అని విముఖత చూపాడు. [సశేషం]



నార్వే రాజధాని అస్లో నగరం స్థాపించబడి యిప్పటికి 9 శతాబ్దాలైంది. ఆ మహోత్సవాన్ని పురస్కరించుకుని ఎడిన్‌బర్గ్ నగరం తరఫున మతాధికారి సర్ ఆండ్రూముర్రే అస్లో పురపాలక సంఘాధ్యక్షునకు ఒక రజితమందసాన్ని బహూకరించారు. ఈ సందర్భంలో ప్రసంగించుతూ ఆయన గత యుద్ధతరుణంలో ర వేల మంది స్కాట్‌లాండ్ యువతులు నార్వేయువకులను వివాహం చేసుకున్నట్లు వెల్లడించారు.

నక్షత్రకుని దర్పం

(29-వ పేజీ తరువాయి)

సంగతి చెప్పాడు నక్షత్రకుడు.

అప్పుడు విశ్వామిత్రుడు కోపగించి, "ఎప్పుడూ అబద్ధాలు ఆడకు" అని జ్ఞానోపదేశంచేశాడు నక్షత్రకునికి.

నక్షత్రకుడు తన భారం తీరిపోయిందని సంతోషించాడు. కాని అప్పుడైనా అబద్ధాలు మానలేదు.

హరిశ్చంద్రమహారాజుతో వెళ్లేటప్పుడు తిండే తినలేదని, కాళ్లు బొబ్బలెక్కేటట్లు భీకరారణ్యాలలో నుండి నడచిపోయానని అబద్ధాలు చెప్పాడు!

హరిశ్చంద్రమహారాజు అన్నివిధాలా కష్టాలపాలై తిరిగి తన రాజ్యాన్ని సంపాదించి వచ్చేసరికి, ఈ నక్షత్రకునికి గుండెలు కొట్టుకోవటము ప్రారంభించింది — ఏం చేస్తాడో అని. కాని హరిశ్చంద్ర మహారాజు నక్షత్రకుని పిలిచి గౌరవించిబహుమానం యిచ్చి పంపాడు. పాపం నక్షత్రకుడు చాలా సిగ్గుపడ్డాడు......

★ కొరియా యుద్ధం ★



అమెరికానుంచి డగ్లస్ మెకార్థరుకు పంపబడిన ఐక్యజాతిసమితి జెండా.



ఉత్తరకొరియా విమానకేంద్రంమీద అమెరికా విమానచర్యలు



అమెరికానుంచి క్రొత్తగా కొరియారంగానికి పంపబడిన రాకెట్ ప్రయోగ యంత్రం. 100 మిల్లిమీటర్ల ఫిరంగులకుకూడా అంకెకురాని ఉత్తరకొరియాటాంకులను దీనితో తుక్కు తుక్కు క్రింద నలగ్గొడుతున్నారు.



ఉత్తర కొరియా సేనలపై ఎత్తి వెళ్ళటానికి జపానులో సిద్ధంగా ఉన్న అమెరికా బాంబర్ విమానంలో బాంబులు.

Regd. No. M. 4479 వెల 4 అణాలు

Edited, Printed & Published by S. Sambhu Prasad, at the Andhra Patrika Press, 7, Thambu Chetty St., Madras.